
గురువులు

# బుద్ధ భగవానుడు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# బుద్ధ భగవానుడు

రచన :

భూక్యా చిన వెంకటేశ్వర్లు D.J.

ప్రచురణ :

M/s యోజిత్ బుక్ లింక్స్

7-16-68/1, పల్లూరివారి తోట, గుంటూరు - 522 002

ఫోన్ : 235692

# అంకితం



**శ్రీ సి. కమలేశ్వరరావు,** I.A.S.

(రాష్ట్ర హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్) గారికి

**వారి సతీమణికి**

ఈ పుస్తకం అంకితమిస్తున్నాను

- రచయిత

# బుద్ధ భగవానుని స్తుతి


**- రవీంద్రనాథ్ టాగూర్**



దివ్య రూపము నందిన తేజమీవు
ప్రాణరూపివి, నిర్వాణ పదవి నీవు;
నిన్నెనమ్మితి నాకిక నీవె శరణు

భవ్య భవదీయ జ్యోతి ప్రభావమిందు
నా తమః శిఖను వెలుగ నానతిమ్ము:
నీ యశోముద్ర నొకసారి నిలిపితేని
నా బొమలపైన పాపము నాశమగును

భవ్యరూపము దెచ్చు నీ పాదవహ్ని
మార్చగలదు బంగరువోలె మలినమెల్ల
నా హృదంతర వీధిలో నడచుచున్న
చీకటులనెల్ల జ్వాలలో చేర్చుమయ్యా
భ్రమయను మునుంగు నొకసారి భవహరమగు
వేదనలతో నిపుడె చింపివేయుమయ్య



# ఆదర్శ కర్మయోగి బుద్ధ భగవానుడు

**- స్వామి వివేకానంద**

"ఈ కర్మయోగమును, యదార్థమున నాచరణలోనికి దెచ్చిన యొక మహనీయుని గూర్చి, కొద్ది మాటలు చెప్పి. నాయుపన్యాసమును ముగించెదను. ఆ మహనీయుడే బుద్ధుడు. కర్మయోగమును లెస్సగ ఆచరించిన వాడాయన యొక్కడే. స్వార్థరహితమైన కర్మానుష్ఠానమున దురంధురులైన జగద్గురువుల కందరకును, బాహ్యోద్దేశముల ప్రేరణ యుండెను. ఒక్క బుద్ధునికి మాత్రమే అట్టి ప్రేరణ ఏమియు లేదు. ఏ ఇతర ప్రేరణ లేకుండా, కర్మానుష్ఠానము నాచరించిన యాదర్శ కర్మయోగి యతడు. మానవ చరిత్రలో ఆయనకు సాటియైన వారులేరు. ప్రతిభ, కారుణ్యం ఆయనలో మహత్తరమైన, పొత్తు కుదిరి మెలగినవి. అంతటి ఆత్మశక్తి యొక్క అభివ్యక్తి కూడ నెచ్చటను కన్పించదు".

"చరిత్ర దృష్ట్యా బౌద్ధమత మతిముఖ్యమైన మతము, దార్శనిక దృష్ట్యా మాత్రము కాదు. ప్రపంచంలో నెన్నడును ఇట్టి ఆధ్యాత్మిక సంచలనము కన్పించలేదు. ఇట్టి ప్రభూతమగు ఆధ్యాత్మిక తరంగములు, మానవజాతిలో నెన్నడును బయల్పడలేదు.

ఇదియే బౌద్ధము యొక్క విశిష్టత!

# బుద్ధుడు : బుద్ధ ధర్మం

- దలైలామా

కేవలం బాహ్యమైన మార్పులు ద్వారానే, అంటే పరివ్రాజక జీవితాన్ని గడపడం ద్వారానే, పవిత్రగ్రంధాలను పఠించడం వల్లనూ బౌద్ధధర్మాన్ని పరిపూర్ణంగా అనుష్ఠించినట్టు కాదు. ఈ చర్యలు వాటంతటవి అవిగానే మతసంబంధమైనవిగా, గుర్తించబడుతాయా లేదా అనేది సంశయమే.

ఎందుకంటే - మత ధర్మమనేది మనస్సులోనే సాధన చేయాలి. సరియైన మానసిక పరిపక్వస్తితి గల వ్యక్తి యొక్క శారీరక చర్యలు, భాషణలు, స్వ చర్యలూ మత ధర్మపరమైనవే అవుతాయి. సరియైన దృక్పథం లేని వ్యక్తి, సరియైన అవగాహనతో ఆలోచన చేయలేని వ్యక్తి, యావజ్జీవితమూ ఆరామాల్లో గడిపినప్పటికీ, పవిత్ర గ్రంధాలు పఠించినా తానేమీ సాధించలేడు. అందువల్ల బహు ప్రధానమైంది ఏమంటే - త్రిరత్నములైన బుద్ధ - ధర్మ - సంఘాలను భక్తి విశ్వాసాలతో అంతిమశరణులుగా స్వీకరించాలి. కర్మ-తత్ఫలితాల్ని తాను ఆమోదించి, పరుల సుఖసంతోషాలకై ఉపయుక్తమైన భావనల్ని నిరంతరం పెంపొందించుకోవాలి.

"ప్రజల నిత్యజీవితాల్లో అనుసరించేందుకు ఏవిధమైన ధర్మాన్ని లేక ఏవిధమైన మతాన్ని సూచించాలి? ప్రాపంచిక నీతిహీన చర్యల్ని సహజంగా వర్జించాలి. ఎందుకంటే - ఇవి ఏమతధర్మంతోనూ రాజీపడవు కాబట్టి. కానీ నైతికంగా సమర్థించవలసిన చర్యలు అంటే తన దేశ ప్రభుత్వ పాలనలో తగురీతిన తోడ్పడం, శ్రేయోదాయకమైన పనుల్ని చేయడం ముఖ్యం.

టిబెట్టులో ఒకలోకోక్తిని గురించి చెబుతాను.

"పర్వత గుహల్లో నివసిస్తూ కూడా, మానసిక సాధన చేయనివాడు - కలుగుల్లో వుంటూ నరకలోకం చేరేందుకు మాత్రమే ఉపయోగపడే కారణాల్ని స్వీకరిస్తూ నివసించే మృగములు లాంటివారు".

కనుక మానసిక ఔన్నత్యాన్ని సాధించడం అన్నిటికంటే ముఖ్యం. పరుల శ్రేయస్సుకు జీవితాన్ని వినియోగించడం మరింత ముఖ్యం!

# బోధిచిత్త

మనిషి ఒకడే కాదు. సర్వప్రాణులూ దుఃఖానికి గురి అవుతాయి. మనం కేవలం మనగురించే కాదు. సర్వప్రాణుల సంక్షేమం గురించి ఆలోచించాలి. మన ఆలోచనలూ, చేష్టలూ పరసేవాతత్పరతా పూరితములై వుండాలి. ఉన్నతశ్రేణికి చెందిన జీవులేగాక, బహు సూక్ష్మజీవులు సైతం అనుభూతిని పొందుతాయి. అందువల్ల దుఃఖాన్ని అసహ్యించుకుంటాయి.

మాధ్యమిక తత్వవేత్త ఆర్యదేవులు యిలా చెప్పాడు.

"అత్యున్నతులను మానసిక దుఃఖం వేదిస్తుంది
అధమశ్రేణి జీవులను భౌతిక దుఃఖం వేధిస్తుంది
మానసిక, శారీరక దుఃఖాలు
ప్రపంచాన్ని శాశ్వతంగా దహిస్తున్నాయి"

ప్రాణులు సుఖశాంతుల్ని వాంఛిస్తాయి. దుఃఖం నుండి విముక్తిని కోరతాయి. సుఖాన్ని ఏవిధంగా పొంది దుఃఖం నుండి ఏవిధంగా విముక్తి పొందాలో తెలుసుకోలేని నిస్సహాయులం.

ఈ విశ్వమయమైన నిస్సహాయతను దృష్టిలో వుంచుకొనే - జీవులకు దుఃఖాన్ని కలిగించే కారణాలనుండి వైదొలుగునట్లును, సుఖశాంతులు చూపే ప్రయత్నంలో ఎక్కువగా శ్రమించాలి. అయితే యీ దుఃఖ నివృత్తికి, సుఖశాంతుల సాధనకు ప్రతివ్యక్తీ తనకు తానుగానే, దుఃఖకారణాల్ని తుడిచి వేయాలి. మరియు సుఖశాంతుల కారణాల్ని గురించి నిర్ణయించుకొని సరియైన కృషి జరపాలి. దీనికి మించి మరొక మార్గం లేదు.

బుద్ధ భగవానుడు యిలా ప్రవచించాడు.

"సర్వ బుద్ధులచేత పాపాలు ప్రక్షాళనం చేయబడవు. సజీవ ప్రాణుల దుఃఖాలను చెరిపివేయలేరు. శారీరకంగా ఒకరి నుండి వేరొకరికి జ్ఞానం బదలాయింపు కాలేదు. పవిత్రధర్మం యొక్క "లోపరహిత సత్యమే" దుఃఖ నివృత్తిని కల్పించగలదు.

ముల్లు తీయగానే బాధ తగ్గి పోయినట్లు, జలంతో శుభ్రం చేయగానే దుర్గంధం తగ్గినట్లు చేతితో యిలా అన్నంత మాత్రం చేత దుఃఖాలు ఒక్కసారిగా సమసిపోవు. అందువల్ల బుద్ధుడు తన అత్యున్నత జ్ఞానసంపదను శారీరకంగా మరొకరికి బదలాయింపు చేయలేదు. మరైతే గత్యంతరం ఏమిటి ?

బుద్ధుడు యిలా ప్రవచించాడు.

"శూన్యం యొక్క అస్తిత్వం సహాయంతో నీవు ప్రపంచాన్ని దాటగలవు".

అనుష్టించవలసిన వాటిని, విసర్జించ వలసిన వాటిని తెలుసుకోవడం ద్వారా జీవుల్ని దుఃఖవిముక్తులను చేయవచ్చును. బుద్ధుడు మాత్రమే వ్యక్తి యొక్క మనస్తత్వాన్నిబట్టి, అభిరుచిని బట్టి, సరైన బోధన చేసి, పరిపూర్ణ మార్గాన్ని చూపాడు. అందువల్ల ప్రతి ఒక్కరూ సంబుద్ధత్వాన్ని పొందాలి. పరుల శ్రేయస్సుకు పాటుపడాలి."

**- ప్రొఫెసర్ టి. తిరుమలరావు**

# బుద్ధసేవ - స్వయంసేవయే

"సర్వేజనాస్సుఖినోభవంతు
సర్వం సన్మంళాని భవంతు"

ఇది అన్ని మతాలు, అన్ని ధర్మాలు మనకు నిత్యం చెప్పే సత్యం. మతాలు ఎందుకేర్పడినా ఆ తరువాత వాటిని అనుసరించేవారు, ఆయా మత ధర్మాలను, మార్చడానికి వీల్లేని విధంగా మూర్ఖంగా పట్టుకొని వ్రేళ్లాడుతూ, మానవజాతి పురోభివృద్ధికీ, సర్వ సమానత్వానికి, సాంఘిక న్యాయానికీ, వాటిని అడ్డుగోడలుగా నిలిపారు. ఇంకా నింపుతూనే వున్నారు.

ఎప్పుడో రెండువేల అయిదువందల సంవత్సరాల క్రితం ఉద్భవించిన ఓ మహామనిషి, అప్పటికి భారతదేశాన్ని ఆవరించి, వేదిస్తున్న వైదికమత ధర్మాలను త్రొసిరాజని, ఒక నూతన జీవితాన్ని ఆలంబనగా పెట్టుకొని, బౌద్ధాన్ని ప్రభోదించాడు. బౌద్ధం ఓ మహా విప్లవంగా, భారతదేశమంతటా విస్తరించి, దేశ సరిహద్దుల్ని దాటి, విశ్వవ్యాప్తమై, సర్వమానవ జాతికి కళ్యాణ కారకమైంది. ఆ తరువాత సనాతన వైదిక ఛాందసవాదులు, బౌద్ధంలోని ఉత్తమ ధర్మాలను స్వీకరించి, ఇవి తమవేనని ప్రకటించుకొని, బుద్ధుని మరో అవతార పురుషుడని మరచి, బౌద్ధంలో నూతన అన్వేషణకు తావు లేకుండా చేసి, భారతదేశంలో నేలమట్టం చేసారు. బౌద్ధం ఒక మతంగా యిప్పుడు భారతదేశంలో కన్పించదు. కానీ యీనాడు హైందవం బ్రతకడానికి ఆధారభూతమై, జనాంగీకారమైన ధర్మాలన్నీ నిజానికి ఆనాటి బౌద్ధం లోనివే.

నేడు భారతదేశం అనేక రకాలుగా అస్తవ్యస్తమై, అతలాకుతలమై దేశ భవిష్యత్తునే సందేహంలో పడవేసే స్తితికి పడిపోయింది. ఈ పరిస్తితుల్లో సర్వజనంగీకారమూ, సకల మానవ కళ్యాణ కారకమూ అయిన ఓ నూతన దృష్టి సమాజాన్ని తీర్చిదిద్దేందుకు కావలసి వుంది. అందుకు బౌద్ధ ధర్మ పునరుజ్జీవం ఒక మార్గం. అది మనకూ, మనం జీవిస్తున్న సమాజ పురోభివృద్ధికి మనం మనకు దోహదం చేసుకున్నట్లే !

**- పడ్డెంపూడి హనుమంతరావు (సీనియర్ జర్నలిస్టు)**

# డాక్టర్ అంబేద్కర్ బుద్ధ దీక్ష అందరికీ శిరోధార్యం "బుద్ధ భగవానుడు" గ్రంథం అభినందనీయం

శ్రీ భూక్యా చిన వెంకటేశ్వర్లు గారు రచించి ప్రచురించిన "బుద్ధ భగవానుడు" గ్రంథాన్ని చదివాను. తెలుగు సాహిత్యంలో యింత సమగ్రంగా బుద్ధుని జీవిత పరిచయాన్ని తెలియని చెప్పిన గ్రంథం యిదేనని భావిస్తున్నాను. ఇంత ఉత్తమ గ్రంథాన్ని ప్రచురించినందుకు శ్రీ భూక్యా చినవెంకటేశ్వర్లు గారిని అభినందిస్తున్నాను.

ప్రపంచంలో ఉత్తమమైనది బౌద్ధమతం. అందుకే తాను మతం మార్పిడి జరపాలనుకున్నప్పుడు, అన్ని మతాలను పరిశీలించి, ఒక బౌద్ధ మతమే తగిందని డాక్టర్ అంబేద్కర్ బుద్ధ దీక్ష తీసుకున్నాడు.

మనుస్మృతిని తగలబెట్టిన అంబేద్కరు హైందవ మతంలోని వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థను తనని ఎంతగా బాధించిందో, తనని ఎంతగా అవమానాలపాలు చేసిందో తెలిసినవాడు గనుక, అంబేద్కరు బుద్ధ ధర్మాన్ని స్వీకరించి, ప్రచారం చేసాడు.

బుద్ధుడు గొప్ప మానవతావాది. మానవులందరూ సమానులేనని చాటిచెప్పాడు. కులం పనికిరాదనీ, గుణం ప్రధానమనీ తెలియజెప్పాడు. ఆ మహనీయుని బోధనలు గాంధీజీని కూడా ప్రభావితం చేసాయి. నేటి సమాజంలో బుద్ధ ధర్మం ఒక్కటే పాటించదగింది.

బాబాసాహెబ్ అంబేద్కరును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, బుద్ధ ధర్మాన్ని అవలంభించాలి. బుద్ధుని సిద్ధాంతాల్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలి. యిది ప్రతి ఒక్కరి బాధ్యతగా నేను గుర్తిస్తున్నాను. మరొకసారి శ్రీ భూక్యా చినవెంకటేశ్వర్లు గారిని అభినందిస్తున్నాను.

- డా॥ డి.టి. నాయక్, ఐ.పి.ఎస్.

# బుద్ధ భగవానుడు
## "ఆకాంక్ష"

- భూక్యా చినవెంకటేశ్వర్లు

బుద్ధ భగవానుని జీవితం నాకు ఆదర్శం ! అందుకే బుద్ధ భగవానుని గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాలని చాలాకాలంనుంచీ అనుకుంటున్నాను. ఆ కోరిక నేటికి ఫలించింది.

మహాత్ములందరిలో బుద్ధ భగవానుడు విశిష్టమైన వ్యక్తిత్వం కలవాడు. అందుకే ఆయన గాంధీజీకి కూడా ఆదర్శవంతుడైనాడు. బుద్ధుని సిద్ధాంతంలో అహింస ప్రధాన సూత్రం. గాంధీజీ "అహింస" అనే సూత్రంతోనే బ్రిటిషు సామ్రాజ్యాన్ని ఎదిరించి, జాతీయోధ్యమాన్ని నడిపాడు. అహింసాతత్వంతోనే గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చాడు.

బుద్ధ భగవానుని ధర్మాల్ని ప్రపంచంలో అనేక దేశాలు తమ మతంగా బుద్ధ ధర్మాన్ని పాటిస్తున్నాయి. బుద్ధుడు భారతదేశంలో జన్మించాడు. రాజ్యాన్నీ భోగ భాగ్యాల్ని త్యజించి మానవ జాతి కళ్యాణం కొరకు సన్యసించాడు. మానవ సమాజానికి దారి చూపాడు. అహింస, ప్రేమ, దయ అనే సూత్రాల్ని మానవులకు అందించాడు.

కుల వ్యవస్థ భారతీయ సమాజంలో చాలా అమానుషమైనది. వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టి, ప్రజలలో హెచ్చు తగ్గుల్ని నిర్ణయించి అమలుపర్చినందువల్లనే, హైందవ మతాన్ని డాక్టర్ అంబేద్కరు వదిలిపెట్టవలసివచ్చింది. అందుకే బాబాసాహెబ్ అంబేద్కరు సర్వమానవ సమానత్వాన్ని చాటిచెప్పిన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, లక్షలాది మంది తన అనుయాయుల్ని బౌద్ధులుగా మార్చాడు.

కులం భారతీయ సమాజానికి ఒక శాపం వంటిది. యీ కుల వ్యవస్థ వల్ల సమాజానికి దూరమైన అంటరానివాళ్లుగా భావించి దూరంగా వుంచబడినవారంతా, హైందవ మతాన్ని విడిచిపెట్టి అన్య మతాల్ని ఆశ్రయిస్తున్నారు. ఆ విధంగా భారతీయ సమాజము బలహీనపడుతున్నది.

అంటరాని కులంలో పుట్టిన అంబేద్కరు కూడా తన జీవితంలో ఎన్నో అవమానాలకు గురి అయ్యాడు. అంబేద్కరు వంటి గొప్ప ప్రతిభావంతునికే, కుల వ్యవస్థలోని కుటిలత్వం వల్ల హైందవ మతంలో ఇమడడానికి అవకాశం లేకపోతే, యిక సామాన్యుల గతి ఏమిటి ? అందుకే అంబేద్కరు బుద్ధ దీక్షను స్వీకరించి, తన అనుచరుల చేత బుద్ధ ధర్మాన్ని అవలంభింపజేసాడు.

బౌద్ధ మతంలో కులం లేదు. అంటరాన్నితనాన్ని బుద్ధుడు వ్యతిరేకించి, సర్వ సమానత్వాన్ని ప్రబోధించాడు. "బహుజనహితాయ", "బహుజన సుఖాయ" అనే సూత్రం బౌద్ధ మతంలో ప్రధానమైంది. అంతేగాదు. నైతిక విలువలకు బౌద్ధ ధర్మం పెద్ద ప్రాధాన్యతనిచ్చింది.


ఇన్ని ప్రయోజనకరమైన అంశాలతో కూడుకొని వున్నందునే అంబేద్కరు, గాంధీజీ వంటి మహనీయులు కూడా బుద్ధ ధర్మంలోని సూత్రాల్ని ప్రచారంలో పెట్టారు. అందుకే చక్మా గిరిజనులు, త్రిపుర తదితర కొండ జాతి ప్రజలు, లడక్ గిరిజనులు, భారతదేశంలోని లక్షలాది మంది గిరిజన తెగలు వర్ణ వ్యవస్థలో యిమడలేక, బౌద్ధ దీక్ష తీసుకొని, బౌద్ధులయ్యారు.

హింస, దౌర్జన్యం, అరాజకత్వం నేటి సమాజంలో ఎక్కువయ్యాయి. యిలాంటి కల్లోలపూరితమైన సమాజానికి బౌద్ధ ధర్మం ఎంతో అవసరం. బుద్ధుని ప్రేమ, అహింసా సూత్రాల్ని ప్రతి ఒక్కరూ పాటించి, ప్రచారం చేయాల్సిన సమయమిది.

అందుకే "బుద్ధ భగవానుడు' అనే యీ గ్రంథాన్ని రచించి, ప్రచురించాను. 'చంద్రునికో నూలుపోగు' అన్నట్టు ఆ మహనీయునికి నేను సమర్పించే నివాళి యిదే.

యీ గ్రంథాన్ని చదివి ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన అభిప్రాయాల్ని నాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. పాఠకులందరూ యిదే మా ఆహ్వానం. యీ గ్రంథ ప్రచురణ ద్వారా మేము ఆశిస్తున్న ఫలితం కూడా యిదే.

సర్వమానవ జాతికే దారిచూపిన "బుద్ధ భగవానుడు" ప్రతి ఒక్కరి హృదయాల్లో ఆరాధనామూర్తిగా వెలుగొందాలనే మా ధ్యేయం. అందుకు యీ గ్రంథం ఏ మాత్రం దోహదం చేసినా మా యీ కృషి ఫలించినట్లే.



# అహింసా జ్యోతి - ఆసియా జ్యోతి
# బుద్ధ భగవానుడు

- రాయల వెంకటేశ్వరరావు
ఎడిటర్ : బుద్ధ విహార్

క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటి సామాజిక పరిస్థితులను ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే, బౌద్ధం అవతరించాల్సిన చారిత్రక అవసరం కూడా మనకు వెంటనే స్ఫురిస్తుంది.

ప్రపంచం పరిణామశీలమైంది. గతంలోంచి వర్తమానం పుడుతుంది. నిన్నటి దినం అంతర్హితచ్ఛాయల్లోనే, నేటి దినం ఆవహించే పరిస్థితి ద్యోతకమవుతూ వుంటుంది.

ప్రకృతి నిరంతర చలనశీలమైనది. అది ఘటనా ఘటనమయం. నిరంతరం మారుతుంటుంది. ప్రతిఘటనాక్షణికం. నిరంతరంగా మార్పు చెందడం ప్రకృతి లక్షణం. అంతేకాదు. ప్రతిఘటన నశిస్తుంది. అనగా దాని ఉనికి క్షణికం. అది అలా ఘటనా ఘటనపరం పరంగా సాగుతూనే, అనగా పుడుతూ, గిడుతూ వుంటుంది. తిరిగి కొత్త ఘటన ఆవిర్భవిస్తూ వుంటుంది. ప్రతిఘటనా పరిణామశీలమైంది అని చెప్పడం ద్వారా బుద్ధుడు గతి తార్కిక భౌతికవాదానికి 2500 సంవత్సరాల నాడే బీజం వేసాడని చెప్పవలసింది.

కార్యాకారణ సూత్రాన్ని బుద్ధుడు ప్రతిపాదించాడు. ప్రతి కార్యానికీ ఒక కారణం ఆధారంగా వుంటుంది. కార్యం ఆవిర్భవించగానే కారణం నశిస్తుంది. అయితే ఆ కార్యం కూడా శాశ్వతం కాదు. అది మరొక కారణంగా పరిణమించి, యింకొక కార్యానికి ఆలంబన అవుతుంది. బుద్ధుడు ప్రతిపాదించిన యీ సూత్రం భౌతిక వాదానికి ప్రాతిపదిక వంటిది.

బుద్ధుడు వాస్తవికవాది. ఆయన మిధ్యావాదాన్ని ఖండించాడు. మూఢ నమ్మకాన్ని, ఛాందస భావాన్ని వ్యతిరేకించాడు. ఆత్మను నిరాకరించి, అనాత్మ వాదాన్ని ప్రతిపాదించాడు. మన ఇంద్రియాలకు అందని విషయాన్ని నమ్మవద్దని చెప్పాడు. ఊహకు తావులేదు. వాస్తవాన్ని మాత్రమే, ప్రమాణకారికగా వున్నదాన్ని మాత్రమే అంగీకరించాడు.

బుద్ధుని జనన కాలం క్రీ.పూ. 563.

సరిగ్గా ఆ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా తాత్విక ధోరణులు తలెత్తాయి. "థేల్స్" సృష్టి క్రమానికి నీరు కారణం అని అన్నాడు. హెరాక్లిటస్, కన్‌ఫ్యూజియస్ భారతదేశంలో చార్వాకులు భౌతికదృక్పథంతో కూడిన తాత్విక సిద్ధాంతాన్ని మేథోమథనం చేస్తున్న రోజులవి.

ఆనాటి భారతీయ సామాజిక పరిస్థితుల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సమాజంలో మనుస్మృతి చెలామణీ అవుతున్నది. వర్ణ వ్యవస్థ ఇనుప చట్రంలో అప్పటి ప్రజలంతా అనేక వర్ణాలుగా, మేలాలుగా విభజింపబడి, హెచ్చు తగ్గులతో, అస్తవ్యస్తంగా జీవిస్తున్న కాలం అది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలే కాకుండా అస్పృశ్యులు, ఛండాలురు పేరుతో అంటరానితనానికి గురి అయిన అయిదోవర్ణం కూడా వూరికి దూరంగా విసిరివేయబడివుంది. వృత్తుల ప్రాతిపదికతో ఒక్కో వృత్తికి ఒక్కో కులం ఏర్పడి, బౌద్ధ కాలం నాటి 18 కులాలు ధృవపడినది.

సమాజంపై బ్రాహ్మణ పౌరోహిత వర్ణానిదే పెత్తనం. క్షత్రియులు బ్రాహ్మణ పౌరోహిత వర్గం సమాజంపైన పెత్తనానికి పోటీపడుతూ కనిపిస్తాయి. సామాజిక జీవన విధానాన్ని నిర్దేశించేది పౌరోహిత వర్గమే. రాజ్య పాలన క్షత్రియులది. వాణిజ్య, వ్యాపారాగ్రాలు, గోరక్షణ యిత్యాదులు వైశ్య వర్ణానివి. కొంతకాలం వ్యవసాయం కూడా చేసేది. ఇక శూద్రులు పై మూడు వర్ణాల వారికి సేవకా వృత్తిని నిర్వహించడం.

కర్మ సిద్ధాంతం హైందవ మతానికి ప్రాతిపదిక. ఈశ్వరుడు లేదా బ్రహ్మ, యీ చరాచర జగత్తును సృష్టించాడు. మనిషి తాను చేసుకున్న పాప పుణ్యాలనిబట్టి జన్మలనెత్తుతూ కర్మలను అనుభవిస్తాడు. పుణ్యం చేసిన వారికి స్వర్గం, పాపాలు చేసిన వారికి నరకం తప్పదు. సామాజిక ధర్మాల్ని, స్మృతుల్ని ప్రజలందరూ పాటించాలి. వీటిని అతిక్రమిస్తే నరకమే గతి. ఈ స్మృతులు, ధర్మాలన్నీ మునులు, రుషులు ఆశ్రమాల్లో గడుపుతూ అగ్ర వర్ణాల పెత్తందారీతనానికి, వాళ్ల సుఖ సౌఖ్యాలకు అనుకూలంగా రాయడం జరిగింది.

ఇట్టి పరిస్థితుల్లో కొందరు భౌతిక దృక్పథంతో సమాజంపై తిరుగుబాటు చేసారు. వారే చార్వాకులు. వీరు వర్ణ వ్యవస్థనీ, స్వర్గ నరకాల్ని అంగీకరించలేదు. అదంతా బూటకం అన్నారు. చార్వాకులు బ్రాహ్మణ పౌరోహిత వర్గంపై ధ్వజమెత్తారు. పాపాలు లేవు పుణ్యాలు లేవు. స్వర్గం లేదు. నరకం లేదు. కులం, వర్ణం కల్పితాలు. వీటిని పాటించనవసరం లేదు అంటూ చార్వాకులు ఆనాటి సాంఘిక వ్యవస్థను వ్యతిరేకించి, పౌరోహిత్యంపై విమర్శలు చేస్తూ దుయ్యబట్టారు. అజిత కేశకంబలుడు, ప్రకృతకాత్యాయనుడు, పూర్ణ కాశ్యపుడు, మక్కరి గోశాలుడు తదితరులంతా చార్వాక సిద్ధాంతానుయాయులే.

అయితే యిక్కడొక ప్రధాన అంశం ఏమంటే చార్వాకులు ఆనాటి సాంఘిక వ్యవస్థపై తిరుగుబాటు చేసి, దాన్ని త్రోసిరాజన్నారు. కానీ మరి ఎలాంటి సమాజం కావాలో తెలియజెప్పి, దానికి ప్రత్యామ్నాయమైన వ్యవస్థను రూపొందించలేకపోయారు. కనీసం అలాంటి ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రతిపాదించడం కూడా చేయలేదు. అందువల్ల చార్వాకులు సామాజిక తిరుగుబాటుదారులుగా గుర్తింపబడ్డారే కానీ తాత్త్విక సిద్ధాంత కర్తలు కాలేకపోయారు. అందువల్ల ఆనాటి ప్రజల పాత వ్యవస్థలోనే ఉండిపోవక్కరలేదు.

ఇట్టి సంధి కాలంలో గౌతమ బుద్ధుడు జన్మించాడు. సిద్ధార్థుడు యిటు పౌరోహిత వర్గం యొక్క మిధ్య వాదాన్ని, అటు చార్వాకుల భౌతిక తిరుగుబాటు ఉగ్రవాదాన్ని బాగా అవగాహన చేసుకొంటూ పరిశీలించసాగాడు. ఈ రెండు దృక్పధాలు, సమాజాభ్యుదయానికి, ఉపయుక్తంగా లేవు. సార్వజనీనమూకాదు. సర్వకాలీయకమూ కాదు. ఈ రెంటిలోనూ లోపభూయిష్టమైన అంశాలు వుండి మనిషి జీవనమార్గానికి ఆటంకంగా వుంటూ, మనిషి జీవిత వికాసానికి గుదిబండలుగా వున్నవని బుద్ధుడు గ్రహించాడు.

'ధర్మం' అనేది మనుషులందరికీ ఉపయోగపడాలి లేదా కొందరికే ఉపయుక్తంగా వుండి, మరికొందరికి కంటకప్రాయంగా వుండడం దేనికి ? అలా వుండడంలో లోపం వున్నట్టే గదా. లోపమే కాదు. అందులో స్వార్థం కూడా యిమిడి వుంది. అది మిధ్యావాదం. యిక ఉగ్రవాదం తిరుగుబాటు చేసి, పౌరోహిత వర్గం యొక్క మిధ్యా వాదాన్ని ఖండించే వరకే

ఉపయోగపడింది, కానీ ప్రత్యామ్నాయ వ్యవస్థను చూపించలేదు, గనుక ఉగ్రవాదం కూడా మనిషి జీవన వికాసానికీ, సమగ్రమైన సాంఘిక జీవనానికి సరిపోవడం లేదు. అందుకు మరొక సిద్ధాంతం కావాలి ? అది ఎలా వుండాలి ? దానికి ప్రాతిపదిక ఏది ?

ఈ అంశాలను శోధించి, మధించి, పరిణామశీలమైన వాస్తవంతోకూడిన, సార్వకాలీనమూ, సార్వజనకమూ అయిన "మానవతావాద సిద్ధాంతాన్ని" బుద్ధుడు రూపకల్పన చేసి, ఆనాటి సమాజంలో ప్రతిపాదించాడు. ఇందుకు బుద్ధునికి ఆరేళ్లు పట్టింది.

విశాలమైన మనస్సుతో, మానవజాతికి కళ్యాణకారకమైన, సమాజాభ్యుదయుల్ని మనిషి జీవన వికాసాన్ని ఆశించి, పరులకోసం బుద్ధుడు తన స్వీయ జీవితాన్ని త్యాగం చేసాడు. రాజ్యాన్నీ, భార్యా బిడ్డల్నీ, సమస్త భోగభాగ్యాల్ని తృణప్రాయంగా వదిలివేసి, కట్టుబట్టలతో వచ్చి, అడవుల్లో ఆరేళ్లు తిరిగి, ఆశ్రమాల్ని [illegible] పండితుల్ని, సిద్ధాంతవాదుల్ని ప్రజలు ఏకాకిగా, తన స్వీయ ఆలోచనా క్రమంలో "మధ్యే మార్గాన్ని" కనుగొన్నాడు.

ఆయన మాటల్లో చెప్పాలంటే ఇది మిధ్యావాదాన్ని తృణీకరిస్తుంది. ఉగ్రవాదాన్ని ఖండిస్తుంది. "మధ్యేమార్గం" తన సిద్ధాంతం అని బుద్ధుడు చెప్పాడు. బుద్ధుని సిద్ధాంతానికి మనిషి ఆలంబన. సమాజం ప్రాతిపదిక. మనిషి సుఖదాయకంగా జీవనం గడపాలి. అందుకు సరియైన సామాజిక విలువలు వుండాలి. అలాంటి సమాజం ఉత్తమ విలువలతో మానవతా దృక్పథంతో, సర్వ సమానతతోకూడినదై వుండాలి. అలాంటి సమాజావిర్భావం కోసం సమత, సమానత ప్రాతిపదికగా సమాజం కోసం బుద్ధుడు కలలు కన్నాడు. వాస్తవిక రూపం యిచ్చాడు. విశాలత్వమూ, మానవత్వంతో కూడిన సామాజిక వ్యవస్థకోసం ఆయన అహర్నిశలూ పాటుపడ్డాడు. అలాంటి సమాజంలో నివశించే మనిషికి వుండవలసిన నైతిక విలువలూ, త్యాగంతో కూడిన భావనమూ క్రోడీకరించి,.రూపొందించి మనిషి అందించాడు. ఎలా బ్రతకాలో, ఎలాంటి జీవనం మనిషికి అవసరమో, అందుకు మనిషిచేయవలసిందేమిటో బుద్ధుడు తెలియజెప్పాడు. అందుకే బుద్ధున్ని డాక్టర్ అంబేద్కరు "మార్గదాత" అన్నాడు.

నిజమే. బుద్ధుడు మార్గదాత ! ఉత్తమ సామాజికపథ నిర్దేశకుడు. అహింసా సూత్ర ప్రతిపాదకుడు. మానవతావాది. బుద్ధుని బోధనలు సార్వకాలికమూ, సార్వజనీనమూ అయినవి. బుద్ధుని సిద్ధాంతం ముందు హైందవ పౌరోహిత వర్గం యొక్క మిధ్యావాదం, ఏ ప్రాతిపదిక లేని తృణీకార వాదమూ కూడా నిలువలేకపోయాయి. అందుకే బౌద్ధ సిద్ధాంతం యీనాడు దేశ దేశాల్లో కొనసాగుతున్నది.

ఎవ్వరైనా బౌద్ధాన్ని ఆచరించకపోతే, అది వాళ్ల అనాలోచితమైన లోపం అవుతుంది. కానీ బౌద్ధం సర్వకాలాల్లోనూ, సర్వ జనావళికి కావలసిన తాత్త్విక సిద్ధాంతం ! బుద్ధ ధర్మానికి యింతవరకు ప్రత్యామ్నాయం రాలేదు. కనుక నేటి సమాజానికి బౌద్ధమే అవశ్యం ఆచరణీయం. "బుద్ధ భగవానుడు" జీవిత చరిత్రను సమగ్రంగా, సచిత్రంగా రచించి, ప్రచురించి మనకు అందించిన శ్రీ భూక్యా చిన వెంకటేశ్వర్లు గారు ఎంతైనా అభినందనీయులు.

"సంఘం శరణం గచ్ఛామి"

# కులవ్యవస్థను వ్యతిరేకించిన బౌద్ధం

**- టి. గోపాలరావు, ఐ.ఎ.ఎస్.**

గౌతమబుద్ధుడు జన్మించే నాటికి, హైందవమతం దేశమంతటా విస్తరించి ఉంది. హైందవ మతంలో వర్ణ వ్యవస్థ ప్రధానంగా ఉండేది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుండేవి. ఈ నాలుగు వర్ణాలతో పాటు, అస్పృశ్యులు అనే అంటరాని వర్ణం ఉండేది. మను ధర్మశాస్త్రం ఆనాడు రాజులు, మునులు అమలు పరుస్తూ ఉండేవారు. రాజులు, చక్రవర్తులు కూడా పురోహితులపై ఆధారపడి, వాళ్లు చెప్పినట్లు నడుచుకొనేవారు.

పురోహితులు అనగా అప్పటి రుషులు, మునులు. వాళ్లు చెప్పిందే వేదం. ప్రజల్లో వర్ణాలపేరిట అడ్డుగోడలు కట్టి బ్రాహ్మణ, క్షత్రియులు ఎక్కువ వర్ణాలు అనీ, వైశ్యులకు తరువాత స్థానం యిచ్చి, శూద్రుల్ని బానిసలుగా, పై మూడు వర్ణాలవారికి చాకిరీ చేసి పెట్టే వర్ణంగా వుంచారు. మళ్లీ శూద్రుల్లో వృత్తులను బట్టి, వృత్తి కొక కులం వుండేది. ఈనాలుగు వర్ణాలతో వుండే అస్పృశ్యుల్ని, వూరికి దూరంగా వుంచారు. ఎందుకంటే యీ నాలుగు వర్ణాల కంటే, అస్పృశ్యులు నీచజాతి అనీ, అంటరానివారుగా, హీనస్థానంలో అట్టిపెట్టారు.

అస్పృశ్యులనగానే, నేటి మాల, మాదిగ, యానాది తదితర తక్కువ కులాలవి వస్తాయి. ముఖ్యంగా మాల, మాదిగల అవసరం కూడా అప్పటి సమాజానికి వుంది. ఎలాగంటే చెప్పులు కుట్టడం, చచ్చిన పశువుల్ని తీసుకొని వెళ్లడం, శవదహనాలకు, తదితరమైన నీచ వృత్తుల్ని యీ అస్పృశ్యులకు మనుస్మృతి కేటాయించింది.

సమాజంలో అస్పృశ్యులతో పాటు, శూద్రులకు కూడా గౌరవస్థానం వుండేది కాదు. బ్రాహ్మణ, క్షత్రియులకు సమాజంపైన అధికారం వుండేది. క్షత్రియులు బలవంతులు, రాజులు యుద్ధంలో ఆరితేరినవారు, రాజ్యం పరిపాలించే జాతి. కనుక బ్రాహ్మణ పురోహితులు తప్పనిసరిగా క్షత్రియులకు రెండవస్థానం యిచ్చి, ప్రథమ స్థానాన్ని వాళ్లు అట్టి పెట్టుకున్నారు. క్షత్రియులు రాజ్యపాలకులు గనుక, పురోహితులు వీరిపై ఆధారపడి జీవించేవారు. సమాజంలో ప్రజలు ఎలా నడచుకోవాలో, ఏం చేయాలో స్మృతుల పేరిట ఆయాకాలాలకు అనుగుణ్యంగా బ్రాహ్మణ పౌరోహితులే నిర్ణయించి చెప్పేవారు.

పౌరోహితులు మంత్రాలు, యజ్ఞయాగాదులు నిర్వహించేవారు. యజ్ఞాలు చేస్తేనే వర్షాలు కురుస్తాయనీ, వర్షాలు కురిస్తేగానీ పంటలు పండవు, గనుక యజ్ఞాలు చేయాలనే సూత్రాన్ని రాజులకు చెపుతూ, వారిని నమ్మించి, మునులు, రుషులు నివసించే ఆశ్రమాల దగ్గర యజ్ఞాలు చేసేవారు. ఈ యజ్ఞాలు జంతుబలులు వుండేవి. యజ్ఞం పూర్తికాగానే, రాజులు యీ యజ్ఞయాగాదులు నిర్వహించే రుషులు, బ్రాహ్మణులకు అగ్రహారాలు, ధన కనక వస్తు వాహనాలు యిచ్చేవారు.

ఈ విధంగా సమాజంలోని ప్రజల్ని విడదీసి, పౌరోహితవర్గం దైవం పేరుతో, వరుణదేవుని పేరుగా యాజ్ఞలు చేస్తూ, తాము గౌరవంగా చూడబడుతూ, వాటి వల్ల సంపదనీ, ధనాన్నీ ఆర్జించేవారు.

# బుద్ధ భగవానుడు

మనుస్మృతి, గౌతమ సూత్రాలు, ఆపస్తంభ సూత్రాలు, సమాజంలో చెలామణీ అవుతున్నాయి. యాజ్ఞ్యవల్క్యుడు, ప్రవాహణ జైవలి, ఉద్దాలక అరుణి ఆనాటి సామాజిక చట్రాన్ని రూపొందించి, ఆచరణలో పెట్టించి, వాటి నిర్వహణలో యజ్ఞ యాగాదులు ధర్మోపదేశాలూ కొనసాగిస్తూ, సమాజ నిర్వహణకు సూత్రధారులయ్యారు.

శ్రీరాముని దగ్గర నుంచి, జనక మహారాజుదాకా రాజులందరూ బ్రాహ్మణ పౌరోహిత వర్గం రూపొందించిన మిధ్యావాద స్మృతి శ్రుతులకే ప్రాధాన్యతనిచ్చి, వాటిని కాపాడుతూ, రుషులకు వసతి, ధన, కనక వస్తు వాహనాలు సమకూరుస్తూ వుండిపోయారు.

సామాజిక చట్రాన్ని మార్చి, ప్రజలందరికీ ప్రయోజనకరంగా వుండే నూతన సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించిన "వేనరాజు" వంటి మానవతావాదుల్ని బ్రాహ్మణ పౌరోహిత వర్గం హత్య చేయించింది.

ఆ మాటకు వస్తే బౌద్ధాన్ని కుదురుకోనివ్వలేదు. బౌద్ధ సిద్ధాంతంలో వచ్చిన మార్పులు, బౌద్ధం వదలడానికి కారణాలయ్యాయి. ఆది బౌద్ధానికి, తదితర కాలాల్లో వివిధ బౌద్ధ సిద్ధాంతాచార్యుల బోధనలలో కూడిన బౌద్ధానికి చాలా అగాధం ఏర్పడింది. ఈ వెసులుబాటును ఆసరా చేసుకొని ఆదిశంకరుడు వంటి హైందవ మతాచార్యులు బౌద్ధాన్ని నామరూపాల్లేకుండా చేసారు. తిరిగి హైందవాన్ని రాజుల అండతో, పునరుజ్జీవింపజేసారు. ఫలితంగా బౌద్ధం యితర దేశాల్లో ప్రవాసం చేస్తూ, తలదాచుకోవలసి వచ్చింది.

అయితే యీ సుదీర్ఘ యాత్రలో ఉత్థాన, పతనాల తరువాత చైనా హైందవం మార్పు చెందిందా అంటే రాజ్యాంగపరమైన సూత్రాల వల్లనే దాని ఆచరణలో మార్పు వచ్చిందే, కానీ స్వరూపంలో కాదు.

అంతేకాదు. దశావతారాల్లో బుద్ధుని చేర్చి, ఆ విధంగా బౌద్ధాన్ని హైందవంలో అంతర్లీనం చేసి, ఒక మేరకు దాని ఉనికిని లేకుండా చేయడంలో విజయం పొందారు.

ఇటీవల కాలందాకా హైందవంలో కుల వ్యవస్థ చట్రంలో మార్పు రాలేదు. అందువల్లనే డాక్టర్ అంబేద్కరు వంటి మహనీయులనే అక్కడ స్థానం లేక, బౌద్ధ దీక్షను తీసుకొని, హైందవానికి ప్రత్యామ్నాయం బౌద్ధమే అని చాటిచెప్పాడు. బుద్ధుని సిద్ధాంతాలకు చాలావరకు బాబాసాహెబ్ అంబేద్కరు, రాజ్యాంగంలో పొందుపర్చాడు. తిరిగి బౌద్ధం పునరుజ్జీవనం పొందడానికి కొన్ని ప్రాతిపదికలు ఏర్పడ్డాయి.

వర్తమాన, భవిష్యత్ కాలాల్ని తీర్చిదిద్దగలిగేది బౌద్ధమే !

**- D మురళీకృష్ణ, I.A.S.**

# క్రీ.పూ. 563

అనగా రెండువేల అయిదు వందల సంవత్సరాల క్రితం నాటిమాట. ఆదిశాక్యరాజ్యం. ఆ రాజ్యంలో శాక్యులు అనే తెగ ప్రజలు నివసిస్తూ వుండేవారు. శాక్యుల రాజు శుద్ధోదనుడు. ఆయన పట్టమహిషి మాయాదేవి. కపిలవస్తుపురం ఆ రాజ్యమునకు రాజధాని.

దవళకాంతులీనే హిమాలయ శిఖరాలు ఏపుగా, నిటారుగా పెరిగిన సాలవృక్షాలతో, కన్నుల పండువైన ఉద్యానవనాలతో, నేపాల్ సరిహద్దుల్లో శాక్య రాజ్యం విలసిల్లుతూ ఉండేది. శాక్యరాజ్యం గణతంత్ర ప్రజాస్వామిక రాజ్యం. అతి పురాతన కాలంలోనే భారతదేశం ఉత్తరాన, ఈశాన్య ప్రాంతాలో శాక్యులు, కోలీయులు, విచ్ఛవీలు, మల్లులు, వజ్జ యనులు, భల్లాకులు, గణతంత్ర ప్రజాస్వామిక వ్యవస్థకు పట్టు గొమ్మలుగా నెలకొని ఉండేవి. ఈ గణాల ప్రజలు తమ రాజును ఎన్నుకోనేవారు. మరి కొందరు ఎన్నుకొన్న ప్రతినిధులలో కూడి గణసభ, రాజుకు పరిపాలనలో సహాయకారిగా వుండేది.

రాజు శుద్ధోదనుడు శాక్యుడు ఆయన సతీమణి మాయాదేవి కాకతీయుల ఆడపడుచు. కోవీయుల రాజధాని దేవదహి, రెండవ భార్య ప్రజాపతి గౌతమి. శాక్యరాజ్యానికి కోవీయులకు మధ్యగా రోమిణీ నది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ రెండు రాజ్యాల మధ్య లుంబినీవనం విలసిల్లుతూ వుంటుంది.

లుంబినీవనం సాలవృక్షాలతో, అందముగా కన్నులకింపుగా వుంటుంది.



ఒక రాత్రి మాయాదేవికి చిత్రమైన కల వచ్చింది. దివ్యసౌధంలో, అంతఃపురంలో, చీని చీనాంబరాలు పాన్పుమీద పడుకొని నిద్రిస్తూవుంది. ఒక తెల్లని ఏనుగు ఆకాశంనుంచి దిగివచ్చి, ఆమె కడుపు లోకి ప్రవేశించినట్టు మాయాదేవికి భ్రమ కలిగింది.

తెల్లవారి శుద్ధోదనుడు స్వప్న వృత్తాంతాన్ని జ్యోతిష్కుల కు విన్నవించాడు. త్వరలోనే మాయాదేవి కడుపున లోకోత్తురుడైన వరపురుషుడు జన్మించనున్నాడని స్వప్నఫలితాన్ని జ్యోతిష్కులు రాజుకు తెలియజేసారు.

నిండు చూలాలయిన మాయాదేవి ప్రథమ కాన్పు కొరకు తన పుట్టినిల్లయిన దేవదహికి బయలుదేరింది. సకల పరివారంతో, చెలికత్తెలతో, పల్లకిపైన రాజు శుద్ధోదనుడు ఆమెను సాగనంపాడు. కానీ దారిలో వున్న లుంబినీవనం చేరుకోగానే, మాయాదేవికి పురిటినొప్పులు వచ్చాయి. సాలవృక్షం క్రింద మాయాదేవి ఒక మగశిశువును కన్నది. ప్రసవం జరిగినందున మాయాదేవి కపిలవస్తుకు తిరిగి వచ్చింది.

పుత్ర జననవార్త విన్నంతనే శుద్ధోదనుడు ఉప్పొంగిపోయాడు. ప్రజలతో పరివారంతో శుద్ధోదనుడు ఎదురేగినాడు. రాజ్యం అంతటా కోలాహలంతో ప్రజలు వేడుకల్ని జరుపుకున్నారు. అంతలోనే అక్కడికి సమీప అరణ్యంలో తపస్సు చేసుకొనే 'ఆసితుడు' అనే మహాముని అంతఃపురానికి వచ్చి, తల్లినీ, బిడ్డనీ చూసి, పసికందుని తన చేతుల్లోకి తీసుకొని, ముద్దాడి ఆనందంతో సర్వశుభలక్షితుడైన యీ బాలుడు మహా పురుషుడు అవుతాడు అని చెబుతూ, తాను అంతవరకు జీవించజాలను, లోకానికి వెలుగుబాటను యీ బాలుడు చూపే శుభదినాన్ని నేను కళ్లారా చూడలేను గదా" అని విచారపడినాడు.

'అసితుని' మాటలకు రాజదంపతులు సంతోషపడినారు. కుమారునికి "సిద్ధార్థుడు' ' అని నామకరణం చేసారు. అయితే దురదృష్టవశాత్తూ ప్రసవించిన ఏడవరోజునే మాయాదేవి మరణించింది. మాయాదేవి చెల్లెలూ, శుద్ధోదనుని రెండవ భార్య అయిన "ప్రజాపతి గౌతమి' అతి గారాబంగా సిద్ధార్థుని పెంచి పెద్ద చేసింది. "ప్రజాపతి గౌతమి" పెంచినందున సిద్ధార్థునకు "గౌతముడు" అని పేరు వచ్చింది.

శుద్ధోదనుడు దేశం నలుమూలలనుంచీ గొప్ప గొప్ప విద్వాంసులను, పండితులను జ్యోతిష్కులను రావించాడు. "సిద్ధార్థుని భవిష్యత్తు" ఎలా వుంటుందో చెప్పమని రాజువారిని అడిగాడు. అసితుని మాటల్ని ప్రతి ఒక్కరూ నిజమేనని చెప్పారు. ఎట్టి సందేహం లేకుండా సిద్ధార్థుడు మహాపురుషుడుగా ప్రపంచ ప్రఖ్యాతి పొందుతాడని అన్నారు. అయితే "సన్యసించకుండా వుంటే" సిద్ధార్థుడు రాజాధిరాజు కాగలడని, సన్యసించితే 'మహాప్రవక్త'గా ప్రపంచ ప్రజలచే కీర్తించబడతాడనీ కొందరు చెప్పారు.

తన బిడ్డ ప్రవక్త అవడం శుద్ధోదనునికి రుచించలేదు. తన పుత్రుడు క్షత్రియధర్మం అవలంబించి, చక్రవర్తిగా కీర్తి పొందాలని శుద్ధోదనుడు ఆకాంక్షతో వున్నాడు. జ్యోతిష్కుల మాటలకు, ఆయన కలత చెందాడు.

"ఈ బాలుడు సన్యసించకుండా వుండాలంటే, దుఃఖవిషయాలు గానీ, వేదన కలిగించే సంఘటనలుగానీ కంటబడకుండా చూడవలసింది" అంటూ కొందరు పండితులు రాజుకు సూచించారు.

శుద్ధోదనుడు బిడ్డను అతి గారాబంగా సుకుమారంగా పెంచసాగాడు. సుఖసంతోషాలు, ఆనందం కలిగించే సంఘటనలు సిద్ధార్థుని వద్ద జరిగేట్టు చూసేవాడు. ఏమాత్రం, బాధ, కష్టం కలిగే వాతావరణం సిద్ధార్థుని చుట్టూ లేకుండా చేసాడు. అందమైన పరిసరాలు, ఆనందం కలిగించే పరివారాన్ని బిడ్డ వద్ద ఏర్పాటు చేసాడు. రమ్య హర్మ్యాలను నిర్మింపజేసాడు. చక్కని క్రీడాస్థలం వినోదం కలిగించేందుకు కావలసిన ఏర్పాట్లు చేసాడు.

పినతల్లి గౌతమీ ప్రజాపతి ఒడిలో సిద్ధార్థుడు అల్లారుముద్దుగా పెరగసాగాడు. సిద్ధార్థుని కొరకు పూలతోటలు, తామర కొలనులూ ఏర్పాటయ్యాయి. దాస, దాసీజనం భటులు, ఉపాధ్యాయులు, సమవయస్కులైన కొందరు బాలురతో సిద్ధార్థుని బాల్య జీవితం ఆనందదాయకంగా గడవసాగింది. భోగభాగ్యాల మధ్య సిద్ధార్థుడు పెరుగుతున్నాడు. ఎండ, వాన, చలిలో తిరగకుండా, ఎందరో పరిచారికలు అడుగులకు మడుగులొత్తుతూ వుండగా, సేవకులు రాత్రింబవళ్లు వేయికళ్లతో సిద్ధార్థుని అంటిపెట్టుకొని వుంటారు. సిద్ధార్థుని దాయాది, సమవస్కుడైన "దేవదత్తుడూ" మంత్రి కుమారుడైన "కలుదాయిన్" అతని సావాసగాళ్లు. మనస్సుకు నొప్పి కలిగే ఏం సంఘటనా జరగకుండా కించిత్తు బాధకూడా సిద్ధార్థునకు కలగకుండా తండ్రి శుద్ధోదనుడు జాగ్రత్త పడ్డాడు. తల్లిలేని లోటు తెలియకుండా, తనే తల్లిగా పినతల్లి గౌతమీ ప్రజాపతి సిద్ధార్థుని పెంచసాగింది.

సిద్ధార్థుడు క్షత్రియ ధర్మం ప్రకారం సమస్త విద్యల్ని నేర్చుకుని, వాటిలో సునాయాసంగా ఆరితేరాడు. అతను సూక్ష్మంగా ఏకసంధాగ్రాహి, చురుకైన కళ్లు. సునిశితమైన అవగాహన గలవాడు. సిద్ధార్థుడు అనగా కోరుకున్న దాన్ని సాధించగలవాడు అని అర్థం. పేరుకు తగ్గ నేర్పు దక్షత సిద్ధార్థునకు వచ్చినవి. కానీ అతని మస్తిష్కం కరుణాపూరితంగా, ప్రశాంతంగా వుండేది. ఎలాంటి ఉద్రేకాలకి లోనుకాడు. చిరునవ్వుతో పరిసరాల్ని పరికిస్తూ, ఆలోచనా నిమగ్నుడై వుండేవాడు.



ఒకరోజున తోటలో తిరిగుతూ వుండగా, ఆకాసంలో ఎగిరిపోతున్న పావురాల గుంపు కనిపించింది. సిద్ధార్థుడు వాటిని కుతూహలంతో చూస్తూ వుండగానే, ఎక్కడినుంచో ఒక బాణం దూసుకొని వచ్చి ఒక పావురానికి తగలి, గిలగిల కొట్టుకుంటూ అది నేలమీద పడిపోయింది. సిద్ధార్థుడు "అయ్యో' ' అంటూ వడివడిగా దాని దగ్గరకు

వెళ్లి, చేతులతో దాని పొదివి పట్టుకొని, మెల్లగా బాణాన్ని లాగివేసి, తగిలిన గాయానికి కట్టుకట్టి దాని ప్రాణాన్ని కాపాడినాడు.

అంతలో సిద్ధార్థుని దాయాది అయిన దేవదత్తుడు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చి "ఆ పావురాన్ని నేనే కొట్టాను. కనుక అది నాకు చెందుతుంది. దాన్ని నాకు యివ్వాలని' ' అడిగాడు.

సిద్ధార్థుడు అందుకు నిరాకరించాడు. ''ప్రాణం తీసేవాడికి ప్రాణిని చేజిక్కించుకునే అధికారం లేదు''. అని సిద్ధార్థుడు బదులు చెప్పాడు.

దేవదత్తుడు రాజు శుద్ధోదనునికి ఫిర్యాదు చేసాడు. "బాణంతో పక్షిని కొట్టింది నేను. పక్షి నా బాణంతో నేల కూలింది. కనుక ఆ పక్షి నాకు చెందాలి". అంటూ దేవదత్తుడు వాదించాడు.

రాజు శుద్ధోదనుడు వివాదాన్ని గురించి సిద్ధార్థుని సంజాయిషీ అడిగాడు. సభికులంతా సిద్ధార్థుని సమాధానం కోసం ఆసక్తితో ఎదురు చూడసాగారు.

"దేవదత్తుడు బాణంతో పక్షిని చంపాలని ప్రయత్నించాడు. నేనే దాని ప్రాణాన్ని కాపాడాను. కనుక ప్రాణిని చంపాలను కొనే వాడికంటే, ప్రాణం కాపాడినవాడికే పక్షి చెందడం న్యాయం కదా" అని సిద్ధార్థుడు వివరణ యిచ్చాడు. నగర సభ ఆనందంతో పులకించి పోయింది. సిద్ధార్థుని వాదనలోని బలం శుద్ధోదనునికి నచ్చింది. ఆ పక్షి సిద్ధార్థునకు చెందాలని రాజు తీర్పు చెప్పాడు.

అతి పిన్న వయస్సులోనే సిద్ధార్థునకు సర్వజంతుజాలం పట్ల కరుణ, దయ చిప్పిలితూ వుండేవి. ప్రతి ప్రాణిపట్ల దయతో మెలిగేవాడు. పూలూ, చెట్లూ సైతం సిద్ధార్థుని అమితంగా ఆకర్షించేవి. తన పరిసర వాతావరణాన్ని, పరిచారికలు సేవకుల పట్ల కూడా సిద్ధార్థుడు ఆదరణ, గౌరవభావాన్ని వెలిబుచ్చేవాడు.

సిద్ధార్థునికి యుక్తవయస్సు వచ్చేసరికి, శుద్ధోదనుడు పండితులను, విద్వాంసుల్ని పిలిపించి, అతనికి ఉపాధ్యాయులుగా నియమించాడు. మల్ల విద్యల్లో సైతం రాణించాడు. పూర్వసాహిత్యాన్ని, పురాతన గ్రంధాల్ని క్షుణ్ణంగా పఠించాడు. సమస్త విద్యలతో పాటు తత్వశాస్త్రాన్ని లోతుగా అభ్యసించాడు. యుక్తవయస్సు పెరిగే కొలదీ ఏకాంతంగా వుండడానికి, ఆలోచిస్తూ గడపడానికి ప్రాధాన్యత నిచ్చేవాడు.

ఏరువాక పండుగను కపిలవస్తు పరిసర ప్రాంతంలో ప్రజలు అత్యంత వేడుకగా జరుపుకుంటారు. ప్రజానురంజకంగా పరిపాలించే శుద్ధోదనుడు కూడా సపరివారంతో, ప్రజలతో కలిసి ఏరువాక ఉత్సవాల్లో పాల్గొన్నాడు.

ఏరువాక ఉత్సవాలు ఆనందంగా జరుగుతున్నాయి. ఆ ఉత్సవంలో శుద్ధోదనుడు కుటుంబ సభ్యుల్ని కూడా సిద్ధార్థుని సైతం వెంటబెట్టుకుని, పంటపొలాల్లో జరిగే ఏరువాకలో పాల్గొని, స్వయంగా మేడిపట్టుకొని పొలం దున్నుతూ, రైతుల్ని ఉత్సాహపరుస్తూ, వ్యవసాయక ఉత్సవాన్ని మరింత ఆనందభరితంగా, ప్రజల కోలాహలంతో గడపసాగాడు. అందంగా అలంకరించబడిన ఎద్దులజతలు, ఆలమందలు పాలేళ్లు, రైతులు, విత్తనాలు వెదజల్లే మహిళలతో ఆ పరిసరాలంతటా ఉత్సాహం, ఆనందం వెల్లివిరియసాగింది.

ఆనందం పొంగిపొర్లే ఆ సమయంలో, సిద్ధార్థుడు మాత్రం ఉత్సవాల్లో పాలు పంచుకోకుండా, ఏకాంతంగా, దూరంగా ఒక నేరేడు చెట్టు క్రింద కూర్చుని ఆలోచనల్లో వుండిపోయాడు. ధ్యానమనస్కుడై తదేకమైన ఆలోచనల్లో మునిగివున్న కుమారుడ్ని చూసి శుద్ధోదనుడు ఆశ్చర్య చకితుడైనాడు. చప్పున అతనికి జ్యోతిష్కుల పలుకులు గుర్తు వచ్చాయి.

అతని తండ్రి మనస్సు కల్లోలమయింది. ఈ వుత్సవాల్లో పాల్గొనడం కన్నా తన బిడ్డ భవిష్యత్ ముఖ్యమని తలచిన వెంటనే సిద్ధార్థుని తోడ్కొని సపరివారంతో శుద్ధోదనుడు రాజసౌధానికి చేరుకున్నాడు. తన కుమారుని ధ్యానతత్పరతకు ఆయన కలవరపడినాడు. ప్రాపంచిక సుఖాల పట్ల సిద్ధార్థుడు ఉదాసీనత వహించడం శుద్ధోదనుడు గమనించి, ఎలాగైనా సిద్ధార్థుని మనస్సు మరలడానికి వివాహం ఒక్కటే తరుణోపాయమని భావించాడు. సిద్ధార్థుని మేనమామ కుమార్తె, సౌశీల్యవతి, సౌందర్యవతి అయిన యశోధరతో సిద్ధార్థుని వివాహం జరిపించాలని, శుద్ధోదనుడు నిర్ణయించుకున్నాడు.

శాక్యుల ఆచారం ప్రకారం యశోధర తండ్రి కుమార్తెకు తగిన వరుడ్ని నిర్ణయించేందుకు ధనుర్విద్యలో పోటీని ఏర్పాటు చేసాడు. ఆ పోటీలో గెలుపొంది, యశోధరను వివాహం చేసుకునేందుకు, దేశ దేశాలనుంచి అనేకమంది రాజకుమారులు వచ్చారు. కానీ ధనుర్విద్యలో ఆరితేరిన సిద్ధార్థుడు పోటీలో గెలిచాడు.

సిద్ధార్థునికి యశోధరతో వివాహం వైభవోపేతంగా జరిగింది. ఇక తన కుమారుడు సన్యసించబోడని శుద్ధోదనుడు సంతోషించాడు.

## సిద్ధార్థుని నగర పర్యటన

సౌందర్యవతి అయిన భార్యతో రాజప్రాసాదంలో సిద్ధార్థుడు సుఖసంతోషాల మధ్య కొన్నాళ్లు కాలం గడిపాడు. కానీ ఆయన కళ్లు దేనినో వెతుకుతున్నట్టు అనిపించేవి. ఎక్కడికో దూరంగా దృష్టి సారించి, తదేకంగా ఆలోచిస్తూ వుండేవాడు.

తన రాజసౌధానికి వెలుపల విశాలమైన ప్రపంచం వున్నదనీ, దాని స్వరూప స్వభావాల్ని తెలుసుకోవాలని సిద్ధార్థుడు ఉవ్విళ్లూరుతూ వుండేవాడు. ఈ ప్రాపంచిక స్వరూపం మానవజీవన విధానాన్ని గురించి గంటల తరబడి, తోటలో ఏకాంత స్థలంలో కూర్చొని ఆలోచిస్తూ వుండేవాడు.

ఒక రోజున తండ్రితో "నగర పర్యటన చేయాలని వుంది." అన్నాడు సిద్ధార్థుడు. "అలాగే" నా తదనంతరం నీవే యీ శాక్యరాజ్యాన్ని పరిపాలించ వలసి వుంది. అందువల్ల నీకు శాక్య ప్రజల్ని గురించి తెలియడం అవసరమే, రేపే నగర పర్యటనకు ఏర్పాట్లు చేస్తాను" అని శుద్ధోదనుడు కపిలవస్తు పట్టణాన్ని కన్నులపండుగగా అలంకరించాలనీ, యువరాజు నగర పర్యటనకు వస్తున్నాడని ప్రకటింపజేసాడు.

నగరమంతా సుందరంగా, పచ్చనితోరణాలతో, అలంకరించబడింది. వీధులన్నీ శుభ్రం చేయబడినవి. యిళ్లూ, భవంతులూ, అధికార ప్రాంగణాలన్నీ పూలతోను, పతాకాలతోనూ కళకళలాడేట్లు ఏర్పాట్లు జరిగాయి. రోగులూ, బాధల్లో వున్నవాళ్లూ, వీధుల్లో సంచరించరాదనీ, ఎలాంటి వికృత వికార ఘటనలు కనబడకూడదని రాజు శాసించాడు. వేదనతో కూడిన ఎలాంటి సంఘటనలు జరగకుండా రాజు అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు.

సిద్ధార్థుని నగర పర్యటనకు రథం సిద్ధం చేయబడింది. రథానికి గుర్రాలు, అందంగా అలంకరించిన రథం మీద సిద్ధార్థుడు నగర పర్యటనకు బయలుదేరాడు. ఛెన్నుడు రథం తోలుతున్నాడు. నగర వీధులగుండా రథం మెల్లిగా సాగిపోతున్నది. వీధులకి ఇరుప్రక్కలా ప్రజలు బారులుదీర్చి నిలబడి రాజకుమారునికి స్వాగతం పలుకుతున్నారు. చేతులు జోడించి, జనం తమ యువరాజును తన్మయత్వంతో చూడసాగారు.

సిద్ధార్థుడు ప్రజలకు అభివాదములు తెలియజేస్తూ నగర వీధుల్ని నలుదిక్కులా పరికిస్తూ, ప్రతిదాన్ని ఆసక్తితో తిలకించసాగాడు. "యీ లోకం ఆనందదాయకమైనదే" అని భావించాడు. నగరంలోని మారుమూల ప్రాంతాన్ని కూడ చూడాలని ఆయన తలపోసి "ఛెన్నా! రథాన్ని ఆ వీధిలోకి మళ్లించు" అని అన్నాడు.

ఛెన్నుడు రథాన్ని ప్రక్క వీధులలోకి పోనిచ్చాడు. ఆప్రక్క వీధిలోకి సిద్ధార్థుడు వస్తాడని అక్కడి ప్రజలకి తెలియదు. అక్కడ ఎలాంటి అలంకరణలూ లేవు. స్వాగత తోరణులు లేవు. వీధి దుమ్ముకొట్టుకొని జన సమ్మర్దంగా వుంది. నడుం వంగిపోయిన ఒక వృద్ధుడు కర్ర ఊతంతో మెల్లిగా వెళుతూ వుండడం సిద్ధార్థుడు చూసాడు.



"ఏమిటి? ఆయన అలా వంగిపోయి వున్నాడు?"

"అతను వయస్సు మీరిన వృద్ధుడు" అన్నాడు ఛెన్నుడు.


వయస్సు మీరిన తర్వాత ప్రతిఒక్కరూ ముసలితనంలో వయోభారంతో క్రుంగిపోతారనీ, శరీరం శిధిలం అవుతుందనీ సిద్ధార్థుడు అర్థం చేసుకున్నాడు.

మరునటి రోజు నగర పర్యటనలో సిద్ధార్థునకు ప్రాపంచిక సుఖదఃఖాలకు ప్రతిబింబాలైన ఎన్నో సంఘటనలూ, దృశ్యాలు కనిపించాయి.

ఒకచోట శరీరమంతా వణుకుతూ, బాధతో మెలికలు తిరిగిపోతున్న రోగి కనిపించాడు. "ఆ వ్యక్తి అలా ఎందుకు బాధపడుతున్నాడు?" అని సిద్ధార్థుడు అడిగాడు.

"అతను వ్యాధిగ్రస్తుడు, అందువల్ల బాధపడుతున్నాడు". "ఈ శరీరానికి వ్యాధులూ, మరికొన్నాళ్లకు వృద్ధత్వం వస్తాయి. అంతేగదా! ఛెన్నా!"

"అవును యువరాజా! ప్రతివ్యక్తికీ యీ బాధలు తప్పవు. మానవజీవితమే అది వ్యాధులతో, వయోభారంతో కృశించుతుంది".



మరి కొంతదూరం ప్రయాణించే సరికి, కొందరు శవాన్ని మోసు కుంటూ ఎదురైనారు. శవం వెంట ఆత్మీయులు రోదిస్తూ రావటం సిద్ధార్థుని కంటబడింది.

"అదేమిటి? ఛెన్నా! అతన్ని అలా మోసుకుపోతున్నారు? ఎక్కడికి?

"ఆ వ్యక్తి మరణించాడు, ప్రభూ! ఇక ఆ శవాన్ని శ్మశానానికి తీసుకువెళ్లి దహనం చేస్తారు"

"ప్రతి ఒక్కరూ మరణానికి గురికావాల్సిందేనా?"

"అవును, యువరాజా! ప్రతి ప్రాణికి చావు తప్పదు." అన్నాడు ఛెన్నుడు.

సిద్ధార్థుడు ఆలోచనల్లో మునిగి పోయాడు.

"రథం వెనక్కి త్రిప్పు, ఛెన్నా! ఇక చూడవలసిందేమీలేదు" అదేశించాడు, సిద్ధార్థుడు

"రాజసౌధానికి చేరుకున్న సిద్ధార్థుడు, వంటరిగా ఆలోచనలతో కాలం గడపసాగాడు యీ ప్రాపంచిక సుఖ దుఃఖాల క్రీనీడల వెంట ఆయన వెంట ఆయన మనస్సు పరుగులిడ సాగింది. పుట్టక, వ్యాధులు, వృద్ధత్వం, మరణం ప్రతి ఒక్కరి జీవితంలో అనివార్యం అనే నిజాన్ని సిద్ధార్థుడు గ్రహించాడు. "ఈ లోకం దుఃఖదాయకమైనది" అని అనుకున్నాడు.

ఒక రోజు యశోధర మగశిశువును ప్రసవించింది.

"నీకు కుమారుడు కలిగాడు" అన్నాడు సంతోషంతో శుద్ధోధనుడు. "బిడ్డకు నామకరణం చేయాలి గదా, సిద్ధార్థా! నీకు యిష్టమైన పేరు తెలియజేయవలసింది అని శుద్ధోదనుడు అడిగాడు.

"రాహులుడు" అప్రయత్నంగా సిద్ధార్థుని నోట వచ్చింది. "మంచి పేరు" అని శుద్ధోదనుడు వెళ్లిపోయాడు.

నా అన్వేషణకి అడ్డంకిగా యీ బిడ్డ జన్మించాడు" అని సిద్ధార్థుడు తలపోసాడు. అందుకే శృంఖలం అనే అర్థంలోనే సిద్ధార్థుని నోటివెంట "రాహులుడు" అని అప్రయత్నంగానే వెలువడింది.

రాహులుని జననవార్త నగరమంతా తెలియజేయబడింది. ప్రజలంతా వేడుకలు జరుపుకున్నారు. అంతఃపురం ఆనందంతో ఉరకలు వేసింది. శుద్ధోదనుడు, ప్రజాపతి గౌతమి, యశోధర సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దాసదాసీ జనం, పరివారానికి అతిథి, అభ్యాగతులకూ దాన ధర్మాలు, బ్రాహ్మణక్షత్రములకు సత్కారాలు చేయబడినవి. నగరమంతా కోలాహలంతో నిండిపోయింది. కపిలవస్తు ఆనందసాగరంలో ఓలలాడింది.

అయితే సిద్ధార్థుడు మాత్రం ఏకాంతంగా, తన సౌధంలో కూచుని, నిర్లిప్తతతో వుండి పోయాడు. తన కుమారు జననం ఆయన మస్తిష్కం మీద ఎలాంటి ప్రభావాన్ని చూపలేదు. ఆయనలో ఎలాంటి ఉద్వేగమూ, ఉత్సాహమూ కానరాలేదు. సరిగదా, రాహులుని జననం, తన ఆలోచనలకు "ఆటంకం" అని కూడా సిద్ధార్థుడు భావించాడు. తన విరాచకం, బిడ్డ జననం, వర్తమాన జీవనం అంతా తన ప్రమేయం లేకుండా, తన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా, ఘటనాపరంపరగా జరిగిపోతున్నాయని పరిపరి విధాల ఆలోచించసాగారు.

తన గమ్యం ఏది? తన ధ్యేయం ఏవి? యీ చరాచర జగత్తు కారణమేమి? దుఃఖదాయకమైన మనిషి జీవితానికి పరమార్థం ఏమి? యిలా ఆలోచిస్తూ ఉండిపోయాడు. తన ప్రశ్నలకి సమాధానం కావాలి. ఎలా? ప్రాపంచక జీవనంలో ఎన్నో వైరుధ్యాలు, వైవిధ్యాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. ప్రకృతి ధర్మాలలోనే వైరుధ్యం వుంది.

నగర పర్యటనలో కనిపించిన దృశ్యాలే ఆయన మస్తిష్కం నిండా మెదులుతున్నాయి. జీవితంలో ఏదీ శాశ్వతంగా కనిపించడం లేదు. తన తల్లి మాయాదేవి తను జన్మించిన ఏడు రోజులకే దివంగతురాలైంది కదా! తన తండ్రి శుద్ధోదనుని వయస్సు మీరుతున్నది. సమాజంలోని మానవులందరి మధ్యా వైరుధ్యం వున్నది. అందరి జీవితాలు ఒకే విధంగా గడవడం లేదు. పాలకులు, పాలితులు, రాజరిక వ్యవస్థలో కక్షలూ, కార్పణ్యాలు, సింహాసనం కొరకు యుద్ధాలు, మరణాలు, వీటన్నిటితో సమాజం కూడుకొని వుంది. ఏదీ శాశ్వతం కానప్పుడు ఈ కోరికలు, కాంక్షలకి అర్థం ఏమి? దైవం, పూజలు, నమ్మిక విశ్వాసాలు కొనసాగుతున్నాయి. దేవుడు యీ వైరుధ్యపూరితమైన లోకాన్ని ఎందుకు సృష్టించాడు? ఆలోచనలు యీవిధంగా సాగిపోతున్నవి.

## మహాభినిష్క్రమణం

శాక్యరాజ్యానికీ కోలీయ దేశానికీ మధ్య రోహిణీ నది ప్రవహిస్తూ వుంటుంది. రోహిణీ నది జలాన్ని ఉభయ దేశాలు తమ ప్రజల అవసరాల నిమిత్తం వినియోగించుకుంటూ వస్తున్నాయి. అయితే ఒక్కోసారి వర్షాభావం వల్ల నదిలో నీరు సమృద్ధిగా లేని సమయంలో నదీ జలాల్ని వినియోగించుకొనే సందర్భంలో ఉభయ దేశాల మధ్య వివాదం చెలరేగుతూ వుంటుంది. క్రమేపీ ఆ వివాదం యుద్ధం వరకూ తెస్తుంది.

ఆసంవత్సరం వర్షకాలం అంత సానుకూలంగాలేదు. రోహిణీనది నీటి మట్టంతగ్గిపోయింది. నదిలో నీరు సమృద్ధిగా లేదు. అందువలన పై భాగానవున్న కోలీయులు నీటిని అడ్డుకుంటే, శాక్యులకు నీరు లభ్యంకాదు. వున్న నీటినే ఉభయులూ వాడుకుందామని శాక్యుల ప్రతిపాదనల్ని కోలీయులు పెడచెవిని పెట్టడం జరిగింది. ఈ కారణంగా ఉభయదేశాల మధ్య సంబంధాలు బెడిసి యుద్ధానికి దారితీసాయి.

శాక్యులసేనా నాయకుడు సంఘసమావేశాన్ని ఏర్పాటు చేసాడు శాక్యగణ సభ్యులు, రాజు శుద్ధోదనుడు, సిద్ధార్థుడు సభకు హాజరైనారు. సేనాపతి మాట్లాడుతూ కొలియులు రోహిణీనదికి అడ్డుకట్టలువేసి, జలాల్ని అక్రమంగా వినియోగించుకుంటున్నారు. దీన్ని అడ్డుకున్న మన ప్రజల్ని కోలీయులు తరిమి కొట్టారు. ఈ రకంగా కోలీయులు తిరగబడడం

యిదే మొదటిసారికాదు; మనం కోలీయుల దౌర్జన్యాన్ని అడ్డుకొనాలంటే యుద్ధం ఒక్కటే మార్గం. కోలీయులపై యుద్ధం ప్రకటించేందుకు మీ మీ అభిప్రాయాల్ని తెలియజేయ గోరుతున్నాను.'' అని అడిగాడు.

శాక్యగణ సభ్యుల్లో కొందరు "కోలీయులపై యుద్ధం చేయాల్సిందే" అని అన్నారు. శుద్ధోదనుడు సభ్యులు అభిప్రాయాల్ని వింటూ అర్థంచేసుకుంటూ వుండిపోయాడు.

ఇంతలో సిద్ధార్థుడు లేచి నిలుచున్నాడు. సభ అంతాసిద్ధార్థుని వైపు తిరిగి, ఆయన అభిప్రాయం కొరకు ఆసక్తితో గమనించసాగారు.

"ప్రజలు ఉపయోగించుకుంటున్నందున, జలానికి పవిత్రత వచ్చిందా ? లేక జలానికి స్వయంగా ఏమైనా ప్రత్యేకత వుందా ?" అని సభను ఉద్దేశించి సిద్ధార్థుడు ప్రశ్నించాడు. సభ చాలా సేపు నిశ్శబ్దం వహించింది.

"ప్రజలు వినియోగించుకుంటున్నందున జలాలకి ప్రత్యేకత ఏర్పడింది'' అని తానే సమాధానం చెబుతూ కనుక ప్రజల వల్ల ప్రత్యేకత ఏర్పడింది. జలాల కొరకు ప్రజలు ఒకరి కొకరు నరుక్కొని చావడం సమంజసమా ? ప్రజలు వున్నప్పుడు కదా జలాలు వుపయోగం? ప్రజలే నశించిపోతే, యిక జలం ఎందుకు ? కనుక రోహిణీ నది జలాల వివాదం యుద్ధం వల్ల పరిష్కారంకాదు ఇరుదేశాలు కొందరు పెద్దల్ని ఎన్నుకొని, ఆ పెద్దల తీర్పు ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవడం శ్రేయస్కరం'' అని అన్నాడు.

సిద్ధార్థుని సామరస్య సిద్ధాంతం శాక్య సేనానాయకునికి నచ్చలేదు "సైన్యం యుద్ధానికే సిద్ధంగావుంది" అని సేనానాయకుడు అన్నాడు. గణంలోని యువకులంతా "యుద్ధం చేయాల్సిందే '' అంటూ ఉద్రేకంతో కేకలు పెట్టారు.

"యుద్ధం వల్ల ఏ సమస్యా పరిష్కారంకాదు యుద్ధం మరొక యుద్ధాన్ని ప్రేరేపిస్తుంది. హింసవల్ల హింస పునరావృతమవుతుంది. పరస్పర అవగాహనతో సామరస్యంతో సమస్యని పరిష్కరించుకోవాలి. ఇదే సరియైన మార్గం'' అన్నాడు. సిద్ధార్థుడు.

"శాంతి పలుకులవల్ల కోలీయులు దిగిరారు. వాళ్ళు ఆయుధాలు ధరించి వున్నారు. చర్చల వల్ల ప్రయోజనం లేదు. అందుచేత కోలీయులపైన శాక్యగణ సభ యుద్ధాన్ని ప్రకటించాలని నేను ప్రతిపాదిస్తున్నాను''. అని తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టాడు.

సభ్యులందరూ శుద్ధోదనుని ఆదేశం కొరకు ఎదురు చూస్తున్నారు. 'రేపటికి సభవాయిదా వేయబడింది.'' అంటూ శుద్ధోదనుడు లేచాడు. సభ్యులందరూ గుంపులు గుంపులుగా చేరి ఉద్రిక్తంగా చర్చించుకున్నారు.

సిద్ధార్థుడు ప్రశాంతంగా అక్కడినుండి తన రాజ సౌధానికి వెళ్లిపోయాడు.

సిద్ధార్థుడు ఏకాంతంగా కూచుని పరిపరివిధాలా ఆలోచనల్లో నిమగ్నుడైనాడు. రెండు దేశాల మధ్య యుద్ధ నివారణకు, తాను చేసిన శాంతి ప్రతిపాదనల్ని శాక్యగణ సభ్యుల్లో ఎక్కువమంది వ్యతిరేకించడం తథ్యం. అందువల్ల యుద్ధానికే రేపటి సభతీర్మానిస్తుంది. ఇట్టి పరిస్థితుల్లో గణసభ తీర్మానాన్ని వ్యతిరేకించిన సభ్యులకు గణంలో గౌరవం వుండదు. పైగా కొన్ని అభిశంసనల్ని కూడా ఎదుర్కోవలసి రావచ్చును. అది అలావున్నప్పటికీ, నగర పర్యటనలోనూ, తన అనుభవంలోకి వచ్చిన అనేక సంఘటనల పర్యవసానంగా, తన మస్తిష్కంలో పొటమరించిన సందేహ నివృత్తి కోసం మేధోమథనం చెందడం జరుగుతోంది. మనిషి పుట్టుక, జరామరణాలు, ప్రకృతిలో సంభవించే మార్పులు, సామాజికంగా వున్న యీ అసమానతల్ని, వీటి స్వరూపభావాల్ని అంచనావేస్తూ, వీటికి పరిష్కారమార్గం తెలుసుకోవలసివుంది. ఈ అన్వేషణకు కుటుంబజీవనం తనకు ఆటంకంగా వున్నది.

సిద్ధార్థుని ఆలోచనల కంతరాయంగా అక్కడికి శుద్ధోదనుడు రావడం జరిగింది. "ఆయుష్మాన్ ! ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నదీ" అని కుమారుని పలకరించాడు.

సిద్ధార్థుడు దిగ్గునలేచి నిలుచున్నాడు. శుద్ధోదనుడు దగ్గరగా వచ్చి సిద్ధార్థుని చుబుకం పట్టుకొని "కూర్చో" అన్నాడు. సిద్ధార్థుడు తండ్రి సరసనే కూర్చున్నాడు.

"శాక్యుల కోలీయుల రోహిణీ నదీజలాల వివాదంపై శాక్య గణంలో తలెత్తిన యుద్ధ ప్రకటనపై నీ అభిప్రాయాన్ని విన్నాను. శాంతి చర్చలు అంత సులభంకాదు సిద్ధార్థా" అంటూ శుద్ధోదనుడు ప్రసంగాన్ని ప్రారంభించాడు.

"యుద్ధం పరిష్కారం కాదు జనకా" అన్నాడు సిద్ధార్థుడు

"యుద్ధం క్షత్రియుల ధర్మం ! కుమారా !"

"మన శాక్యరాజ్యం ప్రజాతంత్ర గణదేశం ! ప్రతి సమస్యనీ మనం చర్చలతో పరిష్కరించు కోవడం లేదా ! అలాగే రెండు దేశాల మధ్య వివాదాన్ని సైతం చర్చలతో ఎందుకు పరిష్కరించుకోకూడదు. యుద్ధం వల్ల వేలాదిమంది సైనికులు మరణిస్తారు. లక్షలాది కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయి. అంతులేని సంపద వ్యర్థమవుతుంది. యుద్ధం మరొక యుద్ధానికి దారితీస్తుంది. హింస ప్రతిహింసను కోరుతుంది జనకా" అన్నాడు. సిద్ధార్థుడు.

కుమారుని వివేచనా శక్తి, శుద్ధోదనుడు ఆశ్చర్యచకితున్ని చేసింది. కానీ క్షత్రియ ధర్మానికి తన బిడ్డ దూరమవుతున్నాడే, అని శుద్ధోదనుడు కలవరపడసాగాడు.

క్షాత్ర ధర్మంలో హింస అనివార్యం కుమారా ! ఆయుధ ధారణ తప్పనిసరి ఇది తరతరాలుగా వస్తున్న సాంప్రదాయమే బలోపేతమైన సైన్యం దృఢమైన నిర్ణయం రాజరికానికి అవసరం కత్తికి కత్తి మాత్రమే సమాధానం కాగలదు"

"దీనికి అంతం ఎక్కడ ? ఒక రాజుకంటే మరొక రాజు బలవంతుడు ఒక రాజ్యం కంటే మరొక రాజ్యం బలోపేతంగా వుంటుంది. మన గణతంత్ర రాజ్యాలన్నీ కోసల మహారాజుకి సామంత రాజ్యాలేగదా! కత్తికి కత్తి సమాధానం అయితే, కోసల మహాసామ్రాజ్యాన్ని మనం గెలవగలమా ? మనం ఒక చిన్న సామంత రాజ్యంగానే మిగిలిపోయాం గదా" అన్నాడు అన్నాడు సిద్ధార్థుడు.

కుమారుని తర్కానికి శుద్ధోదనుడు సమాధానం చెప్పలేకపోయాడు. 'రేపు జరగబోయే శాక్యగణసభ, కోలీయులపై యుద్ధాన్నే ప్రకటిస్తుంది. గణసభలోని ఎక్కువమంది సభ్యుల అభిప్రాయం అదే గనుక సభా ఆతీర్మానాన్నే చేస్తుంది. అప్పుడు గణసభ తీర్మానాన్ని రాజు అమలు పర్చాలి గదా !" అన్నాడు శుద్ధోదనుడు.

సిద్ధార్థుడు కొంచం సేపు మౌనం దాల్చాడు,

"కొన్నాళ్లు, దేశ పర్యటన చేయాలని వుంది జనకా" అన్నాడు సిద్ధార్థుడు.

"యుద్ధానికి భయపడి, సిద్ధార్థుడు దేశం విడిచిపోయాడు" అనే అపవాదు వస్తుంది. కదా, కుమారా ?

"యుద్ధం పట్ల నా అభిప్రాయం నిన్న గణ సభలో స్పష్టంగానే చెప్పాను. గదా, జనకా! ఇందులో అపవాదుకు ఆస్కారమేముంది ? యుద్ధానికి నేను విముఖుణ్ణి అంతే"

"నీవు లేకుండా, నేను వుండగలనా, సిద్ధార్థా "

"ఎవరూ ఎవ్వరికీ శాశ్వతాను బంధం అంటూ వుండదు జనకా, ఆమాటకు వస్తే జీవితం కూడా శాశ్వతం కాదు గదా"

సిద్ధార్థుని మాటలు శుద్ధోదనుని మరింత కలవరపరిచాయి. ఇక ప్రసంగాన్ని పొడిగించ కూడదనుకున్నాడు.

"దేశపర్యటనకు యిది సమయంకాదు కుమారా ! ఆలోచనలతో నీవు అలసిపోయావు. విశ్రాంతి తీసుకోవలసివుంది" అని శుద్ధోదనుడు అంతఃపురానికి వెళ్లి పోయాడు. సిద్ధార్థుడు చాలాసేపు అలానే వుండిపోయాడు.

ఆరోజు వైశాఖ పౌర్ణమి ! పుచ్చపువ్వల్లాంటి వెన్నెల స్వచ్ఛంగా మంచితనం ప్రతిరూపంగా అంతా పరచుకొని వుంది. అకాశం నిర్మలమైంది. అప్పటిదాకా దోబూచులాడిన మబ్బుతునకలు దూదిపింజల్లా తేలిపోయాయి. ఆకాశంలో చంద్రుడు ప్రకాశమానంగా వెలుగుతున్నాడు. చాలాసేపు ఆ వెన్నల్లో సిద్ధార్థుడు సౌధోపరిభాగంలో నడయాడు చంద్రుని వైపు రెప్పవాల్చకుండా చూస్తూ, చటుక్కున ఏదో స్ఫురించినట్లు, అక్కడి నుంచి యశోధర మందిరంలోకి వచ్చాడు. అంతఃపురంలో యశోధర, పసికందు రాహులుని తన వక్షభాగానికి అదిమి పెట్టుకొని గాఢంగా నిద్రపోతోంది. ఒక్కక్షణం ఆదృశ్యాన్ని చూసి సిద్ధార్థుడు యివతలకి వచ్చాడు. అక్కడి నుండి సిద్ధార్థుడు తన సౌధంలోకి అడుగు పెట్టాడు. అక్కడ సిద్ధార్థుని ఆంతరంగిక సేవకుడైన ఛెన్నుడు మెట్లమీద కునికిపాట్లు పడుతూ కనిపించాడు.

# మహాభినిష్క్రమణం

వైశాఖ పౌర్ణమి -------

నిండు చంద్రుడు ఆకాశంలో స్వచ్ఛంగా, ధవళకాంతుల్ని లోకంమీద ప్రసరిస్తూ, ప్రశాంతతనీ, నిర్మలత్వాన్నీ ప్రసాదిస్తున్నాడు.

తెల్లని ఆవెన్నెట్లో, బుద్ధుడు చాలాసేపు నిలబడి, యీ విశాల ప్రపంచానికి తానేమి యివ్వగలనని తలపోసాడు. సమాజానికి, సాటి మానవునికీ తానెలా వుపయోగపడగలనో, తాను అన్వేషణలో తెలుసుకోవాలనీ, ఒక మహత్తరమైన సత్యాన్ని యీ మానవజాతికి అందించాలని కృతనిశ్చయుడైనాడు.

తనూ, తనకుటుంబము, తన సుఖం పరిమితమైనది. మానవుడిగా జన్మించినందుకు సార్ధకత వుండాలి. సామాన్యమైన మానవులందరూ గడుపుతున్న జీవితానికి భిన్నంగా, నిఖిమానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకూ, కష్టాలకూ ఒక నూతన మార్గాన్ని కనుగొనాలి.

"బహుజనహితాయ

బహుజన సుఖాయ" అనదగిన విధంగా తన కార్యక్రమాల్ని రూపొందించుకోవాలి. అందుకు పంజరం వంటి యీ అంతఃపుర సౌధం, రాజ ప్రాసాదం తగిందికాదు. యిది కేవలం ఒక వ్యక్తి భోగభాగ్యాలకే పరిమితమైనది.

కనుక తాను యీ అనంత విశ్వంలోకి నడిచి వంటరిగా సాగిపోవాలి. ఏకాంతంగా కూచుని ఆలోచించాలి. సర్వదర్శనాల్ని తెలుసుకోవాలి. అనంతమైన విజ్ఞానాన్ని పాండిత్యాన్ని సంతరించుకోవాలి.

ఒక నూతన మార్గాన్ని కనుగొనాలి.

సిద్ధార్ధుడు సాలోచనగా పరిసరాల్ని గమనించాడు. ఒకసారి రాజప్రసాదాన్నీ, భార్యను, బిడ్డను, శుద్ధోదనుని ప్రాసాదాన్నీ, తాను నడయాడిన పరిసరాలనన్నిటినీ ప్రేమతో అవలోకించాడు.



సిద్ధార్ధుడు మెల్లిగా ఛెన్నుడుని తట్టిలేపాడు.

ఛెన్నుడు ఉలిక్కిపడిలేచి "యువరాజా" అని అన్నాడు.

సిద్ధార్ధుడు గుర్రపుశాలవైపు దారితీసాడు. ఛెన్నుడు ఆయన్ను అనుసరించాడు.

"కంటకాశ్వాన్ని విప్పుకొని రా ! ఛెన్నా !"

"అలాగే ప్రభూ" అంటూ ఛెన్నుడు కంటకం అనే పేరు గల గుర్రాన్ని విప్పుకొని సిద్ధార్థుని వద్దకు తెచ్చాడు. కంటకం సిద్ధార్థునికి అతి ప్రియమైన అశ్వం. సిద్ధార్థుడు స్వారీ చేయడానికి కంటకాన్నే ఎన్నుకొనేవాడు.

గుర్రాన్ని ప్రేమగా నిమిరాడు సిద్ధార్థుడు.

సిద్ధార్థుడు ఆదేశం కొరకు ఛెన్నుడు ఎదురు చూడసాగాడు.

సిద్ధార్థుడు అశ్వంపైన కూర్చున్నాడు. గుర్రాన్ని అదిలించాడు ఛెన్నుడు. "మనం కపిలవస్తు పొలిమేరల్ని దాటి వెళ్లాలి ఛెన్నా" అన్నాడు ద్ధార్థుడు.

అర్ధరాత్రి సమయం పుచ్చపువ్వులాంటి వెన్నెల కాస్తోంది. నగరం నీరవ నిశ్శబ్దంలో జోగాడుతోంది. కంటకాశ్వం అడుగులో అడుగువేస్తూ ముందుకు పోతుంది. ఛెన్నుడు మనస్సు ఆరాటపడుతోంది. యువరాజు సిద్ధార్థుని పయనమెక్కడికి ? ఈ అర్ధరాత్రి బయలుదేరడమేమి ? యువరాజుని అడిగే సాహసంలేదు. మెల్లిగా కంటకాన్ని నడిపిస్తూ మౌనంగా ఛెన్నుడు గుర్రం ప్రక్కనే నడుస్తున్నాడు.



కపిలవస్తు నగరం దాటి కొంత దూరం ముందుకు వెళ్లినతదుపరి "ఛెన్నా! కనిపించే ఆగుట్టలవద్ద కంటకాన్ని ఆపు" అని ఆదేశించాడు.

కంటకం ఆగింది. సిద్ధార్థుడు గుర్రం దిగాడు ఛెన్నుడు అయోమయంగా సిద్ధార్థుని వైపు చూస్తూ వుండిపోయాడు. సిద్ధార్థుడు ఒరలో నుండి కత్తి తీసి రాజ కుమారులకు అలంకార ప్రాయమై శిరోజాల్ని కత్తితో ముచ్చెనగుంట వరకు కోసి, ఆ శిరోజాల్ని ఛెన్నునికి అందించాడు. తన ఒంటిమీదవున్న రాజరిక దుస్తుల్ని వలచి, తనవద్దనున్న కాషాయవస్త్రాన్ని ధరించి, మరొక కషాయవస్త్రాన్ని కప్పుకున్నాడు. పాదరక్షల్ని విడిచాడు. ముంజేతి కంకణాల్ని చేతిదండాల్ని తదితర రాజభరణాల్ని అన్నింటినీ తీసి ఛెన్నునికి అందించాడు. "ఈ రాజభరణాలు, దుస్తులు పాదరక్షలతో శిరోజాల్ని సైతం నీవు ఒక వస్త్రంలో భద్రపరుచుకొని మా తండ్రి శుద్ధోదనునికి అందించు ఛెన్నా ! నేను సన్యసించానని, దేశాటనం వెళ్లిపోతున్నానీ, యిక రాజసౌధానికి తనకూ ఎలాంటి బంధుహిత

సంబంధంలేదనీ అన్ని భవబంధాల్ని తెంచుకున్నానని తెలియజేయవలసింది'' అని సిద్ధార్థుడు ప్రశాంతంగా చెప్పాడు.

సిద్ధార్థుని మాటల్ని వింటూన్న ఛెన్నడు కుప్పకూలి భోరున విలపించాడు. "యువరాజా! నన్నుకూడా మీవెంట తీసుకువెళ్లండి మీరులేకుండా నేను నగరానికి వెళ్లలేను' అన్నాడు. గాద్గదికంగా

సిద్ధార్థుడు చిరునవ్వుతో "ఛెన్నా ! ఇది నావ్యక్తిగత నిర్ణయం. నీవు అర్థం చేసుకో! నా ఆజ్ఞగా కాకుండా, విజ్ఞప్తిగా పాటించు'' అన్నాడు.

కంటకాశ్వం ముందుకాళ్ల మీద వంగి, సిద్ధార్థుని పాదాలు స్పృశించి, కన్నులవెంట ధారాపాతంగా కన్నీటిని కారుస్తూ వుండి పోయింది. సిద్ధార్థుడు ప్రేమతో దాని వెన్నును నిమురుతూ, కొద్దిసేపు అలాగే వుండిపోయాడు. తదుపరి ఛెన్నుని రెండు చేతులతో దగ్గరకు తీసుకొని "లోక కళ్యాణం ధ్యేయంగా నేను సన్యసిస్తున్నాను, ఛెన్నా ! దుఃఖాన్ని మానుకొని, కంట కాన్ని తీసుకొని, రాజసౌధానికి వెళ్లు,'' అంటూ తాను ముందుకు కదిలాడు.

ఛెన్నుడు పెద్దగా రోధిస్తూ, మారుమాట్లాడలేక, కంటకాశ్వాన్ని నడిపించుకుంటూ మధ్యమధ్య సిద్ధార్థుడు వెళ్లి పోతున్న దిక్కు వైపు తిరిగి చూస్తూ కపిలవస్తు నగరంవైపు కదిలిపోయాడు.

సిద్ధార్థుడు ముందుకు సాగిపోయాడు.

## సత్యాన్వేషణ

సిద్ధార్థుడు తన 29వ ఏట, యింటినీ, భార్యనీ, బిడ్డనీ, సమస్త రాజ్యవైభోగాల్నీ కాలదన్ని, వైశాఖపౌర్ణమినాటి అర్ధరాత్రి, కపిలవస్తు విడిచి సాగిపోయాడు. మానవజన్మకూ ప్రకృతిలోని వైరుధ్యాలకు, సృష్టి, స్థితి, లయలకూగల కారణాలనూ తెలుసుకోవడం తన ధ్యేయంగా సిద్ధార్థుడు అనంత విశ్వంలోకి పయనమైనాడు. సన్యాసాశ్రమం స్వీకరించినట్టు గుర్తుగా కాషాయవస్త్రాలను ధరించాడు సిద్ధార్థుడు.

అనేక ప్రాంతాలు తిరిగాడు. తొలుత అలారకలామ ఆశ్రమాన్ని సందర్శించాడు. అలారకలామ వద్ద తత్వశాస్త్రంలో అనేక విషయాలను తెలుసుకున్నాడు. పురాణేతి హాసాలు, షట్శాస్త్రాలూ ప్రాచీన భారతీయ సామాజిక చరిత్రనూ సిద్ధార్థుడు ఆకలింపు జేసుకున్నాడు. భారతీయ ఆధ్యాత్మిక జీవన మార్గాన్ని అవగతం చేసుకున్నాడు. వైశాలిలోని అలారకలార ఆశ్రమం సిద్ధార్థుని మరింత జిజ్ఞాసువుగా మలిచింది.

కొన్నాళ్ల తరువాత సిద్ధార్థుడు ముందుకు సాగిపోయాడు. 'అలారకలామ' ఆశ్రమంలో ఆయన తెలుసుకున్న ఆధ్యాత్మికత సంతుష్టిపరచలేదు. తన జిజ్ఞాసకి తగిన

సమాధానం అక్కడ లభించలేదు. కానీ తత్త్వశాస్త్రంలోని ప్రాతిపదిక అవగతంకాసాగింది. భిన్న దర్శనాలూ, వాటి సిద్ధాంత దృక్పథాలను సిద్ధార్థుడు నేర్చుకున్నాడు. కానీ యీ దర్శనాలు సిద్ధార్థుని ప్రశ్నలకు సమాధానాన్ని చెప్పలేక పోయాయి.

ఆ రోజుల్లో మగధరాజ్యం మిక్కిలి బలోపేతమైనది. దాని రాజధాని రాజగృహ, సకలశాస్త్రపారంగతులకూ రాజగృహ ఆటపట్టుగా వుండేదని సిద్ధార్థుడు విని, అక్కడికి చేరుకున్నాడు. అక్కడ ఉద్రకుడు నడుపుతున్న ఆశ్రమానికి వచ్చాడు. ఉద్రకుడు అపారపాండితీ వేత్త. ఆయన పాండితీ ప్రకర్ష సిద్ధార్థుని ఆకర్షించింది. కానీ పాండిత్యంవల్ల సత్యం బోధపడదని గౌతముడు తెలుసుకున్నాడు. వైశాలిలోని అలారకలార ఆశ్రమ పద్ధతులతోపాటు, దారిలో వున్న భృగు ఆశ్రమంలో కొన్నాళ్లు గడుపు, తపోనిష్టులైన ఆశ్రమవాసుల తపోమార్గాల్ని పరిశీలించాడు. అలారకలామ ఆశ్రమంలో ధ్యానమార్గాన్ని అభ్యసించాడు. ధ్యాన సమాధి, యోగరహస్యాలు సిద్ధార్థ గౌతమునికి ప్రశ్నగా మిగిలాయి.

రాజగృహంలోని ఉద్రక ఆశ్రమంలో అనాదినుంచే ఆనాటి వరకూ వ్యవస్థీకృతమైవున్న దార్శనిక సూత్రాలను అధ్యయనం చేసిన, సిద్ధార్థ గౌతమునికి, పారలౌకిక చింతన ప్రాతిపదిక మాత్రమేవాటిలో కనిపించిందే గానీ, ప్రాపంచిక జీవనంలోని మనిషి సుఖదుఃఖాలకు గల కారణాలు కనిపించలేదు. ఈ సిద్ధాంత అధ్యయనం సిద్ధార్థునకు నేలవిడిచి సాముచేసిన చందంగా గోచరించింది.

స్థావర జంగమమైన యీ చరచర జగత్తులో, మనిషి నడయాడుతున్నాడు. పుట్టుక, జీవిక, మరణం సర్వజంతులక్షణమే, అయినప్పుడు, మనిషి జీవనంలోని సుఖదుఃఖాలకు, కోర్కెలకు, ఈర్ష్య, ద్వేషాలకు, సాఫల్యతకూ, విఫలత్వానికి మూలమేది? వీటికి పరిష్కార మార్గమేది ? వీటికి కారణాలను కనుగొనాలని సిద్ధార్థ గౌతముడు కృతనిశ్చయుడైనాడు.

మరికొన్నాళ్లు సత్యాన్వేషణలకు తీవ్రమైన తపనతో ఆలోచింపసాగాడు. తిరిగి తనలో పాటమరించిన ఆలోచనల్ని క్రోడీకరించుకొనేవాడు.

అలారకలామ ఆశ్రమంలోనూ, ఉద్రకదారు పుత్ర, ఆశ్రమంలోను యీ సృష్టికి ఒక సృష్టికర్తవున్నాడని, అతడే బ్రహ్మ అని కొందరు, ఈశ్వరుడని కొందరు చెబుతూ, మనిషికి పునర్జన్మ వుంటుందని అన్నారు. మనిషిలోని ఆత్మ యీ జన్మలో చేసుకొన్న పాప పుణ్యాల ఫలితాన్ని బట్టి పునర్జన్మ ఏర్పడుతుందని కూడా చెప్పారు. మరణం వల్ల శరీరం నశిస్తుందేగానీ, ఆత్మకు చావులేదని, యీ జన్మలో చేసిన పాపాలకు నరకంలో శిక్ష అనుభవించాలనీ పుణ్యం చేసుకున్న వారికి స్వర్గం లభిస్తుందని కూడా హైందవంలోని

భిన్నశాఖలు చెబుతూ వచ్చాయి. సిద్దార్థ గౌతముడు యీ దార్శనిక సిద్ధాంతాలన్నింటినీ విన్నాడు. ఒక దానికొకటి సమన్వయం కుదరడంలేదు.

గౌతమునికి గతంలో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వచ్చింది. ఏరువాక ఉత్సవాలు జరుగుతున్నాయి. పట్టణం వెలుపల పంట పొలాల్లో ఆడా, మగా, పిల్లలందరూ ఏరువాక ఉత్సవాల్ని అత్యంతవేడుకగా జరుపుకుంటున్నారు. తండ్రి శుద్ధోదనుడు, రాజ పరివారం సైతం వేడుకల్లో పాల్గొని వుండగా, తనకు ఏకాంతంగా గడపాలని అనిపించింది. తాను ఒక్కడే, దూరంగా ఒక నేరేడు చెట్టు క్రింద కూర్చొని ఆలోచనల్లో మునిగి పోయాడు. తండ్రి శుద్ధోదనుడు తనను సమీపించి, పరామర్శించిందాకా, ఆయనకు పరిసరాలే జ్ఞాపకం రాలేదు. ఏకాంతం సిద్దార్థునకు ఎంతో సంతృప్తి కలిగించింది.

ఒకసారి నగర పర్యటనలో రోగినీ, ముదుసలినీ, శవాన్ని చూసాక, మానవ జీవితం లోని అసమగ్రతా, దుఃఖం, వేదనతో పాటు, జీవితం అశాశ్వతం అని కూడా నిరూపితమైంది. అదే పర్యటనలో తాను ఒక సాధువును కూడా చూడడం జరిగింది. ఆ సాధువు ఎంతో గంభీరంగా, ఎలాంటి చీకూ చింతా లేకుండా, ప్రశాంతంగా వున్నట్టు తనకు అనిపించింది. ఆ స్ఫూర్తి తనకు సత్యాన్వేషణకు తగిన మార్గాన్ని చూపించినట్లయింది.

రోహిణీ నది జలాల వివాదం తన ఆలోచనా పరిధిని మరింత విస్తృత పరిచింది. మనిషిలోని స్వార్థ చింతనకూ, ఆవేశ కావేషాలకు రోహిణీ నదీ జలాల వివాదం తనకు ఒక తార్కాణంగా తోచింది. ఫలితంగా తానూ సర్వాన్ని త్యజించి, శ్రమణ జీవితాన్ని ఎన్నుకొని, మానవ జీవితానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనేందుకు దేశాటనం చేయవలసి రావడం జరిగింది.

వైశాలి, రాజగృహ, ఉరువేళారణ్యాన్నీ పర్యటిస్తూ, ఎన్నో ఆశ్రమాల్ని, మునుల్ని, సాధువుల్ని, తత్వవేత్తల్ని కలుసుకొంటూనే వున్నాడు. కానీ తనలో పొటమరించిన ప్రశ్నలకి తగు సమాధానం లభ్యం కాలేదు. తాను తెలుసుకున్న తాత్విక సిద్ధాంతాలేవీ తనను తృప్తి పరచలేక పోయాయి.

యీ అన్వేషణా క్రమంలో తాను ధ్యాన, యోగ మార్గాల్ని కొంతమేరకు అభ్యసించడం జరిగింది. యిక కొంతకాలం ఏకాంతంగా ధ్యానంలో గడపాలనీ, తద్వారా సత్యాన్ని తెలుసుకోవాలనే నిర్ణయానికి సిద్దార్థ గౌతముడు వచ్చాడు.

ఉరువేళ అరణ్యం - శింశుపా వృక్షరాజములు - - ఒంపులు తిరుగుతూ ప్రవహించే నిరంజనానది - - ఫల, పుష్ప వనాలు - - ప్రశాంతమైన చోటు సిద్దార్థుడు ఉరువేలలో ఒక వటవృక్షం క్రింద విశ్రమించి వుండగా, ఆ పరిసర ఆశ్రమాల నుండి అయిదుగురు

ఆశ్రమవాసులు సిద్ధార్థ గౌతముని కాంతివంతమైన ముఖవర్ఛస్సుకు అబ్బురపడి, ఆయన వద్దకు వచ్చి, వినమ్రతతో నమస్కరించారు.

"భగవాన్! మేము తమ వద్ద దార్శనిక సూత్రాలను, ఆధ్యాత్మిక రహస్యాలను తెలుసుకుకేందుకు వచ్చినాము. మమ్మల్ని తమ శిష్యులుగా పరిగణించి, ఆశీర్వదించ గోరుతున్నాము'' అని అడిగారు.

సిద్ధార్థ గౌతముడు వారివైపు ప్రసన్న వదనంతో చూస్తూ "గుణశీలులారా! సత్యాన్వేషణలో నేనూ మీదారిలోనే వున్నాను. కొంతకాలం ధ్యాన యోగంలో గడపాలనుకుంటున్నాను. తద్వారా బ్రహ్మజ్ఞానం, జీవిత రహస్యాలు తెలుసుకొనే అవకాశం వుంది'' అన్నాడు.

సిద్ధార్థ గౌతముడు ధ్యానంలో వున్నప్పుడు, అయిదుగురు శిష్యులూ ఆయన సకలోపచారాలు చేస్తూ వుండేవారు. చాలా కాలం సిద్ధార్థ గౌతముడు ధ్యానంలో కఠోర తపస్సు చేయగా, ఆయన దేహం శుష్కించి పోయింది. శిష్యుల్లు ఆయనను భక్తి శ్రద్ధలతో కొలుస్తూ, తమ గురువు గొప్ప జ్ఞాని కాగలడని తలిచారు.

కొన్నాళ్లకు కఠోర ఉపవాసాల వల్ల శక్తి నంతా కోల్పోయి, సిద్ధార్థ గౌతముడు, లేచి నడవడానికే అశక్తుడైనాడు, అచేతునుడైనాడు.

ఆ సమయంలో ఉరువేళలో నివసించే సేనాని అనే గృహస్తు కుమార్తె సుజాత అనునామె, సమీపంలోని క్షేత్రంలో భూమి పనులు చేస్తున్న భర్తకు ఆహారం తీసుకొని వెళుతూ, అచేతనంగా పడివున్న సిద్ధార్థ గౌతముని వద్దకు ఏతెంచి "స్వామి'' అని పిలిచింది. ప్రతిదినము అక్కడ ధ్యానంలో వుండే సిద్ధార్థుని, ఆమె భక్తిభావంతో చూస్తూ ఉండేది. ఈరోజు అచేతనంగా వున్న సిద్ధార్థుని చూసి, ఆమె విచలితురాలైంది.

సుజాత పిలుపుకు సిద్ధార్థుడు కళ్లు తెరిచి చూసాడు. సుజాత తన పాత్రలో వున్న పాలు, పాయసాన్ని సిద్ధార్థునికి అందించి, "ఆరగించండి, స్వామీ'' అని అన్నది. సిద్ధార్థుడు పాలనూ, పాయసాన్ని ఆరగించాడు. అప్పుడు కోల్పోయిన శక్తిని సిద్ధార్థుడు పుంజుకున్నాడు. ఆయన కళ్లు తేజోవంతము లయ్యాయి.

చాలా కాలం నుంచి ధ్యాన నిష్ఠుడై వున్న సిద్ధార్థుడు తపోనియమాన్ని వదిలి, ఎవరో గృహిణి తెచ్చిన పాయసాన్ని భుజించటం, అయిదురుగు శిష్యులకూ నచ్చలేదు. సిద్ధార్థుడు దివ్యశక్తుల్ని కోల్పోయాడని భావించి, ఆయనపై విశ్వాసాన్ని కోల్పోయి, ఆయన్ను విడిచి వెళ్లిపోయారు.

కఠోర తపస్సు వల్ల శరీరం శుష్కించడం వల్ల ఎలాంటి బ్రహ్మజ్ఞానం అలవడదని సిద్ధార్థుడు గమనించాడు.

# బుద్ధత్వం

సిద్ధార్థుడు తీవ్రమైన ఆలోచనల్నుంచి తేరుకొని, నిరంజనా నదిలో స్నానమాచరించి, నేటి గయకు సమీపంలోని ఒక ఉద్యానవనంలో అశ్వత్థవృక్షం క్రింద కూర్చుని, తనకు సత్యం బోధ పడిందాకా యిక్కడినుంచి కదలకూడదని నిశ్చయించుకున్నాడు. గాఢమైన ఆయన ధ్యానం కొనసాగుతూనే వుంది. ఏకాంతంగా సాగిన ఆలోచనల్లో సిద్ధార్థ గౌతముడు, ఇప్పటిదాకా అనేక మంది తాత్వికులు ప్రవచించిన సిద్ధాంత మార్గాలను అవలోకనం చేసుకున్నాడు.

అప్పట్లో సమాజంలో మూఢ విశ్వాసాలు పెచ్చరిల్లి కొనసాగుతూ వుండేవి. యజ్ఞయాగాదులు ఆశ్రమాల్లో ఋషుల చేత నిర్వహింపబడేవి. యజ్ఞాల వల్లనే వర్షాలు కురుస్తాయని ఋషులు రాజులకు నమ్మబలుకుతూ వుండేవారు. యజ్ఞాలవల్ల దేవతలు సంతోషిస్తారనీ చెప్పేవారు. యజ్ఞ నిర్వహణలో జంతుబలులు జరుగుతూ వుండేవి. మూఢాచారాలు ప్రభలంగా వుండేవి. జనన, మరణ సమయాల్లో కర్మకాండలు నిర్వహింప బడేవి. ఏనాడో చనిపోయిన పితృదేవతలకు శాంతులు జరిపించబడేవి. తపస్సు వల్ల దివ్యశక్తులు సంప్రాప్త మవుతాయనీ, ఋషులు ప్రచారం చేస్తూ వుండేవారు. ఆనాడు నమ్మకంలో వుండి, జనజీవనంలో ఆచరణలో వున్న హైందవంలో ఎందరో దేవుళ్ళు పూజింపబడుతూ వుండేవారు. ఒక్కో దేవుడికి ఒక్కో కథ, ఐతిహ్యం, మహోత్సం అంటగట్టబడి, అందుకు సంబంధించిన పూజాదికాలు, ఆచారాలు కొనసాగేవి. శైవం, వైష్ణవం, శాక్తేయం, కాపాలికం, సూర్యారాధన ప్రజల మతవిశ్వాసాలుగా వుండేవి. హైందవంలోని యీ భిన్నశాఖల మధ్య సమన్వయం వుండేది కాదు.

అంతేకాదు, సమాజంలో పౌరోహిత వర్గం పెత్తనం అధికంగా వుండేది. వర్ణ వ్యవస్థ అమల్లో వుండేది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు పేరిట ప్రజలు విభజింపబడి, హెచ్చుతగ్గులు కొనసాగుతూ కొందరు ఎక్కువ, మరికొందరు తక్కువ భావంతో చూడబడేవారు. అదీగాక నాలుగ్గు వర్ణాలతో పాటు, ఎన్నో కులాల పేరిట ప్రజల్లో తమతమ భేదాలు చూపబడుతూ వుండేవి. బ్రాహ్మణ, క్షత్రియ వర్గాలు సమాజం మీద పెత్తనం చేసేవారు. మిగిలిన కులాలు తక్కువగా చూడబడేవి. అస్పృశ్యులు, ఛండాలురు, కానీనులు అంటూ మరికొన్ని తరగతుల ప్రజలు హీనాతిహీనంగా చూడబడేవారు. ఇదంతా భగవంతుని సృష్టిక్రింద పౌరోహితవర్గం ప్రచారం చేస్తూ వుండేది. రాజులు వీరికి అనగా పౌరోహిత వర్గానికి అండగా వుండటమే గాక, రుషులు, మునులు, బ్రాహ్మణ వర్గాలు చెప్పిన వాటినే అనుసరిస్తూ వుండేవారు. ఇదీ ఆనాటి సామాజికస్థితి.

అనేక దేవుళ్ళు, ఎందరో దేవతలు ప్రచారంలో వుండేవారు. రకరకాల దేవతల సంబంధ బాంధవ్యాల్లో ఎంతో వైరుధ్యం, ఒక్కోచోట అల్పత్వం కూడా కనిపిస్తోంది.

# జ్ఞానోదయం

ఆరోజు వైశాఖ పౌర్ణమి. పున్నమి చంద్రుడు నిర్మలమైన ఆకాశంలో దేదీప్యమానంగా వెలుగుతున్నాడు. పరిసర వాతావరణమంతా నిశ్శబ్దంతో, గంభీరత్వాన్ని సంతరించుకొని వుంది. మబ్బు తునకలు మాయమై, స్వచ్ఛమైన కాంతితో మెరిసిపోతున్న చంద్రుడిలా, సిద్ధార్థ గౌతముని మనస్సు అనిర్వచనీయమైన ఆనందంతో తళుక్కుమన్నది.

సిద్ధార్థ గౌతముడు సమాజంలో పాతుకుపోయిన మూఢ విశ్వాసాలు, ఆచారాలు, వర్ణవ్యవస్థలోని అసమానతలు, ప్రజల మధ్య ఏర్పడివున్న ఎగుడుదిగుడులూ, ఉచ్చ నీచ వ్యత్యాసాలూ ఆయన మస్తిష్కాన్ని ఆలోచింప జేసాయి. యజ్ఞయాగాల వల్ల వర్షాలు కురవడం, దేవతలు తృప్తి పడడం, యిందుకు నోరులేని అమాయక మూగ ప్రాణుల్ని బలి యివ్వడాన్ని సిద్ధార్థ గౌతముని మనస్సు అంగీకరించ లేకపోయింది.

మనిషిలోని త్రయీగుణమైన సత్వ, రజో, తమో గుణాల స్వభావాలు, వాటి ప్రభావం మనిషి మస్తిష్కం మీద ఎలా పనిచేసేది సిద్ధార్థ గౌతముడు తర్కింపచేసాడు. ప్రకృతిలోని వైరుధ్యాలు సిద్ధార్థ గౌతముని ఆలోచింపజేసాయి.

తాను ధ్యాన, సమాధి స్థితిలో చాలాకాలం గడిపాడు. కానీ ధ్యానం, తపస్సు వల్ల ఎట్టి ప్రయోజనం చేకూరలేదని, ఆయన స్వీయానుభవం వల్ల తెలుసుకున్నాడు.

సిద్ధార్థుడు గయ నగరపు పొలిమేరల్లో, రావి చెట్టు క్రింద ఒంటరిగా, **49** రోజులు తీవ్రమైన ధ్యానంలో గడిపారు. గతం, వర్తమానం ఆయన మనోవేదిక మీద ప్రతిఫలించాయి. తన విద్యాభ్యాసపు రోజుల్లో గురువుల, పండితులు నేర్పిన విద్యల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. అలారకలామ ఆశ్రమంలో, ఉద్రకదామ పుత్రుడి వద్దా, భృగు ఆశ్రమంలో ప్రాచీన, అర్వాచీన విద్యల నెల్లా అవగతం చేసుకొన్న సిద్ధార్థునికి వర్తమాన సమాజంలోని వైరుధ్యాలతో పోల్చుకుంటే, వాటి మధ్య పొంతన కనిపించడం లేదు. స్వర్గ, నరకాలు, పాపం, పుణ్యం, పునర్జన్మ, ఆత్మ తదితర విషయాలు మనిషి జీవితంలోని ఘటనా ఘటనలతో సరిపోల్చుకోవడానికి వీలు కుదరడం లేదు.

వేదాలు, ఉపనిషత్తులు, షట్శాస్త్రాలూ, దర్శనాలూ, రామాయణ, భారతేతిహాసాలూ, పురాణాలు, ఇతిహాస కావ్యాలన్నింటినీ ఆమూలాగ్రంగా పఠించి, తర్కించి, సిద్ధార్థుడు, వాటి సారాంశాన్ని, వాస్తవిక దృష్టితో అర్థం చేసుకున్నాడు. ప్రతిరోజూ ధ్యానంలో వున్నపుడు, ఆయన మస్తిష్కం యీ అంశాల మీదే కేంద్రీకరించి, సత్యాన్వేషణ చేయసాగాడు.

ఆరోజు వైశాఖ పౌర్ణమి!

పుచ్చ పువ్వుల్లాంటి తెల్లని వెన్నెల అంతటా పరచుకొని, ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. ఆరోజు సిద్ధార్థుని మనస్సు నిర్మలంగా వుంది. మానవేతిహాసంలో చిరస్థాయిగా వెలుగొందనున్న నూతన తాత్విక మార్గం సిద్ధార్థుని మస్కిష్కంలో తళుక్కుమన్నది. ఆయన మనస్సు తేలికపడింది. దుఃఖదాయకమైన మానవ జీవితానికి పరిష్కార మార్గంగా నవ్య తాత్విక సిద్ధాంతం ఆయన మనోవేదిక మీద సాక్షాత్కరించింది. సిద్ధార్థుని మేధోమథనం ఫలించింది.

సూర్యోదయమైంది.

సిద్ధార్థుడు బుద్ధత్వాన్ని పొంది, యీ చరాచర జగత్తులో నివసించే ప్రాణికోటికి ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చే, పరిపూర్ణమైన దివ్యజ్ఞానాన్ని గౌతముడు పొందాడు.

బుద్ధిని జయించాడు. బుద్ధుడైనాడు.

నేటి బీహార్‌లోని "గయ' నగర పరిసర ప్రాంతంలో, బుద్ధుడు తపస్సు చేసి, తీవ్ర ధ్యానమార్గంలో, మేధోమథనంతో, సునిశిత పరిశీలనతో, మానవ కోటికి ఒక నూతన మార్గాన్ని కనుగొన్నస్థలమే, నేడు బుద్ధ గయగా పిలవబడుతూ అంతర్జాతీయ యాత్రాస్థలమైంది. ఆరావి చెట్టు 'బోధివృక్షం' అయింది.

బుద్ధత్వం పొందిన తదుపరి బుద్ధుని మనస్సు తేలికపడింది. ప్రశాంతమైన వదనం, గంభీరముద్ర, చిరునవ్వు, సునిశితమైన పరిశీలనా వైశిష్ట్యం, బుద్ధుని సహజ గుణాలుగా సంతరించుకున్నాయి.



రావిచెట్టు క్రింద నలభై తొమ్మిది రోజులుగా సాగించిన తన ధ్యాన వేదికమీద బుద్ధుడు నిర్మలానందంతో, పచార్లు చేస్తూ "తన నూతన సిద్ధాంతాన్ని ప్రజలు అర్థం చేసుకుంటారా? ఆచరిస్తారా? ఏవిధంగా తన ప్రవచనాల్ని ప్రజల్లో ప్రవేశపెట్టాలి?" అంటూ సుదీర్ఘంగా ఆలోచింపసాగాడు.

తన 29వ ఏట యిల్లు విడిచి వచ్చాడు. ఆరేళ్లు తిరిగాడు. నేటికి తన ప్రశ్నలకి సమాధానం దొరికింది. దీనికి తను మరింత పదును పెట్టాడు. కల్లోల భరితమైన సమాజానికి, ఆవేశకావేశాలతో, ఈర్ష్యాసూయ లతో కొట్టుమిట్టాడే యీ మానవాళికి పరిష్కారమార్గంగా నూతన సిద్ధాంతాన్ని బుద్ధుడు రూపకల్పన చేసాడు.

బుద్ధుడు అక్కడి నుంచి తన ప్రయాణాన్ని ముందుకు సాగించాడు. అప్పట్లో పాండిత్యానికి, విద్యకూ, సకల కళాశాస్త్రాలకు కాశీ పట్టణం కేంద్రబిందువుగా వుండేది. బుద్ధుడు కాశీ పట్టణ పొలిమేరల్లోకి అడుగు పెట్టాడు. ఒక చోట తనను విడిచి వెళ్లిన అయిదుగురు శిష్యులు ఆయనకు తటస్థపడ్డారు. దూరాన్నుంచి బుద్ధుడ్ని చూసి "అడుగో! మన తొలిగురువు యిటే వస్తున్నాడు" అంటూ ఆసక్తితో తిలకించసాగారు.

బుద్ధుడు దగ్గరకు వచ్చే కొలదీ ఆయన గంభీర వదనంపై చిరునవ్వు, ప్రశాంతత, ఆయన నేత్రాల్లో కొత్త వెలుగును చూడసాగారు. అప్రయత్నంగా అయిదుగురు శిష్యులు చేతులు జోడించి, ఆయన ముందు వినమ్రంగా నిలబడ్డారు.

బుద్ధుడు వారివైపు ప్రసన్న వదనంతో చూస్తూ "మీరు నాకు ప్రియమైన శిష్యులు. మీరు నన్ను విడిచి వెళ్లిన తరువాత, నేను కనుగొన్న నూతన సత్యాన్ని మీకే ప్రథమంగా బోధిస్తాను" అని అనగానే అయిదుగురు శిష్యులూ ఆయన్ను అనుసరించారు.

ఆ పరిసర ప్రాంతంలోని ఒక ప్రశాంతమైన ప్రదేశాన్ని బుద్ధుడు గమనించి, అక్కడ తన అయిదుగురు శిష్యులతో విడిది చేసాడు.

## ప్రథమ ధర్మచక్ర ప్రవర్తనము

అయిదుగురు శిష్యులు బుద్ధని అనుసరించారు. కొండన్న, బప్ప, భద్దియ, మహానామ, అస్సాజీ అనే పేర్లతో పిలువబడే అయిదుగురు శిష్యులూ పరివేష్టించి వుండగా, బుద్ధుడు పద్మాసనం వేసుకొని వారికి అభిముఖంగా తను కనుగొన్న నూతన సిద్ధాంత దృక్పథాన్ని వివరించ సాగాడు.

# ప్రథమ ధర్మచక్ర ప్రవర్తనం

అది మృగదావనం ! అమాయకమైన చూపులతో, చెంగు చెంగునా దుముకుతున్న లేళ్ల గుంపులు ఆ వనంలో సంచరిస్తున్నాయి. అందమైన పూల చెట్లు, రక రకాల వృక్షములతో మృగదావనం శోభిల్లుతూ వుంది.

పచ్చని గరిక.

బుద్ధుడు ఆసీనుడైనాడు. చుట్టూ అయిదుగురు శిష్యులూ ఆయన ముందు పరివేష్టితులైనారు.

"ప్రియమైన శిష్యులారా ! వినండి ! అతి నమ్మకం పనికిరాదు. అనగా గుడ్డిగా దేన్నీ అనుసరించరాదు. అయితే అదే సందర్భంలో అసలు నమ్మకమే లేకపోవడం మంచిది కాదు. అందు వల్ల మధ్యే మార్గాన్ని అనుసరించాలి' అంటూ బుద్ధుడు తన తొలి ప్రవచనాన్ని ప్రారంభించాడు. "యీ ప్రపంచంలో దైవం పట్ల, ప్రకృతి పట్ల, సమాజం పట్ల, వ్యక్తి జీవన విధానాల్లో అనేక నమ్మకాలు ప్రబలి వున్నాయి. ప్రచారం చేయ బడుతున్నాయి. మనిషి జీవితంలో దు:ఖం వుంది. అందుకు కారణం వుంది.దు:ఖాన్ని నిరోధించవచ్చును. అందుకు దు:ఖ నివారణకు మార్గం వున్నది. ఈ నాలుగు ఆర్య సత్యాలుగా పరిగణించాలి" అన్నాడు బుద్ధుడు.



**1. దు:ఖం**

**2. దు:ఖానికి గల కారణం**

**3. దు:ఖ నిరోధం**

**4. దు:ఖ నిరోధ మార్గం : యిదే అష్టాంగ మార్గం**

జీవితంలో మనిషి ఎదుర్కొనే ప్రతి సమస్యనీ దు:ఖం పేరిట బుద్ధుడు వర్ణించాడు. ఘటనలన్నీ వాటి వాటి కారణాల వల్లనే ఉత్పన్నమౌతాయి. ఆ కారణాన్ని బుద్ధుడు చెప్పాడు. వాటి నిరోధ మార్గాన్నీ చెప్పాడు.

"భిక్షువులారా ! మనం 'అతి' ని వదిలి పెట్టాలి. జీవితాన్ని పూర్తిగా కామం, సుఖం, భోగ భాగ్యాల్లోనే గడపరాదు. అయితే యిదే సందర్భంలో సర్వాన్నీ వదిలి, సమాజానికి దూరమై, శరీరాన్ని కఠిన తపో మార్గంలో శుష్కింపజేసుకోరాదు. ఈ రెండు 'అతి' మార్గాలనూ తిరస్కరించాలి. నేను మధ్యమ మార్గాన్ని కనిపెట్టాను. ఈ మార్గం మనకు జ్ఞానాన్ని కలిగిస్తుంది. శాంతిని యిస్తుంది. యిది మధ్యమ మార్గం. దీన్ని ఆచరించటానికి 'అష్టాంగ మార్గం' వున్నది.

"ఇప్పుడు మీకు ఆర్య సత్యాల్ని వివరిస్తాను.

దుఃఖం. దీన్ని గురించి వినండి. జన్మ దుఃఖం వృద్ధాప్యం దుఃఖం మరణం దుఃఖం, శోకం. జీవితంలో అనుకున్నది లభ్యంకాకపోవడం, ఆప్తులు విడిపోవడం, అనుకున్నదాన్ని పొందలేకపోవడం, యితరుల వల్ల, వారి సంపర్కం వల్ల వచ్చే కష్ట నష్టాలు - యివన్నీ దుఃఖాలే. మనిషి జీవితంలో సుఖం కంటే, దుఃఖమే ఎక్కువగా వుంటుంది. తాను సుఖం, భోగం, ఆనందం అని భ్రమించే విషయాలు కూడా తుదకు దుఃఖాన్నే మిగుల్చుతాయి. కనుక యిందుకు ప్రతి ఒక్కరూ అష్టాంగ మార్గాన్ని అనుసరించాలి.

**1. సమ్యక్ దృష్టి**

**2. సమ్యక్ వాంఛ**

**3. సమ్యక్ వాక్కు**

**4. సమ్యక్ వర్తన**

**5. సమ్యక్ జీవనం**

**6. సమ్యక్ ప్రయత్నం**

**7. సమ్యక్ ఆలోచన**

**8. సమ్యక్ ధ్యానం**

ఇదే ధర్మ పథం. ఇది మానవ కోటి అనుసరించాల్సిన మార్గం.

**1. సమ్యక్ దృష్టి :** ఎలాంటి కాముకత్వంతోనూ, వికారంతోనూ, స్వార్థంతోనూ చూడరాదు. ఒక వ్యక్తిని లేదా వస్తువును చూడడం అనేది సరియైన భావంతో చూడాలి.

**2. సమ్యక్ వాంఛ :** ఎలాంటి దుర్బుద్ధితో కూడిన కోరిక వుండరాదు. ఎలాంటి దుష్ట భావన లేని కోరికతో వుండాలి. అత్యాశ, దురాశతో కూడిన కోర్కెలు కోరుకోకూడదు.

**3. సమ్యక్ వాక్కు :** మంచి మాట పలకాలి. ఇతరులను నొప్పించే విధంగా మాట్లాడరాదు. మభ్యపరిచే మాటలు పలుకరాదు.

**4. సమ్యక్ వర్తనం :** మంచి ప్రవర్తన కలిగి వుండాలి. ఇతరులకు కష్ట నష్టాలు కలిగే విధంగా ప్రవర్తన వుండరాదు.

**5. సమ్యక్ జీవనం :** ఉత్తమమైన జీవనం గడపాలి. అక్రమమైన, అన్యాయమైన జీవనం గడపరాదు.

**6. సమ్యక్ ప్రయత్నం :** ఏ ప్రయత్నమైనా ఇతరులకు బాధ కలిగించరాదు. సదుద్దేశంతో కూడిన ప్రయత్నమే చేయాలి. కుత్సితం, కుట్రలతో కూడుకొని వుండకూడదు.

**7. సమ్యక్ ఆలోచన :** సరియైన ఆలోచన కలిగి వుండాలి. తోటి వారికి నష్టం, బాధ కలిగే ఆలోచనలు చేయర్రాదు.

**8. సమ్యక్ ధ్యానం :** మంచి ఫలితాన్ని ఆశించాలి. ఏకాగ్రత, అంకిత భావం, సేవా దృక్పథంతో కూడిన ధ్యానం కలిగి వుండాలి.

బుద్ధుడు బోధించిన ఎనిమిది అంశాలు మానవ జీవితానికి సరియై మార్గాలు. అందుకే బుద్ధుడు "మార్గదాత" అయ్యాడు. ఈ ధర్మపథాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తే, దుఃఖం నుండి విముక్తి పొందగలరని బుద్ధుడు ఉపదేశించాడు.

బుద్ధుని బోధనలు చాలా సరళమైనవి. సుబోధకములైనవి. ఆయన తన బోధనల్ని అప్పటి ప్రజల వాడుక భాషయైన పాళీ భాషలో చెప్పాడు. సామాన్యులకు ఈ బోధన అవసరం అని బుద్ధుని భావన.

బుద్ధుడు యిలా బోధించాడు.

"అహింసతో కూడిన జీవనం ప్రతి మనిషికీ అవసరం. ఎలాంటి జీవహింస చేయరాదు. తెలిసి వుండి ఎవ్వరికీ బాధ కల్గించరాదు. ఇతరుల్ని బాధపెట్టకుండా, కష్టపెట్టకుండా వుండడం అహింసతో జీవించినట్లు కాగలదు. మాటల ద్వారా, చేతల ద్వారా యితరుల్ని కష్టపెట్టడం కూడా హింసే అవుతుంది. కనుక ఆ విధంగా చేయకుండా సరళమైన, అహింసతో జీవించడం అవుతుంది. ప్రతి ఒక్కరూ అహింసాపథంలో జీవనాన్ని గడపాలి.

ప్రతి ఒక్కరికీ ఆత్మ సంయమనం అవసరం. అనగా తన మనస్సును అదుపులో పెట్టుకోవడం. మనస్సును అదుపులో వుంచుకోలేకపోతే, మంచితనంగా జీవించడం సాధ్యం కాదు. కనుక ఆత్మ సంయమనం అవసరం.

'జీవకారుణ్యం' అత్యుత్తమ ధర్మంగా బుద్ధుడు భావించాడు. ఆయన బాల్యంలోనే, గాయపడిన పక్షిని కాపాడిన కారుణ్యమూర్తి, ప్రేమ అన్నిటినీ జయిస్తుంది. హింసను అహింసతో ఎదుర్కోవాలి. ద్వేషాన్ని ప్రేమతో ఎదుర్కోవాలి.

"చెడు పనులు చేయకుండా వుండడం, మంచి పనులు చేయడం చిత్తప్రవృత్తుల్ని అదుపులో వుంచుకోవడం" - ఇదే బుద్ధుడి ఉపదేశాల సారాంశం.

కంటికి కనిపించే ఈ ప్రకృతి మాత్రమే వాస్తవమనీ, దృష్టికి అగోచరమైనదాన్ని దేన్నీ నమ్మవద్దని కూడా బుద్ధుడు ప్రవచించాడు. ప్రత్యక్ష ప్రమాణం అవసరం. ఎవరో గొప్పవాళ్ల చెప్పారని నమ్మరాదు. వారు చెప్పిన విషయం వాస్తవమైనదా, కాదా అనే విచక్షణను చేసి, వాస్తవానికి నిలబడితేనే నమ్మాలి అనికూడా ఆయన చెప్పాడు.

మృగదావనంలో ప్రథమ ధర్మచక్ర ప్రవర్తనం యిలా సాగింది. అందరికీ అర్థమయ్యే విధంగా, తన అయిదుగురు శిష్యులకూ బుద్ధుడు ధర్మపథాన్ని గురించి బోధించాడు.

సారనాథ్‌లో బుద్ధుని బోధనల్ని విని, అయిదుగురు శిష్యులూ ఆయనకు అనుయాయు లయ్యారు. అయిదుగురూ తుదకంటూ బుద్ధుని అనుసరించే వున్నారు.

## "సంఘ స్థాపన"

ప్రపంచంలోనే తొలిసారిగా బుద్ధుడు "పరివ్రాజక సంఘాన్ని" స్థాపించాడు. ఒక ధర్మానికి వేదిక స్వరూపాన్ని, ఉద్యమ స్వరూపాన్ని తెచ్చింది బుద్ధుడే.

అంతేకాదు 'సంఘం' అనేది తాము నివసించే సమాజమే. సమాజంలో మార్పులు రావాలి. సామాజిక మార్పు జరిగితేనే, అందులో నివసించే వ్యక్తి జీవితం వికసించడానికి అవకాశం ఏర్పడుతుంది.

కనుక తమ ప్రయత్నానికి ఆలంబనగా జరిగే కృషికి తగిన వేదికకు బుద్ధుడు 'సంఘం' అని పేరు పెట్టాడు. అంతేకాదు తాను రూపొందించిన త్రిశరణలో "సంఘం శరణం గచ్ఛామి" అని మూడవ శరణంగా చెప్పడం కూడా యిందుకే.

"సమాజం మనిషి కోసం

మనిషి సమాజం కోసం" - యీవిధంగా సమాజానికి మనిషి బాధ్యుడైతేనే, ఉత్తమ సమాజం, సమ సమాజం ఏర్పడుతుంది. అందుకే బుద్ధుడు మనిషిని "సంఘం శరణం గచ్ఛామి" అని చెప్పమన్నాడు.

గొప్ప సాంఘిక ఉద్యమకారుడైన బుద్ధుడు సుదీర్ఘ ఆలోచనా క్రమంలో "సంఘం" యొక్క ప్రాధాన్యతకు ఉద్యమ స్వరూపాన్ని కల్పించాడు.

ఇది బుద్ధునిలోని దార్శనికతకూ, ఆచార్యత్వానికీ గొప్ప ఉదాహరణ. అందుకే బుద్ధుడు సిద్ధాంతకారుడూ, తాత్విక చింతనాపరుడే కాదు. సామాజిక శిల్పకారుడు కూడా.

బౌద్ధ సంఘం అనతికాలంలోనే బలోపేతంగా రూపుదిద్దుకొంది. ఎందరో శిష్యులు సంఘంలో చేరారు.

## బౌద్ధ సంఘం స్థాపన

బుద్ధుడు తన అయిదుగురు శిష్యులతో భిక్షు సంఘాన్ని స్థాపించినాడు. ఈ భిక్షు సంఘమే కాలక్రమంలో బౌద్ధ సంఘంగా విస్తృతం చెందింది.

తరువాత కొద్దికాలానికి బుద్ధుడు, శిష్య సమేతంగా మగధ దేశపు రాజధాని "రాజ గృహం" వెళ్లాడు. అక్కడ బింబిసార చక్రవర్తి యజ్ఞం తలపెట్టి ఆ ప్రయత్నంలో వున్నాడు. చక్రవర్తి ఆదేశానుసారం, పరిసర పల్లెల నుంచి, యజ్ఞవేదిక యందు బలి యిచ్చుట కొరకు వందలాదిగా మేకలను తోలుకొని పోవుచున్నారు.

బుద్ధుడు బింబిసార చక్రవర్తి నిర్వహిస్తున్న యజ్ఞాన్ని గురించి విన్నాడు. బుద్ధుడు నడవలేని ఒక కుంటి మేకను ఎత్తుకొని, యజ్ఞ స్థలికి చేరుకున్నాడు. ఋత్విక్కులు వేద పాఠాల్ని వల్లెవేస్తున్నారు. హోతలు, ఆహుతులు, భక్తులతో యజ్ఞశాల క్రిక్కిరిసి వుంది.

బుద్ధుడు ఏతెంచిన వార్త విని, బింబిసారుడు ఎదురేగి నమస్కరించి, యజ్ఞవాటిక వద్దకు ఆయన్ను సపరివార సమేతంగా ఆహ్వానించాడు. బుద్ధుని రాకతో ఋత్విక్కులు, బ్రాహ్మణ పండితులు అవాక్కయ్యారు.

### "యజ్ఞాన్ని ఆపండి"

బుద్ధుని గంభీర వాక్కు యజ్ఞ వాటికలో ప్రతిధ్వనించింది. బింబిసారుడు ఆశ్చర్యంతో బుద్ధుని వైపు చూస్తూ వుండిపోయాడు.

"అమాయకమైన యీ మూగ ప్రాణుల్ని యిక్కడికెందుకు రప్పించారు ?" అని ఋత్విక్కులను బుద్ధుడు ప్రశ్నించాడు.

"ఇవి యజ్ఞ పశువులు. యజ్ఞం సందర్భంగా వీటిని బలి యివ్వడం సాంప్రదాయం"

"నోరు లేని ఈ మూగ జంతువుల్ని బలి యివ్వడం దేనికి ?"

"యజ్ఞ ఫలం కొరకు"

"జంతు బలి లేకుండా యజ్ఞ ఫలం సిద్ధించదా ?"


"యజ్ఞం కొరకు బలి అయిన యీ జంతువులకు స్వర్గ ప్రాప్తి కలుగుతుంది."

"అప్పుడు మీరే యజ్ఞ పశువులు కావచ్చుగా? మీకు స్వర్గ ప్రాప్తి కలుగుతుంది గదా!' అన్నాడు బుద్ధుడు.

యజ్ఞశాలలో కలకాలం చెలరేగింది. ఋత్విక్కులు, బ్రాహ్మణ పండితులు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

బింబిసార చక్రవర్తికి బుద్ధుని వాదన నచ్చింది. బుద్ధుని ప్రశ్నలకు ఋత్విక్కులు సమాధానాలు చెప్పలేకపోవడం బింబిసారుడు గ్రహించాడు.

యజ్ఞాన్ని నిలిపివేయవలసిందిగా బింబిసార చక్రవర్తి ఆదేశించి, ఋత్వికుల్ని, పండితుల్ని యథోచితంగా కానుకలుతో సత్కరించి పంపించాడు.



బుద్ధున్ని సాదరంగా బింబిసారుడు ఆహ్వానించాడు. రాజగృహ సమీపంలోని వేణు వనంలో బుద్ధుడు విడిది చేసాడు.

బుద్ధుని సమీపంలో కూర్చొని, బింబిసారుడు "గౌతమ బుద్ధా ! సన్యాసాశ్రమమే మీ ధ్యేయమా ?" అని అడిగినాడు.

బుద్ధుడు చిరునవ్వు నవ్వి "ఇవి సన్యాస ధర్మమే కదా, బింబిసారా !" అన్నాడు.

"మీ కుటుంబంతో నాకు సన్నిహిత, స్నేహ సంబంధాలు వున్నాయి. ఈ సంబంధాలు తరతరాలుగా వస్తున్నాయి. అందువలన మీతో కొన్ని విషయాల్ని ప్రస్తావించదలిచాను. రోహిణీ నదీ జలాల వివాదంలో కోలీయులతో యుద్ధం ప్రకటించాలని శాక్య సభ తీర్మానాన్ని వ్యతిరేకించినందువల్ల, నీవు శాక్య దేశాన్ని విడిచివచ్చావని నేను విన్నాను. తదుపరి నీ జిజ్ఞాస, సత్యాన్వేషణ వైపు మళ్లి, పరివ్యాజకత్వాన్ని స్వీకరించేదాకా వచ్చిందనుకుంటాను. కానీ, గౌతమా ! నీవు దేశాన్ని విడిచివెళ్లిన సంఘటన మీ ఉభయ దేశాల్ని కలవరపర్చింది. ఉభయ దేశాలూ సంధి ద్వారా నదీ జలాల వివాదాన్ని పరిష్కరించుకున్నాయి. కనుక నీ అభీష్టమే యిక్కడ నెరవేరింది కదా ! ఇక నీవు కపిలవస్తు వెళ్లి, శాక్య సింహాసనాన్ని అధిష్టించవచ్చు గదా" అని అడిగాడు బింబిసారుడు.

"నా ధ్యేయం సింహాసనం అధిష్టించడం కాదు, చక్రవర్తి ! సన్యసించడమే నా కర్తవ్యంగా భావించాను. ఊహ తెలిసినప్పటి నుంచీ ప్రాపంచిక విషయాలను సమూలంగా పరిశోధించడమే పనిగా పెట్టుకున్నాను. సృష్టి, స్థితి, లయకారకాలకు, ప్రకృతి ధర్మాలకూ మూల కారణాల్ని అన్వేషించడమే ధ్యేయంగా నా అన్వేషణ కొనసాగింది. ఇటీవల మరింత స్పష్టంగా అది రూపుదిద్దుకుంది.

రోహిణీ నదీజలాల వివాదం నా సన్యాసాశ్రమానికి ప్రధాన కారణం కాదు. కాకపోతే ఈ వివాదం నా దీక్షకు తలుపుల్ని తెరిచింది. అప్పటిదాకా ఎదురుచూస్తున్న నేను యీ విశాల ప్రపంచంలోకి వచ్చాను. గత ఆరు సంవత్సరాలుగా సాగిన నా అన్వేషణకు సరియైన మార్గం లభ్యమైంది" అన్నాడు గౌతముడు.

క్షణంసేపు బింబిసారుడు సాలోచనగా వుండిపోయాడు.

"ఇది నాకూ ఆనందదాయకమే గౌతమా ! మన క్షత్రియుల్లో నీవు విలక్షణమూర్తిగా, యీ ప్రపంచానికే నూతన మార్గాన్ని చూపిన మార్గ దాతగా నీవు రూపొందినందుకు నేను గర్విస్తున్నాను. మీరూ, మీ పరివారంతో ఎప్పుడైనా రాజగృహకు వేంచేసినా నేను ధన్యుడినవుతాను. మీ విడిది కొరకు యీ వేణువనాన్ని మీకు సమర్పిస్తున్నాను. ఇక్కడ వున్నన్నాళ్లూ నా భిక్ష స్వీకరించి నన్ను ధన్యుని చేయండి" అన్నాడు బింబిసారుడు.

"బౌద్ధ భిక్షువుల పైన నీవు చూపిన గౌరవ, సాదరాభిమానాలకు నేను సంతోషిస్తున్నాను, చక్రవర్తీ" అన్నాడు గౌతముడు.

"మీరు నాకు బౌద్ధ దీక్ష ప్రసాదించండి, భగవాన్"

"అలాగే", అంటూ బింబిసారునికి గౌతమబుద్ధుడు బుద్ధ దీక్షను యిచ్చి, బౌద్ధ సంఘంలో చేర్చుకున్నాడు.

× × ×

బుద్ధుడు అనతికాలంలోనే బౌద్ధ సంఘాన్ని తీర్చిదిద్దాడు. తన ప్రవచనాల్లో, మానవ జీవితానికి సంబంధించిన అనేక అంశాల్ని విపులీకరిస్తూ, చిన్న చిన్న కథలతో జతచేసి శిష్యులకు చెప్పేవాడు.

"ఓ భిక్షువులారా ! ప్రతి వ్యక్తీ తన వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలి. ఇందుకు కొన్ని అడ్డంకులు వుంటాయి. వాటిల్లో ఒకటి అహంకారము. ఇది కేవలం అనుచితమైనది. నిష్ప్రయోజనకరమైనది. తదుపరి భ్రాంతి, భ్రమ, విషయ లోలత్వము అవసరమైన దానికంటే ఎక్కువగా, అనగా అతిగా వ్యక్తిగత విషయాలు, కోర్కెలపై భ్రాంతి పెంచుకొనడం వల్ల మనిషి వివేచనా శక్తిని కోల్పోతాడు. క్రోధము, మూర్ఖత్వము, దొంగతనం, మోసం, ఈర్ష్య, ఆత్మస్తుతి, పరనింద, దురాలోచనము మనిషిని పతనం చేస్తాయి. కనుక మానవుడు వీటిని వదిలివేయాలి. అష్టాంగ మార్గాన్ని అనుసరించండి. వివేకం వృద్ధి చెంది మనస్సు వికసిస్తుంది. మనశ్శాంతి కలుగుతుంది.

"ఓ భిక్షువులారా ! బుద్ధత్వం పొందుటకు ప్రతి వ్యక్తి సంసార బంధనాలను త్యజించి, సన్యాసి కానక్కరలేదు. ప్రవృత్తిని బట్టి, ఎలాంటి బంధనాలు లేని వ్యక్తి, తన జీవిత కాలమంతా తాత్విక జీవనం గడపదలచుకొన్న వ్యక్తి, సన్యసించి, బౌద్ధ భిక్షువుగా పరివర్తనం చెందవచ్చును. సంసారిక జీవనం సర్వధా వాంఛనీయమైనదే. అవశ్యకం కూడా. ఇది ప్రకృతి ధర్మం. పుట్టుక, బాల్యం, యౌవనం, వృద్ధాప్యం, మరణం, సంతానోత్పత్తి, సర్వ జంతు లక్షణం. కనుక దానిని విడిచిపెట్టి తాత్విక జీవనంలోకి రానవసరం లేదు. కుటుంబ జీవనం

గడుపుతూనే, సన్మార్గపూరితమైన బౌద్ధ ధర్మాన్ని ఆచరింపవచ్చును. వీరిని ఉపాసకులుగా పేర్కొందాం. కనుక అభిమానులు, ఉపాసకులు, భిక్షువులూ అందరూ బౌద్ధాన్ని అనుసరించ వచ్చును" అంటూ బుద్ధుడు ప్రజలకు బౌద్ధ ధర్మాన్ని అనుసరించాల్సిన విధి, విధానాల్ని రూపొందించి, విపులీకరించాడు.

"ఓ భిక్షువులారా ! సర్వ మానవ ప్రయోజనం కొరకు, సకల జనుల సమ్మోదము కొరకు, నిష్కల్మషమైన ప్రేమ భావంతో, లోక కళ్యాణం కొరకు బయలుదేరండి. ప్రపంచం విశాలమైనది. నేల నలుచెరగులా పర్యటించండి. మనసా, వాచా, కర్మణా, త్రికరణ శుద్ధితో మెలగండి. పవిత్రమైన జీవితాన్ని గడపండి. సర్వజన శ్రేయస్సుకు పాటుపడండి" అంటూ బుద్ధుడు తన సందేశాన్ని వినిపించాడు.

వర్షాకాలం నాలుగు నెలలు గడపడానికి బుద్ధుడు తన శిష్యులతో ఉరువేలారణ్యానికి ఏతెంచినాడు. ఈ మధ్యలో చాలామంది సన్యాసుల్ని మునుల్ని కలుసుకొని, బుద్ధుడు తన మాధ్యమిక మార్గాన్ని విశదీకరిస్తూ, వారిని బౌద్ధులుగా తీర్చిదిద్దాడు. ఆ విధంగా మారిన తొలి శిష్యులలో ఒకడు అగ్ని ఆరాధకుడైన బ్రాహ్మణ పురోహితుడైన కాశ్యపుడు. ఈయనే అటు తర్వాత మహా కాశ్యపుడిగా ప్రసిద్ధిచెంది బుద్ధుని తదుపరి బౌద్ధ సంఘానికి అధిపతి అయ్యాడు. కాశ్యపునితోపాటు ఆయన శిష్యులు అయిదు వందల మంది కూడా బౌద్ధ సంఘంలో చేరారు. అనంతరం కాశ్యపుని సోదరుల్లో ఒకడు నదీ కాశ్యపుడు, మరొక సోదరుడు గయా కాశ్యపుడు.

ఒకనాడు బుద్ధుడు గయ సమీపంలోని పర్వతంపై బుద్ధ ధర్మాన్ని ప్రవచిస్తూ యిలా అన్నాడు. "ప్రతి దానికీ ఒక కారణం వుంటుంది. కార్యం, కారణంలోనే దాగి వుంటుంది. కార్యం పుట్టడంతో కారణం నశిస్తుంది. ఏదీ శాశ్వతం కాదు. ఘటనా పరంపరగా యీ జగత్తు నడుస్తున్నది.

"ఓ భిక్షువులారా ! బహుజనహితం కొరకు, బహుజనుల సుఖం కొరకు మీరు పాటుపడండి. పరోపకారమే పరమ ధర్మంగా భావించండి. అహింసా మార్గాన్ని విడనాడకండి. సంఘ శ్రేయస్సుకు శ్రమపడండి" అని ఉద్బోధించాడు.

బుద్ధుని ప్రవచనాలు శిష్యులందరినీ ఆకట్టుకున్నాయి. ఆ సభలోనే నదీ కాశ్యపుడు, గయా కాశ్యపుడు యిరువురు కూడా చెరొక మూడు వందల మంది అనుచరులతో బుద్ధ దీక్ష తీసుకొని, బౌద్ధ సంఘంలో చేరారు. వీరిరువురూ మహా కాశ్యపుని సోదరులే.

నానాటికీ బౌద్ధ సంఘం విస్తరిస్తున్నది. బుద్ధుని కీర్తికాంతులు సుదూర ప్రాంతాలకు వెలుగుల్ని ప్రసాదిస్తున్నాయి.

ఉరువేలారణ్యంలో బుద్ధుడు శిష్య సమేతంగా వర్షాకాలాన్ని గడిపినాడు. ఈ సమయంలో యితర ప్రాంతాల నుంచి ఎందరో వచ్చి, బుద్ధుని ఆశీస్సులు పొంది, బుద్ధుని శిష్యులైనారు. కొందరు తమ ప్రాంతాలకు వచ్చి, బుద్ధ సందేశము నివ్వవలసిందిగా వేడుకున్నారు. బుద్ధుని చిరునవ్వు, సరళమైన వాక్కు, ప్రసన్న వదనం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి.

"శాక్యముని ఉరువేలారణ్యంలో విడిది చేసాడట. మనం వెళ్లి ఆయన దర్శనం చేసుకుందాం" అంటూ పరిసర ప్రాంతాల జనం తండోపతండాలుగా వచ్చి, బుద్ధుని దర్శించి వెళుతున్నారు. మనిషిలోని బలహీనతల్నీ, చెడు కోరికల్ని విడనాడాలనీ, భ్రాంతి పూర్వకమైన ఆశల్ని కోరరాదనీ, యితరులకు కష్టం కలిగించరాదనీ, సాటివారిని ప్రేమించాలనీ, సమాజంలోని ప్రతి ఒక్కరూ సోదర, సౌభ్రాతృత్వాలతో మెలగాలనీ, బుద్ధుడు ప్రతి సభలోనూ నొక్కిచెప్పడం, అందర్నీ ఆకట్టుకొని, బుద్ధ ప్రవచనాల పట్ల గౌరవం, పూజ్య భావం నెలకొంటున్నాయి.

"యజ్ఞ యాగాదులు వ్యర్థం. తపస్సు నిరర్థకం. స్వర్గం, నరకాలంటూ ఏమీ లేవు. అది వున్న దాఖలాలు లేవు. ఏ వ్యక్తి అయినా స్వర్గాన్ని ఆశించి, తుదకు స్వర్గ లోక ప్రాప్తి పొందాడనుకుందాం. అది ఆ వ్యక్తికి మాత్రమే సంబంధించిన విషయం కాదా ? తన ప్రయోజనం కొరకు కృషి చేయడం గొప్ప కాదు. యితరుల ప్రయోజనాల కోసం మనిషి పాటుపడాలి. తన స్వార్థం కోసం చేసే ఎంత గొప్ప కార్యమైనా, దానికి తక్కువ పరిధి మాత్రమే కలుగుతుంది. పరుల శ్రేయస్సు కొరకు కృషి చేసే ఒక చిన్న కార్యానికి ఆకాశమంత విశాల రూపం ఏర్పడుతుంది. కనుక ప్రతి ఒక్కరూ తన శ్రేయస్సుతోపాటు పరుల శ్రేయస్సు కొరకు పాటుపడాలి" అంటూ బుద్ధుడు ప్రబోధించాడు.

ఒకరోజున సత్యాన్వేషణ చేస్తున్న సారిపుత్రుడూ, మొగ్గలాయనుడూ బౌద్ధ సంఘంలో చేరడం జరిగింది. బుద్ధుని శిష్యులు కావడానికి ముందు ఆ యిరువురూ సన్యసించి, దేశాటనం చేస్తూ, తమకు సమ్మతమైన మతం కొరకు అన్వేషణ ప్రారంభించారు. వాళ్లిద్దరూ బాల్య మిత్రులు, సంసారం వదిలి పరివ్రాజకులై సత్యాన్వేషణ చేస్తున్నవారు. వారిలో ఎవరికి ముందు జ్ఞానోదయం కలిగినా, ఆ జ్ఞానాన్ని రెండవవారికి తెలియజేయాలనే ఒప్పందం చేసుకున్నారు.

ఒకరోజున సారిపుత్రుడు, దేశాటనం చేస్తూ, బుద్ధుని తొలి అయిదుగురి శిష్యుల్లో ఒకడైన అస్సాజీని కలుసుకున్నాడు. ఆయనలోని ఉదాత్తతను గమనించి సారిపుత్రుడు ముగ్ధుడై "మీ గురువు ఎవరు ? అస్సాజీ ! ఎవరి ఉపదేశాలను నీవు అనుసరిస్తున్నావు ?" అని అడిగాడు.

"శాక్యముని బుద్ధుని బోధనల్ని నేను అనుసరిస్తున్నాను" అన్నాడు అస్సాజీ.

"ఆయన బోధనల సారాంశం ఏమిటి ?"

అస్సాజీ సవివరంగా సారిపుత్రునికి బుద్ధుని ధర్మపథాన్ని వివరించాడు.

"నేను అన్వేషిస్తున్న సత్యం కూడా సరిగ్గా యిదే" అన్నాడు సారిపుత్రుడు. వెంటనే వెళ్లి తన మిత్రుడైన మొగ్గలాయనకు ఆ సత్యాన్ని బోధించాడు. ఇద్దరూ బుద్ధ భగవానున్ని సందర్శించి బౌద్ధ సంఘంలో చేరారు. ఆ విధంగా నానాటికీ బౌద్ధ సంఘం విస్తరిస్తున్నది.

## కపిలవస్తు సందర్శన

బుద్ధుని జ్ఞానోదయం జరిగిన అనతికాలంలోనే ఆయన కీర్తి ప్రతిష్టలు నలుదెసలా వ్యాపించాయి. ప్రతిచోటా బుద్ధుని బోధనల్ని గురించి చర్చించుకోవడం జరుగుతూవుంది. బుద్ధుని ప్రఖ్యాతి తండ్రి శుద్ధోదనుని దాకా ప్రాకింది. తన కుమారుడు సన్యసించడం శుద్ధోదనున్ని బాధించింది. బుద్ధుడు యువరాజుగా, శుద్ధోదనుని తదుపరి రాజుగా శాక్య రాజ్యాల్ని పరిపాలించాలన్నదే తండ్రి అభిమతం. కానీ అందుకు విరుద్ధంగా జరిగింది. అయినప్పటికీ బుద్ధుడు గొప్ప ప్రవక్తగా ప్రజలకు ఆరాధ్యుడైనాడని విని శుద్ధోదనుడు సంతసించాడు. ఒకసారి ఆయన తిరిగి కపిలవస్తు వచ్చి, కొన్నాళ్ళు యిక్కడ గడిపితే బావుంటుందని శుద్ధోదనుడు భావించాడు.

ఉరుకీలారణ్యంలో బుద్ధుడు విడిదిచేసి వున్నాడని శుద్ధోదనుడు తెలుసుకున్నాడు. ఆయన్ను కపిలవస్తు ఆహ్వానించడానికి వేయిమంది సైనికులతో, మంత్రులతో ఒకన్ని పంపించాడు.

అప్పుడు బుద్ధుడు సభలో ధర్మ ప్రబోధం చేస్తున్నారు. పెద్ద జన సమూహం ఆయన చుట్టూ పరివేష్టితం అయివుంది. శుద్ధోదనుడు పంపిన పరివారం కూడా ఆ గుంపులో కలిసి, బుద్ధుని బోధనల్ని వినసాగారు. ఆయన ఉపదేశానికి ముగ్ధులై, శుద్ధోదనుడు పంపిన పరివారం కూడా సన్యసించి బౌద్ధ దీక్ష తీసుకొని, వచ్చిన పనిని వదిలివేసి, బిక్షు సంఘంలో చేరిపోయారు.

ఈ వార్త తెలుసుకొన్న శుద్ధోదనుడు, బుద్ధుని బాల్య స్నేహితుడైన "కలుదాయిన్" ను బుద్ధుని వద్దకు పంపాడు. బుద్ధుని బోధనల్ని విని కలుదాయిన్ కూడా పరివ్రాజకుడైనాడు. ఒకరోజున కలుదాయిన్ మెల్లగా బుద్ధుని సమీపించి, "భగవాన్ ! ఒకసారి తమరు కపిలవస్తును సందర్శించకూడదా ? ప్రపంచమంతా మీ ఉపదేశాన్ని విని తరిస్తున్నప్పుడు, మీ తండ్రి, పినతల్లి, భార్య యశోధరా మిమ్మల్ని తిరిగి చూడాలనీ, మీ బోధనల్ని వినాలనీ తహతహలాడుతున్నారు. మిమ్మల్ని ఆహ్వానించేందుకే రాజు శుద్ధోదనుడు ప్రత్యేకంగా నన్నిక్కడికి పంపించారు" అని విన్నవించాడు.

కలుదాయిన్ విన్నపం బుద్ధున్ని అంగీకరింపజేసింది. తాను వెనుక వదిలివచ్చిన తన సంబంధ బాంధవ్యాలు, పుట్టి పెరిగిన ప్రాంతాలూ గుర్తుకు వచ్చాయి. తాను కనుగొన్న ధర్మపథాన్ని తనవారికి కూడా వినిపించాలని ఉద్దేశపడ్డాడు. ఆయన రాకను గూర్చి ముందుగా శుద్ధోదనునికి తెలియజేయడానికి ముందుగా "కలుదాయిన్" కపిలవస్తు వెళ్లాడు.

కుమారునికి స్వాగతం చెప్పేందుకు శుద్ధోదనుడు తన మంత్రి, సామంతులతో ఎదురు వచ్చాడు. బుద్ధున్ని చూడగానే ఆయన తేజోవంతమైన ముఖవర్చస్సు, గంభీరత్వమూ శుద్ధోదనున్ని ఆకట్టుకున్నాయి. శుద్ధోదనుడు ఆనందభరితుడై బుద్ధుని కౌగలించుకొని "ఇక నాకు దుఃఖం అనేది వుండదు కుమారా ! సర్వమానవకోటినీ ఉద్ధరించే ధర్మపథాన్ని కనుగొన్నావు. అది చాలు - సంఘ శ్రేయస్సుకు నువు పాటుపడుతున్నావు. మన శాక్య వంశం ధన్యమైంది" అని అన్నాడు.



ఇల్లూ, వాకిలీ, భవబంధాల్ని తెంచుకొని, పరివ్రాజకత్వం స్వీకరించినందున బుద్ధుడు, ఆయన పరివారమూ రాజ ప్రాసాదంలో విడిదిచేయలేదు. వారి కోసం శుద్ధోదనుడు నగరానికి సమీపంలో న్యగ్రోధ వనం (మర్రి వనం) లో వసతి ఏర్పాట్లు చేసాడు.

బుద్ధున్ని చూడడానికి కపిలవస్తు పుర ప్రజలు తండోప తండాలుగా, ఆయన విడిది చేసిన న్యగ్రోధవనానికి రాసాగారు. బుద్ధుని బోధనల్ని వారు తన్మయత్వంతో విన్నారు. తమ యువరాజు గొప్ప ప్రవక్త అయినందులకు, సర్వమానవాళిని తరింపజేసే ధర్మాన్ని కనుగొన్నందుకూ ఆనందంతో పరవశించారు. బుద్ధుని ఉపదేశసారం ప్రజలందర్నీ తరింపజేసింది.

శాక్య సామంతులు తొలుత తాము బుద్ధుని దర్శించడానికి వచ్చేందుకు అంగీకరించలేదు. ఆయన సన్యాసత్వం స్వీకరించి, తమ జాతికే అప్రతిష్ట తెచ్చాడని ఆగ్రహించారు. కానీ ప్రజలనోట బుద్ధుని కీర్తిని విని, ఒకసారి ఆయన ఉపదేశాన్ని తెలుసుకుందామని వచ్చిన సామంతులు ఆనందంతో పరివ్రాజకులై, బుద్ధుని అనుయాయులుగా మారిపోయారు.

మరుసటి ఉదయం పరివ్రాజక ఆచారం ప్రకారం బుద్ధుడు చేతిలో భిక్షాపాత్ర పట్టుకొని, శిష్యులతో నగరంలోకి భిక్షాటనకు బయలుదేరాడు. ఆ వార్త విని శుద్ధోదనుడు

పరుగు పరుగున అక్కడికి వచ్చి "కపిలవస్తు పురవీథుల్లో నా బిడ్డ భిక్షమెత్తు కోవడమా ?" అంటూ వ్యాకులపడుతూ "కుమారా ! నన్నిలా అవమానపరుస్తున్నావా ? తండ్రీ ! నీకు, నీ పరివారానికీ సరిపడినంత ఆహారాన్ని నేను యిక్కడికే పంపుతాను. భిక్షాటనం చేయవద్దు' అని కోరాడు.



"ఇది పరివ్రాజకుల ధర్మం" అన్నాడు బుద్ధుడు.

"ఇదెక్కడి ధర్మం, నాయనా! రాజకుటుంబంలో పుట్టావు" అన్నాడు శుద్ధోదనుడు.

"కాదు. నేను పరివ్రాజకున్ని. పరివ్రాజకులకు ఒక వంశం అంటూ వుండదు" అన్నాడు బుద్ధుడు.

"కానీ, నీవు కపిలవస్తులో వున్నంతవరకూ, భిక్షాటనం చేయవద్దు. న్యగ్రోధ వనానికే మీ పరివారానికి భిక్ష వస్తుంది" అంటూ బుద్ధున్ని, ఆయన పరివారాన్నీ శుద్ధోదనుడు రాజ ప్రాసాదానికి కొనిపోయాడు. రాజకుటుంబంలోని వారంతా బయటకువచ్చి బుద్ధునికి స్వాగతం చెప్పారు. పినతల్లి ప్రజాపతి గౌతమి, ఇతర అంతఃపుర స్త్రీలూ అంతా వచ్చారు. యశోధర మాత్రం బయటకు రాలేదు. "ఏమైనా అర్హత నాలో మిగిలి వుంటే నన్ను చూడ్డానికి ఆయనే వస్తారు" అని అన్నది. బయటకు రావడానికి నిరాకరించింది.

శుద్ధోదనుడు యీ విషయం గ్రహించి, బుద్ధునితో యిలా అన్నాడు. "నీవు లేని యీ ఏడేళ్ల యశోధరా భిక్షుకిగానే జీవించింది. జుట్టు తీసివేసి, కాషాయాల చీరలనే ధరిస్తూ వుంది. సన్యాసినిగానే జీవితాన్ని గడుపుతున్నది" అని వివరించాడు.

బుద్ధుడు, యశోధర మందిరంలోకి వెళ్లాడు. ఆయన పాదం మీద పడి, యశోధర వెక్కి వెక్కి ఏడ్చింది. తన కన్నీళ్లతో బుద్ధుని పాదాల్ని కడిగింది. బుద్ధుడు మందస్మిత వదనంతో యశోధరను ఆశీర్వదించాడు.

బుద్ధుని కుమారుడు రాహులుడు అప్పటికి ఏడేళ్ల పసివాడు. ఆ బిడ్డకు బుద్ధుడు తన తండ్రి అని తెలీదు. యశోధర సకల రాజ లాంఛనాలతో రాహులున్ని ఆలంకరించి, తనకు వారసత్వం అనుగ్రహించమని కొడుకుని బుద్ధునికి వద్దకు పంపింది. రాహులుడు వచ్చి బుద్ధున్ని ఆ విధంగా అడిగాడు. అప్పుడు బుద్ధుడు తన ప్రియ శిష్యుడైన సారిపుత్రుడ్ని పిలిచి

"వీణ్ణి సంఘంలో చేర్చుకోండి'' అని అన్నాడు. శుద్ధోదనుడు వెంటనే అందుకు అడ్డుచెప్పి "యుక్తాయుక్త జ్ఞానంలేని పసిపిల్లలకు సన్యాసత్వం యివ్వకూడదు. వారి తల్లితండ్రులుగానీ, సంరక్షకులుగానీ కోరితేనే దీక్ష యివ్వాలి. ఆ విధంగా నాకు మాట యివ్వు'' అని బుద్ధుణ్ని అడిగాడు.

బుద్ధుడు "అలాగే'' అని అన్నాడు.

ఇంతలో వర్షాకాలము కూడా గడిచిపోయింది. ప్రకృతి అంతయు పచ్చని పైరులతో కలకలలాడుతోంది. వృక్షములన్నీ పూలతో నిండియున్నవి. మార్గములన్నీ ప్రయాణానికి అనుకూలంగా వున్నాయి.

బుద్ధుడు కపిలవస్తులో వున్న వార్త, చుట్టుప్రక్కల దేశాలైన కోలియ, భృగు, మల్ల దేశాలకు ప్రాకింది. ఆయా దేశాల నుండి అసంఖ్యాకంగా ప్రజలు, రాజులు, సామంతులు వచ్చి బుద్ధుని దర్శించుకున్నారు. బుద్ధుని పరివ్రాజకత్వం వారిని ఆశ్చర్యపరచడమే గాకుండా, బుద్ధుని మేధాశక్తికి, ఆయన అనర్గళమైన వాగ్ధోరణికి మిక్కిలి ఆనందించారు.

## బుద్ధుని ఉపదేశం

"ప్రియతములారా ! ప్రజలందరూ సోదరుల్లా మెలగండి. అనురాగం, పవిత్రత యందు, సత్యమును తెలిసికొనుటకై సలుపు ఉత్సుకత యందు ఐక్యంగా వుండండి. సానుభూతి, వాత్సల్యము, సత్యమునందు ఆసక్తి, కరుణ, శుభ్రత, ఉదాత్తమైన భావన, నిజమైన ధర్మం యొక్క విశిష్ట లక్షణములు. వీటిని మీరు అలవర్చుకోండి. ఈ లోకమున ద్వేషముచే, ద్వేషము నశించదు. ప్రేమతోడనే ద్వేషము నశింపగలదు. అంతేకాదు, నా సిద్ధాంతము నిర్మలమైనది. విశాల భావాన్ని కలిగిస్తుంది. కులీనులు, కుల భ్రష్టులనే తేడా చూపరాదు. ధనవంతులు, దరిద్రులనే భేద భావం చూపరాదు. మానవులంతా సమానమే. సృష్టిలో హెచ్చు తగ్గులు లేవు. సకల వస్తువులను విచక్షణ చేయకుండా, పరిశుభ్రం చేయు నీరు వంటిది నా సిద్ధాంతం.''

"కావున ప్రజలారా ! మీలో మీరు కలహించుకోరాదు. ప్రజలందరూ సోదర, సౌభ్రాతృత్వాలతో మెలగండి'' అని బుద్ధుడు బోధించాడు. బుద్ధుని ఉపదేశం కపిలవస్తులోని న్యగ్రోధ వనంలో జరిగింది. అచ్చట విశాలమైన ప్రాంతంలో, నేల మీద కంబళ్లు పరచబడి, రాజులు, సామంతులు, ధనికులు, దరిద్రులు, కులీనులు, తక్కువ కులం వారు అనే భేద భావం చూడకుండా, బుద్ధుని శిష్యులు అందర్నీ ఒకేచోట, నేల మీద కూర్చుండబెట్టారు. రాజా శుద్ధోదనుని సైతం బుద్ధుడు పరివారం, ప్రజలు, శిష్యులతో పాటు నేల మీద కూర్చుంబెట్టి, తన ఉపదేశాన్ని కొనసాగించాడు.

మానవేతిహాసంలో ఆనాటికి యీ సర్వసమానత్వ భావాన్ని ఎవరూ చూపియుండలేదు. రామాయణ కాలంలో "శూద్రులు తపస్సు చేయరాదు" అనే తేడా వుండేది. శంబుక వధ అందుకు సాక్ష్యం. వేద కాలంలో కూడా శిష్యులు యాజ్ఞవల్క్యుడు, విశ్వామిత్రుడు, వశిష్టుడు వంటి రుషుల వద్ద విద్య నభ్యసించడానికి వెళ్లినప్పుడు "నీ కులమేది ?" అని ప్రశ్నించి తెలుసుకొని కులీనులు, ఉన్నత కులం వారైతేనే, అనగా బ్రాహ్మణ క్షత్రియులైతేనే విద్యను బోధించేవారు.

పరశురాముని వద్దకు విద్యాభ్యాసానికి వెళ్లిన కర్ణుడు తన కులం దాచుకొని, తాను క్షత్రియుడనని అబద్ధమాడి, అస్త్ర విద్య నేర్చుకొనవలసి వచ్చింది. "కర్ణుడు క్షత్రియుడు కాడు" అని బయటపడిన తరువాత ఆతనికి పరశురాముడు శాపం యివ్వడం గమనార్హం.

"మనుస్మృతి కాలంలో శూద్రులు, స్త్రీలు విద్యను నేర్వరాదు" అనే కట్టడి వుండేది. వర్ణ వ్యవస్థ ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియ మరికొంత కాలానికి వైశ్య కులాలు మాత్రమే అగ్ర కులాలుగా చెలామణీ అవుతూ వుండేవి.

ఇట్టి పరిస్థితులలో బుద్ధుడు తన కాలంలో, తాను తొలిసారిగా కులాల మధ్య, వర్ణాల మధ్య వున్న అంతరాన్ని అడ్డుగోడల్ని పగలగొట్టాడు. కులాల మధ్య వున్న భేద భావాన్ని చెరపివేశాడు. మానవులంతా ఒకటే అనే సర్వ సమానత్వం అనే నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇదే బౌద్ధం యొక్క విశిష్టత.

అందువల్లనే కపిలవస్తులో శాక్య వంశానికి చెందిన సుప్రసిద్ధ కుటుంబంలోని యువకులనేకులతోపాటు, మంగలి కులానికి చెందిన ఉపాలికి కూడా బుద్ధుడు దీక్షను యిచ్చాడు. సామంతులైన అనిరుద్ధుడు, ఛద్దియుడు, కింపులుడు మరియు ఆనందుడు బుద్ధుని జ్ఞాతి అయిన దేవదత్తుడితో సమానంగా, ఉపాలికి సైతం దీక్షనిచ్చి బుద్ధసంఘంలో మానవులందరూ సమానులే అనే విశాల దృక్పథాన్ని చూపాడు.

శాక్య యువకులు, సామంతులు దీక్ష గైకొను సమయంలో సమస్త ఆభరణాల్ని, ఆయుధాల్ని, చీని చీనాంబరాల్ని తీసివేసి, అక్కడ ప్రక్కనే నిలబడియున్న మంగలి ఉపాలికి దానంగా యివ్వబోయారు. ఉపాలి వాటిని తీసుకొనుటకు నిరాకరించాడు. తాను సైతం బుద్ధ దీక్ష తీసుకొనదలిచానని వినయంగా సమాధానం చెప్పాడు. ఈ సంఘటనను బుద్ధుడు జాగ్రత్తగా గమనిస్తూ "శాక్య సామంతులకు యింకా అహంకారం నశించలేదే" అనుకొని, ముందుగా మంగలి ఉపాలికే దీక్షనిచ్చి, తరువాతనే శాక్యులకు దీక్షను బుద్ధుడు ప్రసాదించాడు. యిక్కడ బుద్ధ సంఘంలో ఒక ఆచారం వుంది. తొలుత దీక్ష తీసుకొన్న వ్యక్తికి, తదుపరి దీక్ష తీసుకోబోయే వారందరూ వందన మాచరించాలనే నియమం వుంది. ఆ విధంగా శాక్యుల ఆధిక్యతను తగ్గించివేసి, మంగలి ఉపాలి న్యూనతను పోగొట్టాడు. బుద్ధుడు సమ ధర్మవర్తనుడు. సమతా సిద్ధాంత ప్రతిపాదకుడు.

ఒక రోజున బుద్ధుడు ధర్మోపదేశం గావించి, ముగించిన తదుపరి, బుద్ధునికి ప్రియశిష్యుడైన ఆనందుడు "భంతే ! అంతఃపుర స్త్రీలతోపాటు అనేకమంది స్త్రీలు బుద్ధ దీక్ష తీసుకోవాలని ఉవిళ్లూరుతున్నారు. వారిలో మీ పినతల్లి ప్రజాపతి గౌతమి కూడా వుంది. తల్లి మరణించిన రోజు నుంచే మీకు చనుబాలిచ్చి, పెంచి పెద్ద చేసిన పినతల్లి ప్రజాపతి గౌతమి, తదితరులతో బుద్ధ దీక్ష యివ్వవలసిందిగా కోరుతున్నాను" అని అన్నాడు.

"ఆనందా ! స్త్రీలు కూడా బుద్ధ ధర్మాన్ని అనుసరించవచ్చును. అందుకు అభ్యంతరం ఏముంది, కానీ దీక్ష తీసుకోవడంలోనూ అభ్యంతరం వుండదు. భిక్షు సంఘంలో చేరడం వాంఛనీయం కాదేమో ! భిక్షువు, భిక్షుకి కలిసి సంఘంలో వుండరాదు. ఎంతో నిగ్రహం, సంయమనం, ఏకాగ్ర దృష్టి వున్నప్పుడే, తాము అవలంభించిన ధర్మ ప్రచారానికి కళంకం లేకుండా వుండగలదు. సరే ! నీవు కోరినట్లే స్త్రీలకు కూడా యికముందు దీక్ష యివ్వవచ్చును. అయితే నీరు పొర్లిపోకుండా దానికి ఆనకట్ట నిర్మించునట్లు, భిక్షుకిలకు అష్ట విధులను విధిస్తున్నాను" అన్నాడు బుద్ధుడు.

## శిష్య పరంపర

బుద్ధుని ఉపదేశాలు లోకమంతటా పరివ్యాప్తం అయ్యాయి. ఆ రోజుల్లో కోసల రాజ్యంలో కోటీశ్వరుడని పేరొందిన 'అనంత పిండకుడు' అను వ్యక్తి వుండేవాడు. ఈయన ధనిక వర్తకుడు. అతని అసలు పేరు సుదత్తుడు. అతడు చేసిన దాన ధర్మాల వల్ల "అనంత పిండకుడు" అనే బిరుదు వచ్చింది.

బుద్ధుడు ఒకసారి రాజ గృహంలో విడిదిచేసినప్పుడు, ఏదో వ్యాపార పని నిమిత్తం సుదత్తుడు కూడా రాజగృహంలోని, తన చెల్లెలి యింటికి వచ్చాడు. తన సోదరి యింట్లో బస చేసాడు. ఎవరి రాకకోసమో, వాళ్ళ బ్రహ్మాండమైన స్వాగత సన్నాహాలు, విందు ఏర్పాట్లు చేస్తున్నారు. బహుశా మగధ రాజు బింబిసారుని కోసం తన బావగారు ఆ ఏర్పాట్లు చేస్తున్నాడేమోనని సుదత్తుడు భావించాడు.

"ఎవరి కోసం ఈ విందు" అని సుదత్తుడు తన బావగారిని అడిగాడు" శిష్యులతో సహా బుద్ధ భగవానుడు మన యింటికి వస్తున్నాడు" అని ఆయన బావగారు బదులు చెప్పాడు.

"ఇప్పుడు ఆయన ఎక్కడ వున్నారు" ?

"సీతావనందాకా వచ్చి వుంటారు" అన్నాడు బావగారు.

సీతావనం అక్కడికి కొద్దిదూరంలోనే వుంది.

అనంత పిండకుడు వెంటనే వెళ్లి బుద్ధున్ని సందర్శించాలనుకున్నాడు. కానీ ఆయన బావగారు సుదత్తుని వారించాడు.

"ఇప్పుడు చాలా పొద్దుపోయింది. తెల్లవారుజామునే లేచి వెళ్లవచ్చును" అని అన్నాడు.

అనంత పిండకునికి ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. వేకువకుముందే లేచి, సీతావనం చేరుకున్నాడు. బుద్ధుడు ప్రేమగా అతన్ని సంభాలించి, ధర్మ పథాన్ని అవలంభించమని బోధించాడు. అనంత పిండకుడు ఆ బోధనల్ని శ్రద్ధగా విన్నాడు. "సంసార బాధ్యతలన్నీ వదిలి సన్యసించాలని సుదత్తుడు భావించాడు. నన్ను కూడా పరివ్రాజకున్నిగా చేర్చుకోండి, భగవాన్" అని అన్నాడు.

"సంసారిగా, కుటుంబ జీవనం గడుపుతూనే వుండవచ్చు గదా !" అని బుద్ధుడు సూచిస్తూ "సంపాదన, కోరికల మీద ఎక్కువ మక్కువ చూపకూడదు. పరిమితమైన కోర్కెలతో, అవసరమైన విధంగా, తృప్తితో జీవనం గడపాలి. అధిక ఆదాయాన్ని పదిమంది సుఖం కోసం వెచ్చించాలి. సంసారిగా వుంటూనే, సంఘ శ్రేయస్సుకు పాటుపడుతూ, ధర్మపథాన్ని అనుసరించవచ్చును" అని వివరించాడు.

"నా మీద ఆధారపడి జీవిస్తున్న వారెందరో వున్నమాట నిజమే, భగవాన్ !"

"అలాంటప్పుడు నీవు సన్యసించడం పొరపాటు కదా ! ఉత్తమ జీవితాన్ని గడపడానికి సన్యసించాల్సిన అవసరం లేదు. జీవితంలో ధర్మ మార్గాన్ని అనుసరిస్తూ జీవించడం, అంతకంటే ఉత్తమం మరొకటి లేదు" అని బుద్ధుడు తన సందేశాన్ని వినిపించాడు.

బుద్ధుని బోధ అనంత పిండకునికి ఆనందాన్ని కలిగించాయి.

"నా కోరికను ఒకదాన్ని మీరు మన్నించాలి. భగవాన్ ! బౌద్ధ భిక్షువులకు శ్రావస్తిలో ఒక వసతి గృహాన్ని కట్టిస్తాను" అన్నాడు.

బుద్ధుడు అందుకు అంగీకరించాడు.

బుద్ధుని ప్రధాన శిష్యులలో ఒకడైన సారిపుత్రున్ని వెంటబెట్టుకొని సుదత్తుడు బౌద్ధ విహారానికి తగిన స్థలం కోసం అన్వేషించసాగాడు. విహారానికీ, ధ్యానమునకు అవసరమైన చైత్యమునకూ కలిపి తగినంత స్థలం దొరికి నగరానికి సమీపంలో కనిపించింది. ఆ స్థలం జేత రాకుమారునికి చెందినది. అతడు దాన్ని విక్రయించడానికి అంగీకరించలేదు. అనంత పిండకుడు ఆ స్థలానికి ఎంత మూల్యమైనా చెల్లిస్తానని అన్నాడు.

ఎలాగైనా సుదత్తుని వదిలించుకోవాలని జేత రాకుమారుడు తలంచాడు. "ఆ స్థలాన్ని నీవు బంగారు నాణేలతో నింపగలిగితే, ఆ స్థలం నీకు దక్కుతుంది" అని అన్నాడు. సుదత్తుడు అందుకు అంగీకరించాడు. వెనువెంటనే బంగారు నాణేలను సార్థ వాహనాల మీద చేరవేయించి, ఆ స్థలాన్ని బంగారు నాణేలతో నింపివేసాడు. అతని దాన నిరతికి జేత రాకుమారుడు ఆశ్చర్యపోయాడు. బౌద్ధ విహారం నిమిత్తం ఆ స్థలాన్ని సుదత్తుడు

వినియోగిస్తున్నందున, జేత రాకుమారుడు ఆ బంగారు నాణేల్లో సగం మాత్రమే స్వీకరించాడు.

ఆ విధంగా శ్రావస్తిలో సుదత్తుడు ఎంతో విశాలమైన బౌద్ధ విహారాన్ని నిర్మింపజేసాడు. అలా నిర్మింపబడిన ఆ విహారంలో బుద్ధుడు అనేకమార్లు ధర్మ మార్గాన్ని బోధించాడు.

## ప్రసేనజిత్తు రాక

ఒకసారి బుద్ధుడు విహారంలో విడిదిచేసి వుండగా ప్రసేనజిత్తు మహారాజు బుద్ధుని సందర్శించాడు. బౌద్ధ ధర్మాన్ని బుద్ధుడు ఎంతో వివరంగా ప్రసేనజిత్తుకు బోధించాడు. అంతేగాకుండా రాజరిక ధర్మాన్ని కూడా బుద్ధుడు రాజుకు తెలియజెప్పాడు. "ప్రజల్ని కన్నబిడ్డల్లా చూడాలనీ, తండ్రి తన బిడ్డలపై చూపే వాత్సల్యాన్ని రాజు ప్రజల మీద చూపాలనీ" అన్నాడు. పేదవారినీ, కష్టాల్లో వున్నవారిని ఆదుకోవాలని చెప్పాడు.

ప్రసేనజిత్తు ఎన్నో విలువైన కానుకల్ని బౌద్ధ సంఘానికి వితరణ గావించి, బుద్ధుని వద్ద సెలవు తీసుకొనిపోయాడు. ప్రసేనజిత్తు రాణులందరూ బౌద్ధ ధర్మాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో అవలంభించేవారు. అప్పట్లో రాజులు తమ రాచకార్యాల్లో, యుద్ధాల్లో మునిగి తేలుతున్నప్పటికీ, అంతఃపుర స్త్రీలు బౌద్ధ ధర్మాన్ని పాటిస్తూ, అహింసాయుతంగా జీవనాన్ని గడిపేవాడు.

బుద్ధ ధర్మం రాజకుటుంబాలకీ, సామాన్య తరగతికీ సైతం సమాన స్థాయిలో అందుబాటులో వుండేది. సంఘంలో అట్టడుగు వర్గాల వారికీ, అంటరానితనానికీ బౌద్ధ ధర్మాన్ని చేరువుగా వుంచగలిగాడు. ఆనాటి మతాలన్నింటి కంటే, విశిష్టమైన ధర్మంగా బుద్ధ ధర్మం పరిగణింపబడింది.

## ఛండాలిక

బౌద్ధ యుగంలో అనర్ఘరత్నంలాంటి సంఘటన ఒకటి బుద్ధుని కాలంలోనే జరిగింది. యిలాంటి ఉదాత్త సంఘటనలెన్నో బుద్ధుని కాలంలో జరుగుతూ సంఘ ప్రయోజనాని కెంతగానో వుపయోగపడినవి.

ఒకనాడు బుద్ధునికి అత్యంత ప్రియమైన శిష్యుడైన ఆనందుడు సమీపంలోని పట్టణానికి వెళ్లి, తన కార్యం నెరవేర్చుకొని, సంఘారామానికి నడిచి వస్తుండగా, అతనికి విపరీతంగా దాహం వేసింది.

ఆ దారికి సమీపంలోనే ఒక బావి దగ్గర ఒక స్త్రీ నీటిని తోడుకొని కడవలను నింపుకొనడం ఆనందుని కంటబడింది. వెంటనే ఆనందుడు బావి దగ్గరకు వెళ్లి "కాసిన దాహానికి మంచినీళ్లు యివ్వు, చెల్లీ" అని అడిగాడు.

బావి చెంతనున్న స్త్రీ ఆశ్చర్యంగా ఆనందుని వైపు చూస్తూ "నేను అస్పృశ్యురాలిని, నా చేతి నీళ్లు మీరు త్రాగకూడదు గదా" అని అన్నది.

"నీ కులాన్ని గురించి నేను అడగలేదు. నాకు దప్పికకు మంచినీరు అడిగాను. మంచి నీటికి ఏ కులమూ లేదు. మనుషుల మధ్య కులం అనేది వుండరాదు. మాకు అందరూ సమానమే" అని అన్నాడు ఆనందుడు.

అస్పృశ్యురాలైన ఆ స్త్రీ ఆశ్చర్యపోతూ, తమాయించుకొని, సంతోషంతో, ఆనందునికి మంచినీరు అందించింది. ఆనందుడు ఆ నీటిని త్రాగి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ఆ ఛండాలిక తన జీవితంలో ఏనాడూ జరగని ఒక ఉదాత్త సంఘటనగా దీన్ని తన జీవితాంతమూ గుర్తుపెట్టుకున్నది.

బౌద్ధ ధర్మం కులాల్ని, వర్ణాల్ని నిరాకరిస్తుంది.

స్త్రీత్వాన్ని గురించి బౌద్ధ ధర్మం ఉదాత్త భావాలతో వుండేది. బుద్ధుడు స్త్రీలను గురించి, వారి పట్ల పురుషులెవరైనా, భిక్షువులు, ప్రజలు కూడా మెలగవలసిన పద్ధతిని చాలా విపులంగా వివరించాడు.

"వృద్ధురాలైన స్త్రీని నీ తల్లిగానూ, యువతిని నీ సోదరిగానూ, బాలికను నీ కుమార్తెగానూ పరిగణింపవలసిందిగా" బుద్ధుడు బోధించాడు. బుద్ధుడు వర్ణ వ్యవస్థని తీవ్రంగా నిరసించాడు. కుల వ్యవస్థను ఖండించాడు. సమ ధర్మంగా బుద్ధ ధర్మం విలసిల్లింది. ఆనాటి సమాజంలో పాదుకుపోయిన అంటరానితనాన్ని బుద్ధుడు కూకటి వ్రేళ్లతో పెకలించివేసాడు. సామాన్యుల్నీ, దరిద్రుల్నీ, అంటరానివాళ్లనీ, దరిచేర్చుకున్నాడు. వారి జీవితాల్లో వెలుగుల్ని నింపాడు. ఆత్మ స్థైర్యాన్ని పెంపొందింపజేసాడు. సర్వ మతాల కంటే, యీ కారణాల వల్లనే బౌద్ధ ధర్మం విశిష్టతను సంతరించుకొన్నది.

ఒక రోజున బుద్ధుడు ప్రతి దినం భిక్షాటనకు వెళ్లే విధంగానే శిష్యులతో భిక్షాటన సాగిస్తున్నాడు. బుద్ధ ధర్మం వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, సర్వ మానవులను ఏకం చేస్తుందన్న ప్రచారం అంతటా పాదుకొంది. అందువల్ల సనాతనులైన అగ్రవర్ణాల వారికి బుద్ధ ధర్మం కంటగింపుగా వుండేది.

ఒక యింటి ముందు నిలబడి బుద్ధుడు భిక్ష అర్థిస్తుండగా, ఆ యింటి యజమాని బయటకు వచ్చాడు. అతడొక సనాతన బ్రాహ్మణుడు. బౌద్ధుల పట్ల ద్వేషాన్ని పెంచుకొని వున్నందున బుద్ధుని చూడగానే, ఆతని కోపం తారాస్థాయికి చేరుకుంది. నోటికి పట్టరాని దూషణ పదజాలాన్ని ఉపయోగించి, బుద్ధుని దూషించాడు.

బుద్ధుడు చిరునవ్వుతో ఆతని దూషణల్ని విన్నాడు. ప్రశాంతంగా యిలా అన్నాడు. "బ్రాహ్మణోత్తమా ! నీవు ఎవరికైనా కానుక యివ్వబోతే నీవు యివ్వదలచుకున్న వ్యక్తి దాన్ని తిరస్కరిస్తే, ఆ కానుక ఎవరికి చెందుతుంది ?" అని ప్రశ్నించాడు.

"కానుక యివ్వబోయిన వానికే చెందుతుంది" అన్నాడు బ్రాహ్మణుడు.

"నువు యిప్పుడు నాకు దూషణల్ని యిచ్చావు. నేను వాటిని స్వీకరించడం లేదు. ప్రతిధ్వని ధ్వనినీ, నీడ వస్తువునీ ఆక్రమించినట్టు చెడు చెడ్డవానినే ఆవరిస్తుంది గదా" అని అన్నాడు బుద్ధుడు.

బుద్ధుని ప్రశాంత వదనాన్నీ, ఆయన చెప్పిన పోలికనూ విని బ్రాహ్మణుడు సిగ్గుపడ్డాడు.

బుద్ధుడు తన ధర్మాన్ని ఉపదేశించు సమయంలో పాటించవలసిన నిగ్రహాన్ని గురించీ, సంయమనాన్ని గురించి శిష్యులకు బోధించేవాడు. "ప్రబోధము చేయువాడు యితరుల యెడ నిగ్రహంతో మెలగాలి. ఇతరుల తప్పుల్ని ఎత్తిచూపరాదు. దూషణ, తిరస్కారాన్ని, భూషణ గౌరవాదులతో సమంగా పరిగణించాలి. అపవాదులు వేయువాడు గానీ, దుర్భాషల్ని ప్రచారం చేయువాడు కానీ కారాదు. కోపతాపాల్ని దరిచేయనీయరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిగ్రహాన్ని కోల్పోకూడదు. ఇతర మతాలను దూషించడం, వారి శిష్యులను నొప్పించడం, వారి సిద్ధాంతాల్ని ఎత్తిపొడవడం గానీ చేయరాదు. సిద్ధాంత ఖండనం చేయునప్పుడు సరైన సిద్ధాంతంతోనూ, వాస్తవిక దృక్పథంతోనూ వివరించి, విపులీకరించాలి" అంటూ తెలియజెప్పేవాడు.

సునిశితమైన పరిజ్ఞానం, వక్తృత్వం, మృదుభాషణం, మేధాశక్తి, పరిజ్ఞానం గల బుద్ధుడు ఎట్టి పరిస్థితుల్లో యితరుల్ని దూషించడం గానీ, నొప్పించడం గానీ చేసేవాడు కాడు. ఇదే బుద్ధునిలో ప్రత్యేకత, గొప్పతనం.

## కిస గౌతమి కథ

ఒకసారి బుద్ధుడు శ్రావస్తి వెళుతూ వుండగా, మధ్యలో ఒకచోట విడిది చేసాడు. బుద్ధుని పరివారం విశ్రాంతి తీసుకుంటున్నది. ఆ సమయంలో 'కిస గౌతమి' అనే ఆమె ఒక శిశువు మృతదేహాన్ని భుజంపై వేసుకొని బుద్ధుని దగ్గరకు వచ్చింది. పాపం. ఎవరో ఆమెకు అలౌకిక శక్తులతో బుద్ధుడు చనిపోయిన బిడ్డను బ్రతికించగలడని చెప్పారట. తన బిడ్డను బ్రతికించమని ప్రతి ఒక్కరినీ కిస గౌతమి వేడుకుంటూ అడ్డుతగులుతూ వున్నందున, ఆమెకు నచ్చచెప్పలేక, బుద్ధుడిని చూపించి తప్పుకున్నారు.

బిడ్డపై వున్న ప్రేమానురాగాలతో ఆమె చనిపోయిన బిడ్డ తిరిగి జీవించనేరదని మాట కిస గౌతమి అంగీకరించలేకపోతున్నది. ఏ విధంగానైనా తన బిడ్డను బ్రతికించుకోవాలని ఆమె తాపత్రయం.

శ్రావస్తిలోని ఒక ధనిక వర్తకున్ని వివాహమాడిన పేదింటి యువతి కిస గౌతమి. ఆమెకు ఒక్కగానొక్క బిడ్డ ఆకస్మిక మరణం చెందాడు. వాడంటే ఆమెకు పంచ ప్రాణాలు ! ఒకరోజున ఆ బిడ్డ తోటలో ఆడుకుంటూ వుండగా ఒక విషసర్పం వాడ్ని కాటేసింది. గౌతమి దుఃఖానికి అంతులేదు. ప్రతివానినీ ఆ బిడ్డని బ్రతికించమని వేడుకుంటుంది. "పాపం ! పిచ్చి గౌతమి ! ఆమెకు మతిచలించింది" అని అనుకున్నారు ప్రజలు.

చివరికి ఒక వృద్ధుడు యిలా అన్నాడు. 'నువు బుద్ధ భగవానుని సహాయం కోరు తల్లీ! లోకంలో అందరి దుఃఖాల్నీ, బాధల్నీ ఆయన తొలగిస్తున్నాడని అందరూ అనుకుంటున్నారు' అని సలహా యిచ్చాడు.

కొడుకు శవాన్ని గుండెలకు హత్తుకొని కిస గౌతమి బుద్ధుని వద్దకు పరుగెత్తింది. ఆయన పాదాల మీద పడి వేడుకుంది. "ప్రభూ ! నన్ను కరుణించు. నా బిడ్డను బ్రతికించండి" అంది.

ఆమె దురవస్థను అర్థం చేసుకున్న బుద్ధుడు శాంతంగా యిలా అన్నాడు "ఎక్కడైనా ఒక గుప్పెడు ఆవాలు తీసుకురాగలవా తల్లీ !" అన్నాడు.

" నా బిడ్డ కోసం క్షణంలో తీసుకు వస్తాను, ప్రభూ !"

"అయితే ఒక విషయం గుర్తు వుంచుకో ! నువు ఆవాలు తెచ్చే యింటిలో, యింతవరకు ఎవరూ, ఎప్పుడూ చనిపోయి వుండకూడదు. అలాంటి యింటి నుంచి నువు ఆవాలు తీసుకురావాలి" అన్నాడు బుద్ధుడు.

ఆవాలు కొరకు కిస గౌతమి యిల్లిల్లూ తిరిగింది. ముందుగా వారిని యిలా ప్రశ్నించేది. "కొడుకో, కూతురో, తల్లి, తండ్రీ, మీ యింటిలో యింతవరకు ఎవరైనా చనిపోయారా, అమ్మా" అని.

ప్రతి యింటా ఆమెకు ఒకే రకమైన జవాబు వచ్చేది. "అయ్యో! అదేమమ్మా! బ్రతికున్న వారు తక్కువా, చనిపోయినవారే ఎక్కువ తల్లీ. కావాల్సిన వాళ్లు చనిపోయారమ్మా !"

నగరంలో ప్రతి యింటికీ కిస గౌతమి వెళ్లింది. అప్పటికే ఆమె మరణం సంభవించని యిల్లు లేదని కిస గౌతమి గ్రహించింది. మరణం సంభవించని యిల్లు ఒక్కటి కూడా ఆమెకు కనిపించలేదు.

చివరకు నిరాశతో ఆమె బుద్ధుని వద్దకు వచ్చి, తలవాల్చుకొని నిలుచుంది. అప్పటికే ఆమె "మరణం సర్వసాధారణం" అని గ్రహించింది. బుద్ధుడు ఆమెవైపు చూసి "తల్లీ ! మరణం ప్రతిఒక్కరికీ అనివార్యం. కనుక నీవు నిజాన్ని తెలుసుకొని, నీ జీవితాన్ని సంఘసేవకు వినియోగించు" అని అన్నాడు.

" నీ బిడ్డ కొరకు నీవు ప్రతి యింటికీ వెళ్లావు. వెళ్లిన ప్రతి యింటా చనిపోయినవారిని గురించి వినే వుంటావు. మరణం ఎవ్వరికి తప్పదు. చివరకు నేను సైతం కొన్నాళ్లకు మరణించవలసిందే. కాకపోతే నీ బిడ్డ కొద్ది వయస్సులో చనిపోవడం చింతించాల్సిన విషయం, బాధాకరం కూడాను. నీ జీవితానికి ఏ ఆసరా లేకపోతే నీవు సంఘారామంలో చేరి, పాటి మనుషులకు సేవ చేస్తూ నీ జీవితాన్ని గడపవలసింది. నీకు తృప్తి దక్కుతుంది" అని బోధించాడు.

బుద్ధ భగవానుని శాంతి వచనాలు కిస గౌతమికి ఊరట కలిగించాయి. ఆమె భక్తితో బుద్ధుని పాదాలకు నమస్కరించింది. తదుపరి కిస గౌతమి దీక్ష తీసుకున్నది. బౌద్ధ భిక్షుకిగా శేష జీవితాన్ని సంఘారామానికి అంకితం చేసుకున్నది.

తాంత్రిక పద్ధతుల్లోనూ, మంత్ర, తంత్రాలలోనూ నీ బిడ్డను బ్రతికించగలనని డాంబికాలు లేకుండా, క్షుద్ర విద్యలు తమ వద్ద వున్నాయని ప్రగల్భాలు లేకుండా - బుద్ధుడు వాస్తవిక దృష్టితో, వ్రాతపూర్వకమైన వివరణతో, కిస గౌతమికి స్వీయానుభవంతోనే మరణం అనివార్యం" అని తెలిసి వచ్చేలా చేసి, ఆమె మానసిక స్థితిని స్వస్థతపరిచాడు.

## ప్రతీత్య సముత్పాదం

"ప్రతి సంఘటనకు ఒక కారణం వుంటుంది. కారణమే కార్యంగా మారుతుంది. దీనినే కారణం కారత్వ సిద్ధాంతం క్రింద బుద్ధుడు ప్రతిపాదించాడు. ఏ కారణం లేకుండా కార్యం జరగదు. తిరిగి కార్యం కారణంగా పరిణమిస్తుంది. ఏదీ శాశ్వతంగా వుండదు. కార్యం జరగగానే కారణం నశిస్తుంది. తిరిగి నూతనంగా మరొక కారణం ఏర్పడుతుంది. చివరకు అంతా నశిస్తుంది. తిరిగి కొత్త ఉద్భవిస్తూ వుంటుంది. ఘటనల సముదాయంగా యిలా జరిగిపోతూనే వుంటుంది. ఏ కార్యమూ శాశ్వతంగా వుండదు. ప్రకృతిలో ఘటనాపరంగా ఘటనలు ఉద్భవిస్తూ వుంటాయి. నశిస్తూ వుంటాయి. తిరిగి కొత్త ఘటనలు పుడుతూ వుంటాయి" అంటూ నూతన సిద్ధాంతాన్ని బుద్ధుడు ఆవిష్కరించాడు. దీనినే 'ప్రతీత్య సముత్పాదం" క్రింద వివరించబడింది.

ప్రకృతి ఘటనలు, సృష్టి, స్థితి, లయ కారకములు. ఏదో ఒక అతీంద్రియ శక్తిచే నడుపబడుతున్నాయని చెబుతున్న ఈశ్వర వాదానికి యిది పూర్తిగా వ్యతిరేకం. బుద్ధుడు అతీంద్రియ శక్తిని ఏనాడు అంగీకరించలేదు.

## అంగుళీమాలుడు

అంగుళీమాలుడు బందిపోటు దొంగ. అతను దారుల్లో పొంచి వుండి ప్రయాణీకులను దోచుకొని, అందుకు గుర్తుగా దోపిడీకి గురి అయిన వారి బొటన వ్రేళ్లను కోసుకొని, వాటిని మాలగా మెడలో ధరించేవాడు. అందువలన అతని పేరు "అంగుళీమాలుడని" ప్రచారమైంది. ఇతడు సంఘ బహిష్కృతుడు. క్రూర మనస్తత్వం కలవాడు.

ఒకసారి బుద్ధుడు ఆ మార్గంలో ప్రయాణించవలసి వుండగా, అనుయాయులు ఆ మార్గంలో అంగుళీమాలుడు వున్నందున, వేరొక దారిలో ప్రయాణం చేద్దాం అన్నారు. బుద్ధుడు వారి సూచనను నిరాకరించాడు. సమస్య ఎదురైనపుడు, దాన్ని ఎదుర్కొని పరిష్కారం చేయాలే గాని, సమస్యను దాటవేయకూడదని బుద్ధుడు చెప్పి, అదే బాటలో ప్రయాణం సాగించాడు.



అనుకున్నట్టుగానే కొంత దూరం పయనం సాగించగానే దట్టమైన చెట్లమాటు నుండి అంగుళీమాలుడు పెద్దగా కేకలు వేసుకుంటూ వచ్చి, దారికి అడ్డంగా నిలుచున్నాడు. అతని చేతిలో పెద్ద కత్తి, గొడ్డలి వున్నాయి.

బుద్ధుడు, తన అనుయాయులతో పెద్దగా అంగలు వేసుకుంటూ, నిర్భయంగా ఆతని సమీపించాడు.

"ఆగండి" అన్నాడు అంగుళీమాలుడు.

బుద్ధుడు చిరునవ్వుతో ఆతని ముందు నిలబడి, ఆతని కళ్లల్లోకి ప్రేమాస్పదంగా చూస్తూ వుండిపోయాడు. అంగుళీమాలుడు ఆశ్చర్యంలో తనను లెక్కచేయకుండా రావడమే కాకుండా, తనవైపు కరుణాత్మకంగా చూస్తున్న బుద్ధుని వైపు అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించాడు.

బుద్ధుడు ఆతని తలపై చేతితో నిమురుతూ "అంగుళీ మాలా! ఈ వృత్తిని వదిలివేసి, సంఘారామంలో చేరి, సంఘానికి సేవ చేయవలసింది అని సూచించాడు.

అంగుళీమాలుడు మారుమాట్లాడకుండా "ప్రభూ! నేను దొంగని. నన్ను సంఘంలో చేర్చుకుంటారా ?" అని అడిగాడు.

"పుట్టుకతో ఎవరూ దొంగగా పుట్టరు. ఏ పరిస్థితుల్లో నీవు దొంగగా మారిందీ, ఆ గతాన్ని విడిచిపెట్టు. యికముందు కాలాన్ని సన్మార్గంలో గడుపు" అన్నాడు. అంగుళీమాలునిలో పరివర్తన వచ్చింది. వెంటనే అతను పరివ్రాజకుడై, అటు తర్వాత బౌద్ధ సంఘంలో ప్రముఖ బుద్ధ పరివ్రాజకునిగా పేరుగాంచాడు.

చరిత్రహీనుల్ని, దొంగల్ని, సంఘ బహిష్కృతుల్ని, దరిద్రుల్ని, కులహీనుల్ని, తన దరికి చేర్చుకొని, వారి జీవితాల్లో వెలుగుల్ని నింపి, ఉత్తమ వ్యక్తులుగా వారిని తీర్చిదిద్దాడు.

## విశాఖ ఉదంతం

కోసల రాజధాని శ్రావస్తిలో ప్రముఖ వడ్డీ వ్యాపారుడైన ధనంజయుని కుమార్తె విశాఖ. బాలికగా వుండగానే తన కుటుంబ సభ్యులతోపాటు బుద్ధుని అనుయాయురాలయ్యింది. యుక్త వయస్సు వచ్చిన తరువాత శ్రావస్తి నగరానికి చెందిన మరొక వడ్డీ వ్యాపారి అయిన మిగరుని కుమారునితో ఆమెకు వివాహం జరిగింది.

ఒకసారి బుద్ధ భగవానుడు శ్రావస్తి నగరం సందర్శించినప్పుడు విశాఖ ఆయనను తన యింటికి భిక్షకు పిలువాలనుకొంది. కానీ ఆమె మామ మిగరుడు అందుకు ఒప్పుకోలేదు. "ఎందరో యువకులు బుద్ధుని వల్ల సన్యాసాశ్రమం స్వీకరించి కుటుంబ జీవనం నుంచి వెళ్ళిపోతున్నారనీ, ఎన్నో కుటుంబాలు ఆయనవల్ల విచ్ఛిన్నం అయ్యాయనీ అంటూ, ఆయన్ను మన యింటికి ఆహ్వానిస్తావా ?" అని విశాఖను అడిగాడు.

'బుద్ధుని విరోధులు ఆ విధంగా పుకార్లు వ్యాపింపజేసారు. కానీ మీరు చెప్పినది వాస్తవం కాదు. సన్యసించమని బుద్ధుడు ఎవరినీ బలవంతం చేయడం లేదు. అది మన వ్యక్తిగత నిర్ణయం. సన్యాసం అవసరం లేకుండానే ధర్మపథాన్ని అవలంభించవచ్చునని బుద్ధుడు చెబుతున్నాడు. ప్రతి యింటికి ఆయన శాంతి సుఖాన్ని ప్రధానం చేస్తున్నాడని నాకు తెలుసు'అని వాదించింది విశాఖ.

"ఆయన మన యింటికి వస్తే నష్టం ఏముంది, నాన్నా, ఒక మహా పురుషుడ్ని దర్శించినట్లవుతుంది. ఆయన పట్ల మనం ఒక సాధారణ గౌరవం చూపినట్లవుతుంది. అంతేగదా" అన్నాడు విశాఖ భర్త తండ్రిని ఉద్దేశించి.

మిగరుడు చివరకు అంగీకరించాడు. విశాఖ తన యింటికి రావలసిందిగా బుద్ధున్ని ఆహ్వానించింది. బుద్ధుని ప్రసంగం ఒకసారి తన మామగారు వింటే, మనస్సు మార్చుకుంటారని ఆమె వుద్దేశించి, కుటుంబ సభ్యుల్లో బుద్ధుడు ప్రసంగించేప్పుడు, ఆయన ఉపదేశం మామగారి చెవుల్లో పడేట్లు విశాఖ జాగ్రత్తలు తీసుకున్నది. అనుకున్నట్లే దయామయుడైన బుద్ధుని ప్రసంగం మిగరున్ని బాగా కదిలించింది. మిగరుడు బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు.

ఆ విధంగా బుద్ధుడు తన ధర్మపథాన్ని ప్రతిచోటా వినిపిస్తూ, ఎందర్నో తన అనుయాయులుగా చేసుకున్నాడు. కరుణ, ప్రేమ, అహింసాయుతమైన బుద్ధ ధర్మం ఒకసారి వింటే, ప్రతి ఒక్కరూ బుద్ధ ధర్మం వైపు పరుగులు తీయడం జరుగుతుంది. కల్లోలభరితమైన సమాజానికి బుద్ధ ధర్మం ఎల్లెడలా శాంతి, సుఖాల్ని అందించింది.

## ప్రేమ పగను జయిస్తుంది

బుద్ధ ధర్మానికి మూలసూత్రాలు ప్రేమ, కరుణ, అహింస, శాంతి, కోరికలను అదుపులో పెట్టుకోవడం. తృప్తితో జీవించడం ప్రధానంగా బుద్ధుడు తన ధర్మపథాన్ని గురించి వివరించి చెబుతూ వుంటాడు.

ద్వేషం, ద్వేషంతో జయింపబడదు. హింస, హింసతో అంతంకాదు. ప్రేమతో మాత్రమే ద్వేషాన్ని జయించాలి అని బుద్ధుడు ఉపదేశించాడు. ఇందుకు ఒకసారి ఆయన ఒక కథ ద్వారా తన ప్రసంగాన్ని ముగించాడు.

"కాశీరాజు చాలా బలవంతుడు. ఒకప్పుడు పొరుగున వున్న చంపోనుడైన కోసల రాజుపై అదను చూసి కాశీరాజు దాడి చేసాడు. కోసల రాజూ, రాణి పారిపోయి ఒక కుమ్మరి వాని యింటిలో తలదాచుకున్నారు. అక్కడ వారికి దీర్ఘాయువు అనే కొడుకు పుట్టాడు. దీర్ఘాయువు బాలుడుగా వుండగానే, ఆతని తల్లిదండ్రుల ఆచూకి కాశీ రాజుకు తెలిసింది. వాళ్లను బంధించి, ఉరిశిక్ష విధించాడు. దీర్ఘాయువు తప్పించుకొని రహస్యంగా తల్లిదండ్రుల్ని ఉరితీసే చోటికి వెళ్లాడు. ఆతని తండ్రి దీర్ఘాయువుతో చెప్పిన చివరి మాటలు "ద్వేషంతో ద్వేషం నశించదు. ప్రేమతోనే ద్వేషాన్ని నశింపజేయవచ్చును" అని చెప్పాడు.

దీర్ఘాయువు పెరిగి పెద్దవాడై అనేక విద్యల్లో ఆరితేరాడు. రాజుగారి కోటలో అతనికి ఉద్యోగం వచ్చింది. అనతికాలంలోనే తన ప్రతిభ ద్వారా దీర్ఘాయువు రాజుగారి విశ్వాసానికి పాత్రుడై, అంగరక్షకుడైనాడు. ఒకరోజున వేటలో రాజుగారు తన సైన్యానికి దూరం అయ్యాడు. అప్పుడు రాజూ, దీర్ఘాయువు మాత్రమే మిగిలారు. వేటలో అలిసిపోయినందున రాజు దీర్ఘాయువు ఒడిలో తలపెట్టుకొని నిద్రపోయాడు.

సరిగ్గా అలాంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న దీర్ఘాయువు ఒరలోనుంచి కత్తిని బయటకు లాగి యిలా అన్నాడు. "మా తల్లిదండ్రుల్ని నువ్వు చంపావు. ఇప్పుడు నీ వంతు వచ్చింది". అయితే దీర్ఘాయువుకు తన తండ్రి ఉరికంబం వద్ద చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే దీర్ఘాయువు కత్తిని మళ్లీ ఒరలో పెట్టి భయంతో వణికిపోతున్న రాజు గారిని క్షేమంగా కోటలోనికి చేర్చాడు. దీర్ఘాయువులోని క్షమాగుణం రాజును కదిలించింది. తాను హరించిన ఆస్తినంతా తిరిగి రాజు దీర్ఘాయువుకు యివ్వడమే గాకుండా, తన కుమార్తెను కూడా ఆతనికి యిచ్చి పెళ్లి చేసాడు.

"శిష్యులారా ! దీర్ఘాయువు వంటి క్షమాగుణాన్ని ప్రజలందరూ అలవర్చుకోవాలి" అని బోధించాడు.

బుద్ధ ధర్మాన్ని ప్రజలకు, శిష్యులకు వివరించేప్పుడు బుద్ధుడు వారికి సులభంగా అర్థం అయ్యేందుకు యిలాంటి ఉపమానంతో కూడిన కథలెన్నింటినో చెప్పేవాడు.

కాళ్లకు ధరించే చెప్పుల ఉదాహరణతో మనిషికి కావాల్సిన ఆదాయాన్ని గురించి బుద్ధుడు యిలా అన్నాడు. "మనం కాళ్లకు ధరించే చెప్పులు చాలకపోతే పాదాల్ని కరుస్తాయి. పెద్దవైతే మనల్ని తప్పటడుగుల్ని వేయిస్తాయి. కనుక పాదాలకు సరిపడేంత చెప్పుల్ని మాత్రమే మనం ధరించవలసి వుంది. అలాగే మనిషికి కావాల్సిన ఆదాయం, ఆర్థిక స్థితి కూడా యిలాగే వుండాలి. కుటుంబ జీవనానికి కావాల్సినంత ఆదాయం వుండాలి. చాలకపోతే బాధల్ని కలిగిస్తుంది. ఆదాయం ఎక్కువైతే మనచేత అనేక విపరీతమైన కోర్కెలకు దారితీస్తుంది అని చెప్పేవాడు. కనుక మనిషి సరిపడేంత ఆదాయాన్నే కలిగి వుండాలి. ఎక్కువగా వున్న రాజుని సంఘ శ్రేయస్సుకు వినియోగించమని చెప్పాడు.

తన మాధ్యమిక వాదాన్ని శ్రుతి చేసిన వీణతో బుద్ధుడు సరిపోల్చి చెప్పేవాడు. వీణ తీగెలు బాగా బిగుతుగా వున్నా, బాగా వదులుగా వున్నా దానిమీద స్వరాలు సరిగ్గా పలకవు. వీణ చక్కగా పలకాలంటే, తగినంతగా మాత్రమే తీగెల్ని బిగించాలి. అలాగే తన నిత్య జీవన విధానంలో కూడా మనిషి మాధ్యమిక మార్గాన్ని అనుసరించాలి అని బుద్ధుడు చెప్పాడు.

ఒక సందర్భంలో నిర్వాణ మార్గాన్ని గురించి తనను ప్రశ్నించిన ఒక శిష్యునితో బుద్ధుడు యిలా అన్నాడు. "బాల బాలికలు ఇసుకలో పిచ్చుక గూళ్లు కట్టుకొని కొంతసేపు ఆనందిస్తారు. ఆటమీద ఆసక్తి వున్నంతవరకూ ఆ గూళ్లు వారికి యిష్టమైనవి. అవునా ?"

"అవును, భంతే !"

"కానీ ఆట పూర్తి కాగానే, వాటిని పడగొట్టివేస్తారు. అవునా ?"

"అవును. భంతే"

అదేవిధంగా జీవితం మీద మమకారం ఉన్నంత కాలమూ ప్రజలు ఈ దేహ యాత్రకు ఎంతో విలువ యిస్తారు. దానిమీద కొన్నాళ్లకు క్రమేణా ఆసక్తి సన్నగిల్లుతుంది. కొంతకాలానికి శరీరపు మనుగడే అంతరించిపోతుంది. అదే నిర్వాణం ! అయితే యీ దేహ యాత్ర ఫలప్రదంగా సాగించాలి. సంఘ శ్రేయస్సుకు తన జీవితం ఉపయోగపడేలా, తృప్తిగా జీవించాల్సి వుంటుంది" అని బుద్ధుడు సెలవిచ్చాడు.

వాస్తవికత, హేతు దృష్టి బుద్ధుని సొత్తు. ఆయన తన ధర్మాన్ని యీ అంశాలతోనే పొందుపరిచాడు. అతిశయోక్తులు, అభూతకల్పనలు ఆయన త్రోసిరాజన్నాడు. "కళ్లకు కనిపించేదాన్ని విశ్వసించు. నీకు తెలియనిదాన్ని నీ అవగాహనకు రానిదాన్ని. ఎంత పెద్దవారు చెప్పినా నమ్మవద్దు. దాన్ని వాస్తవికతకు దగ్గరగా వుందా ? లేదా ? అని పరిశీలించి, నీకు నచ్చితేనే అంగీకరించు" అని బుద్ధుడు చెప్పాడు.

## కారుణ్యమూర్తి బుద్ధ భగవానుడు

జ్ఞానోదయం అయిన తరువాత బుద్ధుడు కపిలవస్తు వచ్చినప్పుడు, అక్కడ అనేకమందికి దీక్ష యిచ్చి బుద్ధ సంఘంలో చేర్చుకున్నప్పుడు, బుద్ధుని బాల్య స్నేహితుడూ, దాయాది అయిన దేవదత్తుడు కూడా బుద్ధ సంఘంలో చేరాడు.

బౌద్ధ సంఘానికి ఎదురులేని నాయకుడు బుద్ధుడు అది చూసి దేవదత్తునిలో అసూయ చెలరేగింది. తాను బౌద్ధ సంఘానికి నాయకుడు కావాలని దేవదత్తుని కోరిక. ఒకరోజు మెల్లిగా బుద్ధుని సమీపించి, దేవదత్తుడు "భగవాన్ ! మీకు వృద్ధాప్యం సమీపిస్తోంది. విశ్రాంతి అవసరం. అందుచేత తమరు నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకొని, ఆ బాధ్యతను నాకు అప్పగించవలసింది" అని అన్నాడు.

"నేను జీవించి వున్నంతకాలం బౌద్ధ సంఘాన్ని నేనే నడుపుతాను'' అన్నాడు బుద్ధుడు. దేవదత్తుని సలహాలో అంతరార్థం బుద్ధునికి తెలుసు. సహజంగా అతను అతిశయసరుడనీ, ఆతనికి నాయకత్వ లక్షణాలు లేవనీ కూడా ఆయనకు తెలుసు. దాయాది కనుక దేవదత్తుడు మిగతా శిష్యుల కంటే బుద్ధునికి మరింత సన్నిహితం కావాలని ఆతను చేసే ప్రయత్నాల్ని బుద్ధుడు ఆటంకపరచకుండా, ఆతనిలో మార్పును తెచ్చేందుకు ప్రయత్నం చేసాడు.

సంఘ నాయకత్వం చేజిక్కించుకొనే ప్రయత్నం విఫలం కావడంతో, దేవదత్తుడు సంఘాన్ని రెండుగా చీల్చడానికి పూనుకున్నాడు. బుద్ధుడు మరొక ఎనిమిదేళ్లకు మహాపరి నిర్యాణం చెందుతాడనగా, దేవదత్తుడు తన దగ్గరి మిత్రు[illegible]నూ, మరికొందరి భిక్షువులతోనూ "పోటీ సంఘం' నొకదాన్ని నెలకొల్పాడు. రాజగృహ సంఘ[illegible]ని ఐదు వందల మంది భిక్షుల్ని తన కొత్త సంఘంలో చేరేందుకు వారిని ప్రోత్సహించాడు. కానీ సారిపుత్ర, మొగ్గలాయనల కృషివల్ల భిక్షువులెవరూ దేవదత్తుని సంఘంలో చేరలేదు.

ఇందుకు దేవదత్తుడు మరింతగా బుద్ధునిపై ద్వేషాన్ని పెంచుకున్నాడు. ఎలాగైనా బుద్ధుని అంతమొందించాలని కూడా నిశ్చయించుకున్నాడు. అందుకు మగధ రాజు కుమారుడైన అజాత శత్రువును ఆసరా చేసుకున్నాడు.

మగధరాజు బింబిసారుడు బుద్ధునికి నమ్మినబంటు. బింబిసారుడు జీవించి వున్నంత కాలమూ రాజగృహంలో తన ఆటలు సాగవని దేవదత్తుడు గ్రహించాడు. అందువల్ల ఎలాగైనా అజాతశత్రువుకు తండ్రి మీద ద్వేషం కలిగేలా చేయాలని తలంచి, ఆతనికి దుర్బోధనాలు చేయసాగాడు. "అజాత శత్రూ! నీ తండ్రి బింబిసారుడు బ్రతికి వున్నంత వరకూ నీకు మగధ రాజసింహాసనం దక్కదు. తెలుసుకో'' అన్నాడు.

"అజాతశత్రువులో ఆందోళన చెలరేగింది. నిజమే. తన తండ్రి తనకు రాజ్యం అప్పగించే ప్రయత్నంలో లేడు'' అని అనుకున్నాడు.

"నీ తండ్రిని వధించి, నీవు మగధ రాజ్య సింహాసనాన్ని వశం చేసుకో'' అని కూడా దేవదత్తుడు, అజాత శత్రువుకు సలహా యిచ్చాడు.

అయితే తండ్రి అని కూడా చూడకుండా, అజాతశత్రువు బింబిసారుడ్ని ఖైదు చేసి, మగధ రాజ్య సింహాసనం అధిష్టించాడు. ఇక అజాతశత్రువు ప్రాపకం వల్ల, దేవదత్తుడు అనేక ప్రయత్నాలతో బుద్ధుని కడతేర్చాలని ప్రయత్నాలు తీవ్రం చేసాడు. అజాతశత్రువు రాజైన తరువాత రాజగృహంలో దేవదత్తుని పలుకుబడి పెరిగింది.

ఒకసారి బుద్ధుడు వర్షాకాలాన్ని రాజగృహంలో గడపడానికి శిష్యులతో వస్తున్నాడని దేవదత్తునికి కబురందింది. ఈ విషయం తెలిసి ఎలాగైనా బుద్ధుని చంపడానికి దేవదత్తుడు కుట్రలు పన్నాడు. అజాతశత్రు సైన్యంలో విలువిద్యలో ఆరితేరిన విలుకాండ్రను ఎంపికచేసి,

బుద్ధభగవానుడు వచ్చే దారిలో వేరువేరుచోట్ల వారిని పొంచి వుండేట్లు చేసాడు. కానీ బుద్ధుడు కంటపడగానే, ఆయన దివ్య తేజస్సు చూసి, ఆ విలుకాండ్రు తమ మనస్సు మార్చుకొని, ఆయన పాదాల మీద పడి తమని దేవదత్తుడు పంపగా, మిమ్మల్ని చంపడానికి వచ్చామని, మమ్ము క్షమించమని వేడుకున్నారు. దయామయుడైన బుద్ధుడు వారిని మన్నించి, తిరిగి వారిని దేవదత్తుని వద్దకు పంపివేసారు.

ఆవిధంగా తన ప్రయత్నం విఫలం కావడంతో దేవదత్తుని కోపం మరింత పెరిగింది. తన పన్నాగం అమలు జరగడానికి మరొక అవకాశం కొరకు వెతకసాగాడు. బుద్ధుని కదలికల్ని జాగ్రత్తగా గమనిస్తూ, దేవదత్తుడు, ఒకసారి కొండ దిగువ భాగాన బుద్ధుడు ధ్యాన నిమగ్నంలో వుండగా, కొండపై నుండి బండరాళ్లను ఆయనపై పడేట్లు దొర్లించే ఏర్పాటు చేసాడు. కాని ఆ కొండరాళ్లు మధ్యలోనే మరొక పెద్ద బండకు తగిలి ముక్కలైపోయాయి. అదికూడా విఫలం కావడం దేవదత్తునిలో ప్రతీకారం మరింత పెరిగింది.

రాజగృహంలో మిక్కిలి భయంకరమైన "నలగిరి" అనే ఏనుగు మావటికి పెద్ద ఎత్తున బంగారాన్ని ఆశచూపి, ఆ బుద్ధుడు రేపు యిదే మార్గంలో వచ్చేటప్పుడు, ఆయన మీదికి 'నలగిరి' ని వదలమని చెప్పాడు.

మరుసటిరోజు బుద్ధుడు భిక్షాటనకు ఆ వీధిలోకి రానడంతోనే, మావటి 'నలగిరి' ని బుద్ధుని పైకి వదిలాడు. నలగిరి ఘీంకారం చేసుకుంటూ వచ్చింది. బుద్ధ భగవానుని ఆంతరంగిక శిష్యులు ఆనందుడు 'నలగిరి' ఆ విధంగా రావడం చూసి, బుద్ధునికి ముందు నిలబడి "భగవాన్, నేను ఆ ఏనుగునకు బలి అవుతాను" అని నిలబడ్డాడు. కానీ 'నలగిరి' బుద్ధుని సమీపించి, నిశ్చలంగా, చిరునవ్వుతో నిలబడివున్న బుద్ధుని వద్దకు రాగానే, శాంతించింది. బుద్ధుడు ప్రేమగా దానిని నిమిరి దీవించాడు. బుద్ధుని పాదాల వద్ద ఏనుగు మోకరిల్లింది.

అటు తర్వాత కొద్ది కాలానికే దేవదత్తుడు మరణించాడు. మరణించే సమయంలో ఎలాగైనా బుద్ధ భగవానున్ని క్షమాపణ వేడుకోవాలని తహతహలాడాడు. కొందరి భిక్షుల సహాయంతో బుద్ధున్ని దర్శనానికి బయల్దేరాడు. కానీ ఆయనను కలుసుకోకుండానే, దారిలోనే బుద్ధుని తలంచుకుంటూ ప్రాణాలు వదిలాడు.

బుద్ధుడు శత్రువులనైనా క్షమించి, వారిలో పరివర్తన తీసుకురాగల కరుణామూర్తి.

## ఆమ్రపాలి ఉదంతం

ఆమ్రపాలి సౌందర్యవతి. ఆమ్రం అనగా మామిడి పండు. మామిడిచెట్టు క్రింద ఎవరో కనిపారేసిన పసికందును, బిడ్డలు లేని దంపతులు తెచ్చి పెంచిపెద్ద చేసారు. తదుపరి

పెంపుడు తల్లిదండ్రులు కూడా చనిపోగా, "ఆమ్రపాలి" నా అనేవాళ్లు లేనిదయింది. కానీ ఆమ్రపాలి సౌందర్యం వైశాలిలో యువకులనెందరినో ఆకర్షించేది. వైశాలి నగర రాజకుమారులు కూడా ఆమ్రపాలి పొందుకొరకు పోటీపడ్డారు. తుదకు ఆమె సౌందర్యమే ఆమెకు శత్రువులా మారిందనుటలో ఆశ్చర్యం లేదు.

ఆమ్రపాలి తనను వివాహమాడుతుందని కలలు కన్న సైన్యాధిపతి కుమారుడు, సామంత యువకులు ఒకరితో నొకరు కలహించుకుంటూ, తుదకు రాజ్యంలోనే రాజరిక వ్యవస్థలో సంక్షోభం ఏర్పడే పరిస్థితికి దారితీసింది.

ఈ పరిస్థితుల్లో నగర సభ కొలువుతీరింది. రాజరిక వ్యవస్థలో వచ్చిన విభేధాలు సమసిపోవాలంటే, ఆమ్రపాలిని నగర వేశ్యగా వుండాలని తీర్మానించడం జరిగింది. ఆమ్రపాలి నగర వేశ్యగా పరిగణింపబడింది. ఆమె మానసిక సంక్షోభంతో కుమిలిపోయింది. ఆమెలో కసి బయలుదేరింది. సమాజంపట్ల, మనుషుల పట్ల ద్వేషం ప్రబలసాగింది. అయినా చేయగలిగిందేముంది ? ఆమెకున్న సౌందర్యం అనే ఆయుధం ద్వారా, రాజకుమారుల్ని, సామంతుల్ని, ధనిక యువకుల్ని నగర వేశ్యగా అలరింపజేసి, కోట్లాది సొమ్మును, అపారమైన సంపదను ఆర్జించింది. వైభవోపేతమైన జీవితాన్ని గడిపింది. రాజ ప్రాసాదం వంటి భవనాన్ని నిర్మింపజేసుకుంది. ఆమె క్రీగంటి చూపు కోసం, యువలోకం తహతహలాడింది. తనకోసం ప్రయత్నించే వాళ్లందర్నీ పాదాక్రాంతుల్ని చేసుకొంది.

మగధరాజు బింబిసార చక్రవర్తికి సైతం ఆమ్రపాలితో సంబంధాలు వున్నాయని కూడా ఒక కథనం ప్రచారంలో వుంది. ఈ విధంగా వైభవమైన భోగభాగ్యాలు కూడా కలిగివుండి కూడా, మనస్సుకు ప్రశాంతత, స్థిమితం ఆమ్రపాలికి లేకపోవడం వింతేమీ కాదు.

ఒకసారి బుద్ధభగవానుడు వైశాలి నగరంలో విడిది చేయడం జరిగింది. ఆమ్రపాలికి కూడా బుద్ధుడు వైశాలికి వేంచేసాడని తెలిసింది. ఆ మహామహుని దర్శించాలనే తహతహతో మొదటిరోజునే బుద్ధుని వద్దకు వెళ్లి, సాష్టాంగపడింది. బుద్ధుడు దయార్ద్ర హృదయంతో ఆమ్రపాలిని దీవించాడు.

"ప్రభూ ! నా యింటికి మీరు భిక్షకు దయచేయండి. నా ఆతిథ్యం స్వీకరించండి" అని వేడుకున్నది. బుద్ధుడు "అలాగే" నన్నాడు. మరుసటి రోజు ఆమ్రపాలి గృహంలో బుద్ధునికి ఆతిథ్యం యిచ్చే సన్నాహాల్లో ఆమ్రపాలి నిమగ్నమైంది. అయితే ఆమ్రపాలి వెళ్లిన మరికాసేపటికే వైశాలి సామంతులు బుద్ధుని దర్శించడానికి వచ్చారు. బుద్ధుని ఉపదేశం పూర్తికాగానే సామంతులు "రేపు మా ఆతిథ్యాన్ని స్వీకరించవలసింది" అని కోరారు.

"ఆమ్రపాలికి మాటిచ్చాను. రేపు ఆమ్రపాలి యింట ఆతిథ్యం వుంది" అన్నాడు.
"మేము సామంతులం, మిమ్మలను వేడుకుంటున్నాము" అన్నారు సామంతులు.

"మొదట ఆమ్రపాలికి వాగ్దానం చేసాను గదా" అన్నాడు బుద్ధుడు.

"ఒక వేశ్య మాకంటే ఎక్కువా ?" అని సామంతులకు ఆగ్రహం వచ్చింది. బుద్ధుడు వారికి సావధానంగా నచ్చచెప్పాడు.

"సంఘ పరిచ్యుతులకే బౌద్ధం అవసరం ఎక్కువగా వుంటుంది" అంటూ మీకు నా పైన గౌరవముంటే, మీరు కూడా ఆమ్రపాలి యింట జరిగే విందుకు రావాలసింది" అని చెప్పాడు. సామంతులు కూడా అందుకు అంగీకరించారు.

అప్పటివరకు ఏ ఒక్కరూ యివ్వనంత గొప్పగా ఆమ్రపాలి బుద్ధ పరివారానికి విందు యిచ్చింది. స్వయంగా బుద్ధ అనుయాయులకు వడ్డించి, ఆదరించింది. విందు కార్యక్రమం చాలా అట్టహాసంగా గడిచింది.

బుద్ధునికి వీడ్కోలు యిస్తూ, ఆమ్రపాలి బుద్ధుని పాదాలపై బడి "భగవాన్ ! నేను యీనాడు ధన్యురాలినయ్యానని భావించి, ఆనందపడుతున్నాను. కానీ నాకు మనస్సు స్థిమితంగా వుండడం లేదు. జీవితంలో ఒంటరిదాన్ని. ఆత్మీయులంటూ ఎవరూ లేనిదాన్ని. యీ సంపదలు నాకు శాంతిని యివ్వడం లేదు" అని అన్నది.

బుద్ధుడు చిరునవ్వు నవ్వి "ఒక మిసమిసలాడుతున్న మామిడిపండు యిచ్చి, ఆమ్రపాలీ! నేను తిరిగి వైశాలి వచ్చిందాకా నీవు దీన్ని భద్రంగా దాచిపెట్టు". అప్పుడు నీవు నాకు దీన్ని బహుమతిగా యివ్వాల్సి వుంటుంది" అని యిచ్చి వెళ్లాడు.

ఆమ్రపాలి తనకు బుద్ధ భగవానుడు యిచ్చిన మామిడిపండును జాగ్రత్తగా ఒక బంగారు పెట్టెలో దాచి వుంచింది.

కొన్నాళ్లు గడిచిన తరువాత, బుద్ధ భగవానుడు వైశాలి సందర్శించడం జరిగింది. బుద్ధుడు ఆ సందర్భంలో "ఆమ్రపాలి" గృహానికి వస్తున్నట్టు వర్తమానం పంపాడు. ఆమ్రపాలి స్వయంగా ఎదురేగి బుద్ధభగవానున్ని ఆహ్వానించింది.

బుద్ధుడు ఉచిత మర్యాదలన్నీ జరిగాక "ఆమ్రపాలీ ! నీవు గతంలో నేను మీ యింట ఆతిథ్యానికి వచ్చినప్పుడు యిచ్చిన మామిడిపండు తీసుకురా !" అన్నాడు.

ఆమ్రపాలి తాను భద్రంగా దాచి వుంచిన మామిడిపండు తెచ్చి బుద్ధభగవానునికి యిచ్చింది. అది పూర్తిగా వడలిపోయివుంది.

బుద్ధుడు దాన్ని పట్టుకొనగానే, దాని 'టెంక' చీలి వచ్చింది. దాన్ని ఆమ్రపాలికి చూపిస్తూ టెంకలో నిలిచివున్న విత్తనం మొలకని తీసి, మామిడిపండు అంతా వడలిపోయింది. దాని సొరు, సొగసంతా క్షీణించిపోయింది. కానీ దానిలో నిక్షిప్తంగా వున్న యీ విత్తనం అలాగే నిలిచి వుంది. దీన్ని నాటితే, తిరిగి మొలకెత్తగలదు. కనుక ఆమ్రపాలీ ! జీవితంలో వయస్సు,

అందం శాశ్వతం కాదు. భోగభోగ్యాలూ అశాశ్వతం. కానీ యీ విత్తనం వంటి నీ జీవితాన్ని తృప్తితో, ప్రశాంతంతో కొనసాగించగల అవకాశం నీ మనస్సుకే చెంది వుంది. కనుక నీవు నీ జీవితాన్ని సంఘారామానికి అంకితం చేసుకొని, సంఘ శ్రేయస్సుకు వినియోగించవలసింది' ' అని బోధించాడు.

ఆమ్రపాలి విచలితురాలైంది. బుద్ధుని బోధనలు ఆమెను ఊరడించాయి. వెంటనే బౌద్ధ దీక్ష తీసుకుంది. తనకున్న ఆస్తి, సంపదనంతా సంఘారామానికి వ్రాసి యిచ్చింది. ఆమ్రపాలి బౌద్ధ భిక్షుకి అయింది.

## వసంత సేన

ఆపదలో వున్న వారిని, అనాథల్ని, సంఘ బహిష్కృతుల్ని, బౌద్ధులు ఆదరించాలనీ, వారిని ఊరడించి, వారిలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందింపజేయాలనీ, సమాజంలోని ప్రతి ఒక్కరిపట్ల మానవతను చూపాలని బుద్ధ భగవానుడు తన శిష్యులకు పదే పదే ఉద్బోధించేవాడు. కరుణామయుడైన బుద్ధుని ఉపదేశాల్ని ఆయన శిష్యులు ప్రాణపదంగా భావించి, ఆచరణలో పెట్టేవారు.

బుద్ధుని ప్రియమైన శిష్యులందరిలోనూ ఆనందుడు పిన్న వయస్కుడు, శౌర్య సామంతుల యింట జన్మించిన ఆనందుడు సహజ సౌందర్యవంతుడు. మిసమిసలాడుతున్న యౌవన ప్రాయంలోనే బుద్ధునికి శిష్యుడైనాడు.

ఒక రోజున వైశాలిలో ఆనందుడు భిక్ష కొరకు నగరంలో పర్యటిస్తూ, ఒక సంపన్న గృహం ముందు నిలిచాడు. వైశాలిలో వర్షాకాలం గడపడానికి బుద్ధ పరివారం నగర సమీపంలోని సంఘారామంలో విడిది చేసి వుంది.

ఆనందుడు భిక్ష కోసం నిలిచి వున్న గృహం వైశాలి నగరంలో ప్రసిద్ధి చెందిన నగర వేశ్య వసంతసేనది. వసంత సేన తన అపురూప లావణ్యంతో సామంతుల్ని, ధనికుల్ని ఆకర్షించి, సంపన్నులైన విటుల నుంచి, అంతులేని సంపదను ఆర్జించింది. వైశాలిలోని సంపన్నులలో వసంతసేన కూడా ఒక సంపన్నురాలిగా పరిగణింపబడింది. విలాసవంతమైన భవనంలో, వసంతసేన భోగభాగ్యాలతో జీవితాన్ని గడుపుతోంది.

తన భవనంపై అంతస్తు మండి, కిటికీ వద్ద వయ్యారంగా కూర్చుని వీధి వైపు చూస్తూ వుండిపోయిన వసంత సేనకు, ఆ వీధిలో భిక్షాటన చేస్తున్న ఆనందుడు ఆమె కంటపడ్డాడు. ముండనం చేయించుకొని, కాషాయాంబరాలు ధరించి వున్నప్పటికీ, ఆనందుని తేజస్సు, సౌందర్యం వసంతసేన హృదయాన్ని పరవశింపజేసాయి. కన్నార్పకుండా ఆనందుని వైపే చూస్తున్న వసంత సేనకు, ఆనందుడు తన యింటికే భిక్ష కోసం వచ్చి నిలుచున్నాడని గమనించింది.

వెంటనే వసంతసేన స్వయంగా తనే భిక్ష తీసుకొని పళ్లెరంలో గబా గబా వీధి వాకిటకు వచ్చి, ఆనందునకు భిక్ష పెడుతూ "పిన్న వయస్సులోనే మీరు దీక్ష తీసుకున్నారే" అని ప్రశ్నించింది.

"బుద్ధ భగవానుని సేవకు పిన్నా, పెద్దా వయస్సు తేడా ఏముంటుంది ? బుద్ధుని శిష్యుడిగా వున్నందుకే ఆనందిస్తున్నాను" అని అన్నాడు ఆనందుడు.

"నీ పేరు ?"

"ఆనందుడు"

"బుద్ధ పరివారం ఎంత కాలం వైశాలిలో వుంటుంది ?"

"ఈ వర్షాకాలం అంతా యిక్కడే వుంటాం".

"అయితే నీవు భిక్ష కోసం యీ వీధి అంతా తిరగవక్కరలేదు. సరాసరి మా యింటికే రావలసిందిగా కోరుతున్నాను. మీకు ప్రతి దినం సరిపడా భిక్ష నేనే సమకూరుస్తాను. ఇది నా విన్నపం" అంది వసంతసేన.

"అలాగే" అన్నాడు ఆనందుడు.

వెళ్లిపోతున్న ఆనందుని వైపు తదేకంగా చూస్తూ వుండిపోయింది వసంతసేన.

మరుసటి రోజు ఆనందుడు ఆ వీధిలో భిక్షాటన చేస్తూ వసంతసేన యింటి ముందు నిలుచున్నాడు. ఆసమయం కోసమే ఎదురుచూస్తున్న వసంతసేన గబగబా ఆనందుని వద్దకు వెళ్లి భిక్ష యిచ్చింది. వసంతసేన తనవైపు ఆర్తిగా చూడడం ఆనందుడు గమనించాడు.

"రేపు ఇదే వేళకు నీ కొరకు ఎదురు చూస్తుంటాను" అంది వసంతసేన.

ఆనందుడు చిరునవ్వుతో అక్కడినుండి కదిలిపోయాడు.

కొన్నాళ్లిలాగ గడిచాయి.

ఒకరోజు ఆనందుడు భిక్ష కొరకు వసంతసేన యింటికి వచ్చాడు. అంతకుముందు రెండు రోజులుగా ఆనందుడు భిక్షకు రాలేదు.

"భిక్షూ ! నీవు రెండు రోజులు భిక్షకు రాలేదేం ? నేను నీ కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురుచూసాను" అంది వసంతసేన.

ఆనందుడు నిర్వికారంతో "రెండు రోజులు నాకు జ్వరం కాసింది. అందువల్ల రాలేదు' ' అన్నాడు.

వసంతసేన విచారంతో ఆనందుని వైపు చూసింది.

"ఆనందా ! ఈ రెండు రోజులు నేను నీకు జ్ఞప్తికి రాలేదా ?"

"రోజూ భిక్షకు వస్తున్నాను గదా ! భిక్ష తీసుకొనే సమయానికి గుర్తుకు వచ్చేదానివి" అన్నాడు ఆనందుడు.

"భిక్షూ ! యీ పిన్న వయస్సులో నీకు యీ సన్యాస దీక్ష వ్యర్థం. అనవసరంగా శరీరాన్ని కష్టపెట్టుకుంటున్నావు" అంది లాలనగా.

"కాదు, బుద్ధ దీక్ష నాకు పరమానందంగా వుంది, దీన్ని నా జీవితాశయంగా భావిస్తున్నాను" అన్నాడు ఆనందుడు.

"నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను, ఆనందా ! నా మనస్సును నీవు గ్రహించడం లేదా ?"

"ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నెలకొని వుంటుంది. వసంతసేనా ! జగత్తు ప్రేమమయమైంది" అన్నాడు ఆనందుడు.

ఆనందుని మాటలు వసంతసేనకు తృప్తినివ్వలేదు.

"నీవు నన్ను ప్రేమిస్తున్నావా ? లేదా ! నాకు సూటిగా జవాబు చెప్పగోరుతున్నాను" అంది వసంతసేన నిగ్గదీసి.

"ప్రేమిస్తున్నాను, వసంతసేనా! బౌద్ధులకు ఈ జగత్తంతా ప్రేమమయంగా కనిపిస్తుంది'

"అలా కాదు. నేను అందంగా వున్నానా? లేనా"

"నీవు సౌందర్యరాశివి. ఇందులో సందేహమేముంది ?"

వసంతసేన హృదయం ఉప్పొంగింది.

ఆనందుడు భిక్ష స్వీకరించి, మెల్లిగా అక్కడినుండి కదిలివెళ్ళిపోయాడు. "నిన్ను ప్రేమిస్తున్నాను, వసంతసేనా !" అనే పదమే వసంతసేనకు పదే పదే గుర్తుకు వస్తూ ఆ రోజంతా తన్మయత్వంలోనే గడిపింది. అంతకుమించి ఆనందునిలో తనపట్ల మరే స్పందన కనిపించకపోవడం వసంతసేనను ఆశ్చర్యంలో ముంచెత్తింది. తన పొందు కోసం వైశాలి నగరం తహతహలాడుతుంది. తన క్రీగంట చూపుకోసం సామంతులు, ధనిక శ్రేష్టులు, సంపన్నులు ఎదురుచూస్తూ, తన పిలుపు కోసం పడిగాపులు పడుతూ వుంటారు. ఈ భిక్షువు మాత్రం తనపట్ల యింత ఉదాసీనత వహించడానికి కారణమేమి ? తన మనస్సు యీ భిక్షువు కోసం పరితపించడమేమి ? మనస్సు ఎంత విచిత్రమైంది. అంటూ వసంతసేన ఎంతగానో ఆనందుని ఆలోచనలతోనే గడపసాగింది. తను ఎంతగా మరచిపోదామన్నా, ఆనందుని దివ్య స్వరూపమే తన కళ్లకు కనిపిస్తోంది.

ఆ మరుసటి రోజు ఆనందుడు భిక్ష కొరకు యధావిధిగా వసంతసేన యింటి ముందు నిలబడ్డాడు. భిక్ష తీసుకొని వసంతసేన అతని ముందుకు వచ్చి భిక్ష యిచ్చింది.

"ఆనందా ! నీవు యీ సన్యాసాశ్రమమాన్ని వదిలిపెట్టి, నాతో వుండటం నీకిష్టమేనా ?' ' అని సూటిగా ప్రశ్నించింది.

ఆనందుడు ఎలాంటి ఉద్రేకానికి లోనుకాకుండా చిరునవ్వు నవ్వి "నీవు కూడా బౌద్ధ భిక్షుకిగా పరివర్తన చెందితే సంతోషిస్తాను" అన్నాడు.

"అప్పుడు సంఘారామంలో పదుగురి భిక్షువుల మధ్యనే మనం కూడా గడపాలి. గదా! నేను కోరుతున్నది సంఘ జీవితం కాదు. కేవలం మన యిద్దరం కలసి ఏకాంతంగా, ఆనందంగా, భోగమయ జీవితాన్ని గడపాలని అడుగుతున్నాను'' అంది వసంతసేన.

"శారీరక సుఖాలు, భోగభాగ్యాలు శాశ్వతం కాదు. వసంతసేనా! కోరికలు కళ్లెం లేని గుర్రాల వంటివి. మన పయనం గమ్యం లేనిదవుతుంది''.

"మరి, నన్ను ప్రేమిస్తున్నానని చెప్పావు కదా !'' అంది వసంతసేన.

"అవును, ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. ఎలాంటి ప్రతిఫలం ఆశించని, నిర్మలమైన మనస్సుతో ప్రేమిస్తున్నాను'' అంటూ ఆనందుడు మెల్లిగా సాగిపోయాడు.

ఆనందుడు తనకు అర్థం కావడంలేదు. "బౌద్ధులకు కామవాంఛలు వుండవు గదా. ఈ యువ సన్యాసి కూడా అంతేనేమో !'' అనుకుంది.

కొన్నాళ్లు ఆనందుడు భిక్షకు రాలేదు. మరి కొన్ని రోజులు గడచిపోయాయి. క్రమంగా వసంతసేన కాలంతోపాటు ఆనందుని గురించిన ఆలోచనల్ని మరచిపోయింది.

ఇంతలో వసంతసేనకు దుర్దశ సంప్రాప్తించింది. వైశాలి నగర సభ వసంతసేనపై అభియోగాన్ని మోపింది. వైశాలి రాజ్యంలోని కొందరు పలుకుబడి గల సంపన్నులు వసంతసేనపై తీవ్రమైన ఆరోపణలతో, అభియోగం తెచ్చారు. విచారణ అనంతరం వసంతసేనపై వచ్చిన ఆరోపణలు రుజువు చేయబడినవి. ఫలితంగా వసంతసేన ముక్కు, చెవులు కోసి, ఆమెకు సంబంధించిన యావదాస్తిని స్వాధీనం చేసుకొని, దేశ బహిష్కారం చేయవలసిందిగా న్యాయమూర్తులు తీర్పు చెప్పారు.

శిక్ష అమలుపరచబడింది.

వసంతసేన ముక్కు, చెవులు కోసి, రాజభటులు నిర్దాక్షిణ్యంగా వంటరిగా ఆమెను నగర పొలిమేరలు దాటించి, వదిలివేసారు.

వసంతసేన గుండెలు పగిలేలా ఏడ్చింది. తనకెవరు దిక్కు ? ముక్కు, చెవులు కోయడం ద్వారా తన శారీరక అందాన్ని వికృతపరచడం జరిగింది. తన సంపదనంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. కట్టుబట్టలతో యీనాడు యిక్కడ నగరం వెలుపల వదిలివేయబడింది. తన జీవితం ఏంకాను ? తన బ్రతుకు సర్వనాశనం అయింది. నిన్నటిదాకా వైశాలి నగరంలోని ప్రతి ఒక్కరూ తన కోసం ఏ త్యాగం చేయడానికైనా సిద్ధపడ్డారు. కానీ, ఈ వికృత రూపంతో వున్న వసంతసేన వైపు ఎవరూ కూడా కన్నెత్తి చూడలేదు.

"భగవాన్'' అంటూ రెండు చేతులతో ముఖాన్ని కప్పుకొని, గుండెలవిసేట్టు రోదిస్తూ, ఎటు వెళ్లాలో, ఏమి చేయాలో తోచక, అనాథగా మిగిలిపోయింది వసంతసేన.

అప్పుడు ప్రేమపూరితమైన కంఠంతో "వసంతసేనా !" అంటూ మృదువుగా ఒకస్వరం ఆమెకు వినిపించింది. "ఎవరూ" అంటూ ఆశ్చర్యంతో వెనుదిరిగి చూసింది.

"నేను, ఆనందుడ్ని !" అంటూ ప్రేమగా ఆమె తలపై చేత్తో నిమిరాడు.

వసంతసేన అంత దుఃఖంలోనూ, వెర్రిగా నవ్వుతూ "పిచ్చి ఆనందా ! అంతా అయిపోయాక యిప్పుడు వచ్చావా ! చూడు, నా ముఖ సౌందర్యం ఏమైంది ? నేను పూర్వపు వసంతసేననే అనుకుంటున్నావా ? నీ ప్రేమ కవాటాల్ని ఆలస్యంగా తెరచావు, ఆనందా !' ' అని వెక్కివెక్కి ఏడ్చింది. "యిప్పటికీ నన్ను ప్రేమిస్తున్నావా, ఆనందా !" అని అడిగింది.

ఆనందుడు చిరునవ్వు నవ్వుతూ "అవును. ఇప్పుడు నిన్ను మరింతగా ప్రేమిస్తున్నాను, వసంతసేనా ! నా ప్రేమ నీకు యిప్పుడే కావాలి. నిష్కల్మషమైన ప్రేమకు శారీరక సౌందర్యంతో పనిలేదు. నేను నీ అంతఃసౌందర్యాన్ని మాత్రమే, ఎలాంటి ప్రతిఫలాక్ష లేకుండా ప్రేమిస్తున్నాను" అన్నాడు.

వసంతసేన ముకుళిత హస్తాలతో "ఆనందా ! ఈ ప్రపంచంలో నువ్వొక్కడివే, నాకు ఆత్మీయుడిగా మిగిలావు. జీవితంపైన మమకారాన్ని వదిలి, ఆత్మహత్యకు నేను సిద్ధపడే సమయంలో నీవు వచ్చి, నన్ను ప్రేమతో పలకరించావు, అంతేచాలు ? ఆనందం" అంటూ ఆనందునివైపు దయనీయంగా చూస్తూ నిలబడింది.

"నేను యింతకుముందే చెప్పాను. వసంతసేనా ! శారీరక సౌందర్యం. భోగభాగ్యాలూ శాశ్వతం కాదు. కాంక్షతో కూడినది కాముకత్వం, కోరిక స్వార్థాన్ని ఆశిస్తుంద. కానీ ప్రేమ ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించదు. అది నిష్కల్మషమూ, త్యాగపూరితమూ అయినది. ప్రేమ శాశ్వతమైని. నీకు యిప్పుడెవరూ లేరని విచారించవద్దు. బౌద్ధ సంఘారామం నిన్ను ఆహ్వానిస్తుంది. సంఘారామం ఒడిలో నీవు ఓదార్పు, విశ్రాంతిని పొందగలవు. బౌద్ధ భిక్షుకిగా నీవు నీ జీవితాన్ని తృప్తిగా గడపవలసింది, పద, వెళదాం !" అంటూ ఆనందుడు మెల్లిగా వసంతసేనను నడిపించుకుంటూ, సంఘారామం వైపు దారితీసాడు.

సంఘారామం చేరిన తదుపరి "వసంతసేనా ! అడుగో ! బుద్ధ భగవానుడు. ఆయన పాదాల చెంత కూర్చుని, ఆ దయాసాగరుని ఆశీస్సులు పొందవలసింది" అంటూ వసంతసేనను బుద్ధభగవానుని వద్దకు తీసుకొనివెళ్లాడు.

వసంతసేన చేతులు జోడించి, బుద్ధ భగవానుని సమీపించి, ముందుకు వంగి, ఆయన పాదాలపై వాలిపోయింది.

బుద్ధుడు తన అమృత హస్తాలతో వసంతసేన తలపై నిమురుతూ "ఆనందా, వసంతసేనకు దీక్షను యిప్పించు" అని అన్నాడు.

పతితులకు, భ్రష్టులకు, సంఘ బహిష్కృతులకు, దిక్కులేని వారికీ సంఘారామం ఆశ్రయం యిచ్చి ఆదరిస్తుంది.

ఇదే బౌద్ధం యొక్క విశిష్టత !

## మహాకాశ్యపుని కథ

బౌద్ధంలో ఆడంబరాలకు, భేషజాలకు తావులేదు. ఆకర్షించే పద్ధతులను, యితరులను మభ్యపరచడం, ఆశ్చర్యపరచడం వంటి ప్రక్రియలను కూడా బుద్ధుడు నిరసించేవాడు. వాస్తవికత, నిరాడంబరత, సచ్ఛీలం బౌద్ధులు అలవర్చుకోవాలని బుద్ధ భగవానుడు శిష్యులకు ఉపదేశించాడు.

బుద్ధుని శిష్యుల్లో మహాకాశ్యపుడు పొడగరి, బలిష్టమైన శరీరం, తేజస్సు కలవాడు. కానీ ఆయన తన శరీర సౌష్ఠవాన్ని గురించి గర్వపడుతూ వుండేవాడు. ఇతరులు తనవైపు చూడాలనీ, తన అందచందాన్ని పొగడాలనీ తాపత్రయపడేవాడు.

బుద్ధుని ఉపదేశం వినడానికి పరిసర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారు. స్త్రీలు, పురుషులు, చిన్నా, పెద్దా అని లేకుండా బుద్ధుని దర్శించడానికి కుతూహలపడేవారు.

తథాగతుని బోధనలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొనేవి.

ఉపదేశ సమయంలో మహాకాశ్యపుడు, ఆనందుడువంటి శిష్యులు సభలో వున్న ప్రజల్ని సభ జరగడానికి అనువుగా సర్దుబాటు చేస్తూ వుండేవారు. స్త్రీలను ఒకవైపు, పురుషుల్ని మరొకవైపు కూచోబెట్టి, భగవానుని సందేశం అందరికీ వినిపించే ఏర్పాట్లు చేసేవారు.

ఒకనాడు మహాకాశ్యపుడు, నూతన కాషాయ వస్త్రాన్ని ధరించి, సభికుల మధ్య తిరుగుతూ, తన ఆధిక్యతను వెల్లడి చేసుకుంటూ, ముఖ్యంగా స్త్రీల విభాగంలో తిరుగుతూ వుండటం బుద్ధుడు గమనించాడు. మహాకాశ్యపుని అతిశయం, నూతన వస్త్రధారణ అంతా బుద్ధుడు చూస్తూ మధ్య మధ్య అతన్ని పరిశీలిస్తూనే ఉన్నాడు.

మహాకాశ్యపుడు సభ యావత్తూ కలియతిరుగుతూ దగద్ధాయమానంగా మెరుస్తున్న తన నూతన కాషాయాంబర వస్త్రధారణను పదుగురూ చూడాలన్న కాంక్షను కొట్టవచ్చినట్టు కనబరుస్తూ ఆర్భాటం చేస్తూనే వున్నాడు.

సభ ముగిసింది. ప్రజలందరూ వెనుదిరిగి వెళ్లిపోయారు. శిష్యులు సంఘారామంలో పనులు చూస్తున్నారు. బుద్ధ భగవానుడు ఉచితాసనంపై కూచునీ"కాశ్యపా" అని పిలిచాడు.

"భంతే" అంటూ కాశ్యపుడు వినయంగా వచ్చి బుద్ధుని ఎదుట నిలుచున్నాడు". ఈ నూతన కాషాయ వస్త్రం నీకు బాగా నచ్చింది కదూ" అన్నాడు. "చాలా బావుంది" అన్నాడు.

మహాకాశ్యపుని కళ్లల్లో కాంతి వెల్లివిరిసింది.

"ఈ వస్త్రం మీరు ధరించండి. భంతే" అన్నాడు వినయంగా.

"మరి నీవు ఏమి ధరిస్తావు" అని అడిగాడు.

"మీరు ధరించిన వస్త్రం యిచ్చినా, చాలు" అన్నాడు కాశ్యపుడు.

ఆ సమయంలో బుద్ధుడు ధరించి వున్న వస్త్రం బాగా మాసిపోయి, చిరుగులతో, ఏ మాత్రం ధరించడానికి వీలులేకుండా వుంది.

"ఈ వస్త్రం నీకు అందాన్నివ్వదు, కాశ్యపా ! నేను ధరించిని జీర్ణ వస్త్రం కదా !" అని అన్నాడు.

మహాకాశ్యపుడు సిగ్గుపడ్డాడు.

శిష్య పరివారం ఎవరి పనుల్లో వాళ్లు వున్నారు.

మహాకాశ్యపుడు ఒక్కడే బుద్ధుని సమీపంలో ఉపనిష్టుడై వుండగా, సాటి శిష్యులకు ఆ సమయంలోనే, కాశ్యపునిలోని బలహీనతల్ని గురించి హెచ్చరించాలని బుద్ధుడు తలంచాడు.

"రాజ కుటుంబంలో జన్మించి, రాజభోగాలు అనుభవించిన తమరు, యీ జీర్ణ వస్త్రం ధరించగా లేనిది, నాకు వర్జనీయం కాదు గదా, భంతే !"

"మనం సన్యాసులం ! బౌద్ధులం, మనకు సంపదా, లేమి సమానమే, కాశ్యపా ! భోగభాగ్యాలూ, తుదకు జీవితమే నశ్వరం కదా".

"తమ ఉపదేశమే, మాకు శిరోధార్యం, భంతే".

"శరీరం మీద ప్రేమ, అందచందాల పట్ల అనురాగం, యౌవనకాంతుల మీద మమత ఉండరాదు. మమతా, సరాగాల్ని వదిలిపెట్టకుండా, పరిపూర్ణత, నిర్వాణం లభించదు. నిష్కామం మనిషి పరిపూర్ణతకు సోపానం, కాశ్యపా" అన్నాడు బుద్ధుడు.

బుద్ధుని ఉపదేశం వల్ల మహాకాశ్యపునిలో దాగివున్న మానవ బలహీనతలు పటాపంచలు కాసాగాయి.

"స్నానానికి వేళయింది, కాశ్యపా" అంటూ బుద్ధుడు లేచి స్నానవాటికవైపు సాగిపోయాడు. మహాకాశ్యపుడు తాను ధరించిన నూతన వస్త్రాన్ని పిండి, ఆరవేసి ఉంచాడు.

బుద్ధుని స్నానానంతరం తన నూతన వస్త్రాన్ని బుద్ధునికి ధరించేందుకు అందించాడు. బుద్ధుడు దాన్ని ధరించాడు. మహాకాశ్యపునికి కష్టం కలగకుండా, అతనికి తృప్తి కలిగేందుకు బుద్ధుడు దాన్ని అందుకొని, ధరించి నట్లు మహాకాశ్యపుడు గ్రహించాడు. బుద్ధుని గొప్పతనమూ, శిష్యుల పట్ల ఆయనకు గల అపార ప్రేమాభిమానాలకు కాశ్యపుడు పులకించి పోయాడు.

అప్పటినుంచీ బుద్ధుని ఉపదేశసందర్భంలోనూ, సభలూ సమావేశాల్లోనూ మహాకాశ్యపుడు అతి నిరాడంబరంగా, నిర్మలమైన మనస్సుతో మెలగసాగాడు. తన శిష్యుల ప్రవర్తన పట్ల, ముఖ్యంగా నైతిక విలువల్ని అలవర్చుకోవడంలో, నిర్మల మనస్సు కలిగి వుండడానికి బుద్ధుడు శ్రద్ధ తీసుకునేవాడు. శిష్యుల మంచి చెడ్డలన్నీ బుద్ధుడు తనవిగానే భావించేవాడు.

ఈ సంఘటన మహాకాశ్యపుడు తన జీవితాంతము గుర్తు పెట్టుకోవడమే కాదు, బుద్ధుని జీర్ణవస్త్రాన్ని తను భద్రంగా దాచుకున్నాడు. అంతేకాదు బుద్ధుని మహా పరి నిర్వాణనంతరం కూడా దాన్ని తన వద్దనే వుంచుకొని, రాబోవు బుద్ధునికి (మైత్రేయ

బుద్ధుడు) అందించేందుకు నేటికీ గృధకూట పర్వతాల్లో ఎదురుచూస్తున్నాడని బుద్ధగాథల్లో వర్ణించబడింది.

బుద్ధుడు మహాపరినిర్యాణం చెందిన తదుపరి, అజాతశత్రు మగధ రాజధాని రాజగృహంలో బౌద్ధులనందర్నీ సమావేశ పరిచి, ప్రథమ బౌద్ధ సంగీతిని నిర్వహించాడు. ఈ ప్రథమ సంగీతికి మహాకాశ్యపుడే అధ్యక్షత వహించాడు. బుద్ధుని బోధన లన్నిటినీ క్రోడీకరించి, భూర్జపత్రాల మీద, తాటాకులపైనా సంకలన పర్చిందీ కూడా మహాకాశ్యపుడే.

బుద్ధునికి అత్యంత ఆప్తుడు మహాకాశ్యపుడు.

## బింబా వృత్తాంతం

బుద్ధుని ఎలాగైనా అప్రతిష్ట పాలు జేయాలని బ్రాహ్మణ పౌరోహిత వర్గం నిరంతరం ఆయనకు వ్యతిరేకంగా ప్రవర్తించుచూ, సంఘారామానికి అనేక కష్టనష్టములను కలిపిస్తూ ఉండేది. ఎందుకనగా బుద్ధుడు వర్ణ వ్యవస్థను ఖండించడం, కుల వ్యవస్థను వ్యతిరేకించడం, మానవులంతా సమానమేనని చెప్పడం పౌరోహిత వర్గానికి మింగుడు పడలేదు.

బుద్ధుడు వైశాలిలో విడిది చేసినప్పుడు ఒకసారి వర్షాకాలమంతా గడపవలసి వచ్చింది. ప్రతినిత్యమూ సంఘారామం వద్ద సాయంత్రం బుద్ధుని ఉపదేశాలు వుండేవి. చుట్టుప్రక్కల ప్రజలందరూ వచ్చేవారు. కొందరు రాత్రి గడిస్తే సంఘారామంలోనే గడిపి వెళ్లేవారు.

అక్కడికి ప్రతిరోజు 'బింబా' అనే యువతి కూడా క్రమం తప్పకుండా బుద్ధుని బోధనలు వినడానికి వస్తూ వుండేది. బాగా ప్రొద్దుపోయే దాకా సంఘారామంలో గడిపి, తదుపరి యింటికి వెళుతూ వుండేది. ప్రతి రోజూ బుద్ధునికి శ్రద్ధగా పాలు, పండ్లు తెచ్చేది.

బింబా అందగత్తె. బాగా అలంకరించుకొని, యినుమడించిన సౌందర్యంతో బుద్ధునికి అతి సమీపంలో కూచుని వుండేది. అడిగినా, అడగకపోయినా, తనే కల్పించుకొని, అవసరమైన సమయాల్లో బుద్ధునికి సేవలు చేస్తూ వుండేది. బుద్ధుని శిష్యులు బింబాను గమనిస్తూనే వుండేవారు. కొందరు ఆమెకు బుద్ధుని యెడల భక్తిభావం వల్ల అత్యంత సన్నిహితంగా మెలుగుతుందని సరిపెట్టుకొనేవారు.

ఒక్కోరోజు బాగా పొద్దు పోయాక, మరొకసారి తెల్లవారు ఝామున సంఘారామం నుండి బయటకు వచ్చి, యింటికి వెళుతూ వుండేది. ఎవరైనా "యింత పొద్దు పోయిందాకా వున్నావేమి? బింబా" అని ప్రశ్నించేవారు. "బుద్ధ భగవానుని సేవలు చేసుకునేప్పటికి యింత రాత్రయింది" అనేది.

"శిష్యులున్నారు గదా!

"భగవానునికి నా సేవలంటేనే యిష్టం" అనేది.

సంఘారామంలో కూడా బుద్ధునికి సంబంధించిన ప్రతి విషయములోనూ జోక్యం చేసుకుంటూ వుండేది. కావాలని బుద్ధ భగవానునికి అవసరమైన వాటిని అందిస్తూ ఉండేది.

ఆయనకు సమీపంలో కూచుని, వస్తువుల్ని అందించేది. ఒక్కోసారి 'విశేషదినం' వున్నప్పుడు ఆరాత్రి అక్కడే నిద్రించేది. తెల్లవారి నలిగిన దుస్తులతో, వాడిన పూలు తలపై జాలువారుతూ వుండగా, వయ్యారంగా వెళుతూ, ప్రతి ఒక్కరూ తనని గమనించాలనే ప్రయత్నంలో వుండేది.

"బింబా! రాత్రి సంఘారామంలోనే నిద్రించావా?"

"అవును! బుద్ధభగవానుని యిష్టం మీదనే వున్నాను. ఆయనకు సేవలు చేసేప్పటికే బాగా ప్రొద్దుపోయింది. నేను బుద్ధుని శయ్యాగృహం వద్ద వుండవలసి వచ్చింది".

"నీకు అంత బాధ్యతను అప్పగించారా?"

"ఒకరు అప్పగించే దేమిటి? భగవానునికి యిష్టమైంది. నాకు ఆనందంగా వుంది. మధ్య మీకెందుకు?" అని విసుక్కునేది. బుద్ధునికి ప్రియమైన దాన్ని. ఆయన ఆంతరంగిక సఖిని" అనే ధోరణిలో, అలా అర్థం వచ్చేట్లు జవాబులు చెప్పేది. ఇందుకు అనుకూలంగా కొందరు బ్రాహ్మణ పౌరోహితులు "బింబా" వ్యవహారాన్ని గురించి నగరంలో పుకార్లు వ్యాపింప చేసారు. పౌరోహితులు బింబా కలసి యీ నాటకం ఆడుతున్నారని యితరులు గమనించలేదు.

బుద్ధభగవానుడే కావాలని "బింబా"ను రాత్రిళ్లు సంఘారామంలో తన వద్ద వుండమని కోరుతున్నాడని కూడా పుకార్లు వ్యాపింప చేశారు. బుద్ధుని శిష్యులు రాను రాను "బింబా" ధోరణికి అసంతృప్తులై యీ విషయాన్ని బుద్ధుని ముందు ప్రస్తావించలేక 'బింబా' ఒక కంట కనిపెట్టి వుండేవారు.

"బింబా సంఘారామంలో మితిమీరి జోక్యం చేసుకుంటున్నది భగవాన్!" అని బుద్ధుని ఆంతరంగిక శిష్యులు అనేవారు.

"- ఎవరి మనస్సునైనా నొప్పించడం బౌద్ధులకు కూడదు గదా! చివరికి వారి మితిమీరిన తనమే వారిని దూరం చేస్తుంది" అని బుద్ధుడు చెప్పేవాడు. "ఒకరిని ఆంక్షపెట్టి, సంఘారామానికి దూరంగా వుంచడం బౌద్ధ సాంప్రదాయం కాదు", సంఘారామం ప్రతి ఒక్కరిది" అనే భావం ప్రతి ఒక్కరిలో కలగాలి. అది ముఖ్యం. ఇందులో కొందరికి ప్రమాదం వున్నది. కొందరికి లేదు. అనే భావం "విశాల భావానికి ఆటంకం గదా" అని బుద్ధుడు చెప్పేవాడు.

రోజులు గడిచే కొలదీ "బింబా" మరింత విచిత్రంగా ప్రవర్తించేది. ఆమెకు సన్నిహితులు "బింబా"ను తేరిపార చూసినప్పుడు పొట్ట లావుగా కనిపిస్తే, "బింబా గర్భం ధరించావా? ఎన్నో నెల" అని అడిగేవారు.

బింబా విసుక్కునేది. చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ "అయినా నాగర్భం సంగతి మీకెందుకు? అది బుద్ధునికి, నాకూ సంబంధించిన విషయం" అనేది. బింబా నాలుగైదు నెలల గర్భిణిగా కనిపించేది.

"ఇదేమి నాకు కొత్త కాదు. గతంలో బుద్ధభగవానుడు వైశాలి సందర్శించినప్పటి నుండి, బుద్ధునితో నాకు వ్యక్తిగత సంబంధం వుండేది" అని చెప్పేది. ప్రజల్లో, సంఘారామానికి నిత్యం బుద్ధుని బోధనల కొరకు వచ్చే వారందరిలో "బింబా' బుద్ధునికి అత్యంత సన్నిహితంగా, రాత్రిళ్లు కూడా బుద్ధుని శయన గృహానికి సమీపంలో తచ్చాడుతూ వుండడం, ఎవరూ నిద్ర లేవక మునుపు 'బింబా' ఆయన శయనగృహ సమీపంలో కనిపిస్తూ తచ్చాడటం అనుమానాలకు దారి తీసింది.

"భగవానునితో బింబా సంబంధం ఏమిటి?" అని ప్రశ్నించేంతవరకూ 'బింబా' ప్రవర్తన మితిపోరి పోయింది. 'బింబా' బహిరంగాగానే బుద్ధునికి సంబంధించి, వ్యక్తిగత విషయాల్ని ప్రస్తావిస్తూ వుండేది. "నేనే బుద్ధునికి సర్వస్వం" అనేట్టుగా ఆమె మాటలు ధ్వని వుండేది. 'బింబా' ఆరేడు నెలల గర్భిణిగా తయారైంది. సంఘారామంలో కలకలం వ్యాపించింది.

బుద్ధునికి సన్నిహత శిష్యులు యీ పుకార్లను భరించలేక పోయారు. "బింబా"ను సంఘారామానికి దూరంగా వుంచాలని ప్రయత్నించేవారు. అప్పుడు బింబా యిలా అనేది. "యింత జరిగిన తర్వాత నేను బుద్ధునికి ఎలా దూరం కాను, నా కడుపులో పెరుగుతున్న బిడ్డ గతేం కాను" అని అంటూ వుండేది.

ఒక రోజు పెద్ద సమావేశం ఏర్పాటైంది. విశేష దినాలుగా మూడు రోజులు బుద్ధుని ముఖ్య ప్రసంగాలు జరుగుతున్నాయి. వేలాదిమంది ప్రజలు బుద్ధ సందేశాన్ని వింటూ వుండిపోయారు.

"బింబా" ఎప్పటిమాదిరిగానే బుద్ధునికి సమీపంలో వుంటూ, ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటూ బుద్ధుని వ్యక్తిగత విషయాల్ని తనే పట్టించుకున్నట్లు ప్రవర్తించ సాగింది. ఎవరైనా "బుద్ధ సాన్నిహిత్యం" గురించి ప్రశ్నిస్తే "నేనిప్పుడు ఆరునెలల గర్భవతిని! నాకంటే బుద్ధునికి కావలసిన వారెవరు?" అని సమాధానం చెప్పేది.

నిండు సభలో అక్కడక్కడా "బింబా" తన గర్భధారణను గురించి బాహాటంగా చెప్పడం విన్న బుద్ధుని శిష్యులు యిక సహించ లేకపోయారు. "భంతే, యిక ఎంతమాత్రం మిన్నకుండరాదు" అని అన్నారు.

బింబాను కొందరు నిలదీసి ప్రశ్నించారు.

"నీవు భగవానుని గురించి అసత్య ప్రచారం చేస్తున్నావు. నీవు బుద్ధ భగవానునితో సంఘారామంలో రాత్రిళ్లు గడిపానని, అందువల్ల తనకు గర్భం వచ్చిందని చెబుతున్నావా? ఏమిటి నీ ఉద్దేశం"

"ఇందులో అబద్ధం ఏముంది? అయిన భగవానునికి యిష్టమైంది, నాకు సంతోషమే, మధ్యలో మీకెందుకు? కంటగింపు" అని బింబా సమాధానం చెప్పింది.

బుద్ధుని వద్ద యీ విషయాన్ని ప్రస్తావించారు.

బింబాను బుద్ధ భగవానుని వద్ద ప్రవేశపెట్టారు.

"నాకు గర్భం వచ్చిన మాట నిజమే" అంది బింబా.

ఈమె గర్భధారణను గురించి భిక్షుకి సన్యాసినులు పరీక్షించమని భగవానుడు ఆదేశించాడు. ఒకవేళ నిజంగా బింబాకు కలగబోయే సంతానం అనాధ అయితే, ఆ బిడ్డకు తండ్రిగా, సంరక్షకుడిగా వుండడానికి నేను సిద్ధమే. కారణం ఏమనగా అనాధలకు, సంఘచ్యుతులకూ మనం రక్షకులమని మరువకండి' అని బుద్ధుడు శిష్యులతో అన్నాడు.

బింబా వేరొక గదిలోకి గొనిపోయి బిక్షుకి స[illegible]సులు "బింబా" చీరెను, శరీరాన్ని తడుముతూ పరీక్ష చేయగా, చీరె మీద చీరెను నాలుగైదు [illegible] ధరించి వున్న 'బింబా'ను యిదేమని ప్రశ్నించారు. పొత్తి కడుపు భాగంలో మరికొన్ని గుడ్డ పీలికలు ఎత్తుగా పెట్టుకొని గర్భం ధరించినట్టు కృత్రిమ వేషంతో కన్పించిన 'బింబా' గర్భధారణ రహస్యం బయట పడింది. అక్కడ వున్న ప్రజలు, శిష్యులు యీ దృశ్యం చేసి విస్తుపోయారు.

'బింబా' కృత్రిమ గర్భం బయటపడగానే బుద్ధని వద్దకు 'బింబా'ను ప్రవేశపెట్టారు. "బుద్ధుని అప్రతిష్ట పాలు చేయడానికి తనను కొందరు బ్రాహ్మణ పౌరోహితులు నియమించినట్టు"బింబా' బయట పెట్టింది. బుద్ధుడు చిరునవ్వు నవ్వుతూ "ఆమె కృత్రిమంలో పడిపోయింది. అది ఏనాటికైనా బయట పడితీరుతుంది. కపటం, దాగదు" అన్నాడు బుద్ధుడు.

"బింబా" తప్పులేదు. అమె అన్యులతో ప్రేరేపించబడింది. ఆమెను ఏమీ అనవద్దు' అన్నాడు భగవానుడు.

బింబా పశ్చాత్తాపంతో బుద్ధుని పాదాలపై పడింది. అసత్యం బయటపడి భగవానునిపై వచ్చిన పుకార్లు విడిపోయినందుకు బుద్ధుని శిష్యులు ఆనందించారు.

రాజ్యాన్ని, అతిలోక సౌందర్యవతి భార్య యశోధరనూ, సర్వ రాజ వైభోగాన్ని బుద్ధుడు కాలదన్ని, యీ విశాల ప్రపంచంలోకి వచ్చాడు. సర్వమానవుల దుఃఖాలకు గల కారణాల్ని అన్వేషించేందుకు ఆయన అనేక ఆశ్రమాల్ని దర్శించేవాడు. పండితులను, ఋషుల్ని, మునుల్ని దర్శించి, వారి వద్ద అనేక సంవత్సరాలు వుండి, అనేక విషయాలు తెలుసుకున్నాడు. ఆరేళ్ళు తపస్సు చేశాడు. స్వీయ మార్గాన, ధ్యాన నిమగ్నుడై యీ సకల చరాచర జగత్తును గురించి, సృష్టి స్థితి లయల గురించి, ప్రాపంచిక, పారమార్థిక విషయాల్ని గురించి తర్కించాడు, ఆలోచించాడు.

ముఖ్యంగా తన కళ్లెదుట కన్పించే యీ సమాజాన్ని, ప్రజల్ని హేతుమార్గంలో విశ్లేషణ చేసాడు. కార్యాచరణవాదాన్ని తనలో తానే తరచి, తర్కించి రూపొందించుకున్నాడు.

సమాజంలోని హెచ్చు తగ్గులూ, వర్ణ వ్యవస్థ, కుల భేధాలు అర్థంలేనివనీ గుర్తించాడు. వాటిని ఖండించాడు. సర్వోన్నతమైన మానవతా వాదాన్ని ప్రచారంలో పెట్టాడు.

అప్పటిదాకా పౌరోహిత వర్గం, పండితులూ, రూపొందించి ఏకపక్షంగా సమాజంలో ప్రచారంలో పెట్టి ఆచరింపచేస్తున్న మిధ్యావాదాన్ని, తన అసమానమైన మేధాపటిమతో తునాతునకలు చేసాడు.

బుద్ధుడు వర్ణ వ్యవస్థని ఖండించినందుకు బ్రాహ్మణ పౌరోహిత వర్గానికి కంటగింపు అయింది. అన్ని కులాల్ని ఏకం చేస్తున్నాడని బుద్ధుని నిందించారు. ఈ కారణంగా బుద్ధుని అప్రతిష్ట పాలు జేయడానికి, ఆలోచల్లోనే అనేక మార్గాల్ని వెతికారు. అనేక ప్రయత్నాలు చేసారు. కానీ వారి ప్రయత్నాలు సాగలేదు.

కారణం బుద్ధుడు సామాన్య ప్రజలందర్నీ తన మతంలో భాగస్వాముల్ని చేసాడు. ప్రజల భాష అయిన 'పాళీ' లో తన బోధనల్ని కొనసాగించాడు. కులాలతో నిమిత్తం లేకుండా అన్ని కులాల ప్రజల్ని తమ ధర్మంలో ప్రవేశ పెట్టాడు. అందువల్ల అశేష ప్రజానీకం బౌద్ధంలో చేరారు. రాజుల దగ్గరనుండి సామాన్య జనుల దాకా బౌద్ధాన్ని ఆదరించారు. ఆకారణంగా అప్పట్లో కొన్ని వర్ణాలలో మాత్రమే ప్రాతినిధ్యంగల హైందవ పౌరోహిత్య వర్గం చేయగలిగిందేమీ లేదు.

అందువల్ల'బింబా' వంటి వాళ్లను తమ పావులుగా వుపయోగించి వున్నా, వెంటనే ఆకుట్ర బట్టబయలయ్యేది. ఆ వెంటనే బింబా' సైతం భిక్షుకిగా పరివర్తన చెందింది. తనకు డబ్బిచ్చి, యీ విధంగా సంఘారామంలో ప్రవేశాన్ని బుద్ధున్ని అప్రతిష్ఠపాలు చేయవలసిందిగా బ్రాహ్మణ పౌరోహిత వర్గం ప్రోత్సాహించిన వైనాన్ని ఆమె బట్టబయలు చేసింది.

ఈ సంఘటన తెలిసిన తరువాత బుద్ధుని ఔన్నత్యం మరింత పెరిగింది. దయామయుడైన బుద్ధ భగవానుడు తన పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిని కూడా క్షమించి, వారిలో మంచి మార్పు తెచ్చేవాడు.

"బింబా' ఉదంతం బుద్ధుని గొప్ప మనస్సును వెల్లడి చేస్తుంది. అదే బౌద్ధం యొక్క మహిమాన్వితమైన దృక్పథంగా గుర్తించ వలసి వుంది.

## మహా పరి నిర్వాణం

బుద్ధునికి వృద్ధాప్యం వచ్చింది. 80 సంవత్సరాల వయస్సుపైబడింది. బుద్ధునికి ఉపచారాలు చేసేందుకు ఒకరి సహాయం అవసరమయింది. శిష్యులు నేనంటే నేనని సిద్ధ పడ్డారు. "నేనే మీ సేవ చేసుకుంటాను, భగవాన్" అన్నాడు సారి పుత్రుడు.

"కాదు, నాకు అవకాశం యివ్వండి భగవాన్" అని ముందుకు వచ్చాడు మొగ్గలాయనుడు. "నాకే యీ అవకాశం, భగవాన్" అన్నాడు మహాకాశ్యపుడు.

బుద్ధుడు దీర్ఘంగా ఆలోచించాడు. మహాకాశ్యపుడు, సారిపుత్రుడు, మొగ్గలాయనులు సంఘంలో చాలా ముఖ్యమైన కార్యకర్తలు, ప్రధాన వక్తలు. సంఘ నిర్వహణ బాధ్యతనంతా వారే నిర్వహిస్తున్నారు. వీరిని తన ఉపచారాలకు తీసుకుంటే సంఘ నిర్వహణ ఆమేరకు కుంటు పడుతుంది. అదీగాక వారు కూడా దాదాపు పెద్ద వయస్సులోనే వున్నారు.

కనుక బుద్ధుని దాయాదీ, యువకుడూ అయిన ఆనందుడు అందుకు తగినవాడుగా బుద్ధుడు తలంచాడు. ఆనందుని తన సహచరునిగా ఎంపిక చేసాడు. ఆనందుడు బుద్ధుని ప్రియతమ శిష్యుల్లో ఒకడు. ఎంతోకాలం బుద్ధునికి ఆనందుడు సపర్యలు చేసాడు. బుద్ధుడు 29వ ఏట సన్యసించాడు. ఆరేళ్లు అడవుల్లో తిరిగాడ సత్యాన్వేషణ చేసాడు. 35వ ఏట బుద్ధత్వం పొందాడు. ఆపైన 45 సంవత్సరాలు సుదీర్ఘకాలం బౌద్ధ ధర్మ ప్రచారం చేసేందుకు ఉత్తర భారతమంతటా పర్యటించాడు. 80వ పడిలో కూడా బుద్ధుడు ధర్మ ప్రచారం కొరకు దేశమంతటా విరివిగా పర్యటిస్తూనే ఉన్నాడు.

తన చివరి రోజులు మల్ల దేశంలో గడిపాడు. మల్ల రాజదాని 'కుశినారా'లో కొంతకాలం ధర్మబోధ గావించాడు. బోజనాలు అయ్యాక కొంతసేపటికి బుద్ధునికి తీవ్రమైన జబ్బు చేసింది. తదుపరి అక్కడికి సమీపంలోని ఒక వూరు వెళ్ళాడు. బుద్ధునకు అవసాన దశ చేరువ అయిందని ఆనందుడు భయపడ్డాడు. "తనకు దిక్కెవరు? భగవాన్" అంటూ ఆనందుడు పసిపిల్లవానిలా రోదించాడు.

"దుఃఖించకు ఆనందా? నా ఉపదేశాలూ, బుద్ధ ధర్మం మీకు మార్గదర్శకాలుగా వుంటాయి" అని బుద్ధుడు ఊరడించాడు. అయితే ఆ జబ్బునుంచి ఆయన కోలుకున్నాడు. మరి కొన్ని రోజులు బుద్ధుడు తీవ్ర ప్రచారంలో పాల్గొన్నాడు.

వైశాలిలోని పరివ్రాజకులందర్నీ సమావేశ పర్చాడు. "ఎవరికి వారే ఆశ్రయం కావాలి, ప్రతివారికీ ఆత్మ సంయమనం అవసరం. సక్రమమైన జీవితాన్ని నడపండి" అని సందేశం యిచ్చాడు బుద్ధ భగవానుడు.

వైశాలి నుంచి బుద్ధ భగవానుడు మజిలీల మీద అక్కడక్కడా ప్రచారం గావిస్తూ, మల్లుల రాజధాని 'కుశ నగరం' చేరుకొని, అక్కడకు సమీపంలోని 'పావా' అనే గ్రామంలో విడిది చేసాడు. అక్కడ 'చుండు' అనే కమ్మరి ఆతిధ్యం స్వీకరించాడు. కానీ 'చుండు' యిచ్చిన ఆతిధ్యం, భోజనం బుద్ధుని దుర్బల శరీరం యిముడ్చుకోలేక పోయింది.

అందువల్ల తిరిగి జబ్బు చేసింది. ఎలాగో అతికష్టం మీద 'కుశినారా' చేరుకున్నాడు. అక్కడ పెద్ద మద్ది చెట్ట నీడలో పరిశుభ్రమైన వస్త్రాన్ని పరచవలసిందిగా ఆనందుని కోరాడు. దాని మీద బుద్ధ భగవానుడు విశ్రమించాడు. ఆ సమయంలో ఆయన్ను దర్శించు కోవడానికి మల్ల సామంతులు వచ్చారు. బుద్ధుడు వారికి ధర్మోపదేశం గావించాడు. సామంతులు వెళ్లిపోయిన తరువాత బుద్ధుడు విశ్రాంతిగా పడుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో కొంత సేపటికి "సుబుద్దుడు" అనే అతను వచ్చి బుద్ధ భగవానుని దర్శించాలని అన్నాడు.

"ఆయన బాగా అలిసిపోయారు. విశ్రాంతి తీసుకుంటున్నారు" అన్నాడు ఆనందుడు. ఆ మాటలు బుద్ధ భగవానుడు విన్నాడు. "ఆనందా! అతన్ని నావద్దకు తీసుకొని రా!" అన్నాడు. చివరి దశలో భగవానుడు తన సందేశాన్ని సుబుద్దునికి వినిపించాడు. సుబుద్దుడు బుద్ధ దీక్ష తీసుకున్నాడు. ఇతడే చివరి శిష్యుడు.

బుద్ధుని పరిస్థితి దిగజారింది. అక్కడ వున్న పరివ్రాజకులందరూ ఆయన చుట్టూ చేరారు. బుద్ధుడు వారికి చివరి సందేశాన్ని యిచ్చారు. "చనిపోవడం సర్వ ప్రాణి లక్షణం. ఇందుకు దుఃఖించ వలసిన పనిలేదు. అందుచేత భిక్షువులారా, మీరు మంచిగా జీవించండి!' అని ఆశీర్వదించాడు.

ఆనందుడు బిగ్గరగా రోదించాడు.

"ఆనందా! ఆకురాలు కాలం వచ్చింది. ఆకులన్నీ రాలి పోతాయి. రాలిపోయే ఆకులన్నిటినీ లెక్కపెట్టలేము. మనం యీ ప్రపంచంలోకి వచ్చాం. ఏదో ఒక రోజు ప్రతివారూ యీ లోకాన్ని విడిచి వెళ్లవలసిందే. నా వంతు వచ్చింది. ఇందుకు చింతించవలసిన అవసరం ఏమున్నది? ..."


"మీరు లోకం అంతా పర్యటించండి. బుద్ధ ధర్మాన్ని ప్రచారం చేయండి!" అంటూ బుద్ధుడు మహా పరి నిర్వాణం చెందాడు.

**బుద్ధం శరణం గచ్ఛామి . . .**

**ధర్మం శరణం గచ్ఛామి . . .**

**సంఘం శరణం గచ్ఛామి . . .**





## బౌద్ధ గుహ

అజంతా, ఎల్లోరా, కార్లా, సాంచిలలోనే. కాక, మన రాష్ట్రంలో ఉండవల్లి, తదితర ప్రదేశాలన్నింటిలో బుద్ధ శిల్పులు బుద్ధుని జీవిత చరిత్ర ఘట్టాల్ని మలిచి బౌద్ధ గుహలు నిర్మించారు. శిల్ప చాతుర్యానికి, రమణీయమైన చిత్తరువులకు, చారిత్రక ఘట్టాలకు బౌద్ధ గుహలు సాక్షీభూతములుగా నిలచి పోయాయి.

**బౌద్ధ తత్వ చింతన -**

"నమోతస్స భవతో అరహతో సమ్మానము బుద్దస్స"

"పరిపూర్ణ అర్హతుడైన బుద్ధునికి నమస్కారం"

త్రిశరణములు - పాళీలో "తిసరణ" అంటారు

**బుద్ధం సరణం గచ్ఛామి**

**ధర్మం సరణం గచ్ఛామి**

**సంఘం సరణం గచ్ఛామి**

ఈ త్రి శరణాలు బౌద్ధ ధర్మంలో అతి ముఖ్యమైనవి.

**పంచశీల :**

1. పాణాతి పాతా వేరమణిసిక్షా పదం సమాదియామి
2. ఆదిన్నా దానా వేరమణీ సిక్షా పదం సమాదియామి
3. కామేసు మిచ్ఛాచారా వేరమణీ సిక్షా పదం సమాదియామి
4. ముసావాదా వేరమణీ సిక్షాపదం సమాదియామి
5. సురామేరయమజ్జపమా దట్ఠానా వేరమణీ సిక్షా పదం సమాదియామి

తెలుగు : 1. ప్రాణి హింస జేయనను శిక్షాపథమును గైకొనుచున్నాను.

2. దొంగతనం జేయనను శిక్షాపథమును గైకొనుచున్నాను.
3. వ్యభిచారము చేయనను శిక్షాపథమును గైకొనుచున్నాను.
4. అసత్యం చెప్పనను శిక్షా పథమును గైకొనుచున్నాను.
5. మత్తునిచ్చు మద్యములను సేవించను అను శిక్షాపథమును గైకొనుచున్నాను.

**అష్టాంగ మార్గం : న్యాయమైన జీవితం :**

(1) సమ్మదిత్తి : సమమైన దృష్టి

(2) సమ సంకప్పో : సరియైన సంకల్పం

(3) సమ్మవక్కా : సరియైన వాక్కు

(4) సమ్మకమతో : సరియైన ప్రవర్తన

(5) సమ్మ అజీవో : సరియైన జీవనం

(6) సమ్మవ్యాయొ : సరియైన ప్రయత్నం

(7) సమ్మస్మాతి : సరియైన జాగ్రత్త

(8) సమ్మ సమాధి : సరియైన ధ్యానము

**ఆర్యబోధి సత్త్వ మైత్రేయ ప్రవచనం :**

1. ధ్యానం యెడ కలిగియున్న నీరస భావం వల్ల ఉత్పన్నమయ్యే మందబుద్ధి

2. ధ్యానం యొక్క ఆశయాన్నే మరిచిపోయే స్థితి.

3. కామ వాంఛ కారణంగా మనస్సు ఉద్వృతమైన సంచలనానికి గానీ, మందత్వానికి గానీ గుర్రై నందువల్ల సంఘటిల్లే అవాంతరాలు.

4. పై అవాంతరాలను అడ్డుకొనే శక్తి లోపించుట.

5. ఊహాజనితాలైన అవాంతరాలు - వాటిని యెదుర్కొనేందుకు అవాస్తవికమైన చర్యలు తీసుకొనుట.

పైన చెప్పబడిన వ్యక్తి లోపములను సరిదిద్దుకొనుటకు బౌద్ధంలో క్రింది సూత్రాలను అందించింది.

1 ధ్యాన నిష్ఠ యొక్క సుగుణముల యెడను, వాటిని విచక్షణ చేయుట యందును పరిపూర్తి విశ్వాసమును కలిగి యుండును.

2. ధ్యాన నిష్ఠ యందు నిమగ్నమగుట - అట్లు నిమగ్నమగుట యందు వారికి శక్తి సామర్థ్యములు కలవని దృఢ విశ్వాసము కలిగి యుండుట.

3. అచంచల దీక్ష కలిగి ఆనంద మనస్కులై యుండుట.

4. మానసిక, శారీరక దివ్యానుభూతిని పొందుట.

5. ధ్యానం మందు కేంద్రీకరించ వలసిన పదార్థము యెడ అచంచల దీక్షా శ్రద్ధలను కలిగి యుండుట.

6. సోమరితనం లేక భీకర ఆందోళనవైపు మొగ్గు చూసే పరిస్థితుల యెడ అత్యంత జాగురూకత వహించుట.

7. ఏదైనా ఒక వికర్షణ లేక భంగపాటు వాటిల్లుతుందని కనుగొనిన తక్షణం దానిని ఎదిరించి విదలించేందుకు సిద్ధంగా మనస్సు దృఢంగా వుండాలి.

8. ఆశించిన జీవితాల్ని సాధించినపుడు ముఖ్యంగా ముందుగా అనుసరించబట్టి ఎదురు ప్రయత్నం లేక సాధనములను సడలించుట.

పైవిధంగా బౌద్ధం మనిషిలోని బలహీనతల్ని జయించడానికి నైతిక విలువల పెంపొందించుకొని, సాంఘిక ప్రయోజనాలకు ఉపయోగ పడే జీవితాన్ని గడపడానికి ప్రాధాన్యత నిచ్చింది.

## మహాయానం

క్రీశ 100లో కనిష్కుడు ఉత్తర భారత దేశాన్ని పాలిస్తున్న రోజుల్లో బౌద్ధ సంగీతి జరుపబడింది. కనిష్టుడు నిర్వహించిన "మూడవ బౌద్ధ సంగీతి"లో బౌద్ధానికి సంబంధించి అనేక సంఘటనలు జరిగాయి. ఈ సంగీతికి దక్షిణ భారతదేశంలో ఆచార్య నాగార్జునుడు కూడా హాజరైనట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది.

ఈ మూడవ "బౌద్ధ సంగీతి"లో బౌద్ధం రెండుగా చీలిపోయింది. 1. మహాయానం, 2 హీనయానం

మహాయానులు బుద్ధుని భగవంతునిగా కొలుస్తారు. విగ్రహారాధన, పూజావిధానం మహాయానంలో కొనసాగించ బడతాయి.

మహాయానంలో "బుద్ధ పూజ" ఈవిధంగా కొనసాగించబడింది.

నిరోధ సమాపత్తితో ఉరహిత్వావియ
నిసిన్నస్స భగవతో అర్హతోసమ్మానం
బుద్ధస్స ఇమినాపుప్పేశ పూనేమి!
ఇదం పుష్ప పూజం బుద్ధ పచ్చేక బుద్ధ
అగ్గసావన్, మహాసావన్ అరహంతానం
నఖావశీలం అహింపితేశం అనుపత్తకోహామి!
ఇదం పుష్పందాని వణ్ణేనపి సువణ్ణ గంధేనపి
సుగంధం నం తానేనపి, సుసంతానం కిప్పమేవ
దువణ్ణం, దుగాధం, దుసంతోనం భవిస్థతి!
యతమేవ సచ్చే సంఖారా అనిచ్చా సచ్చే
సంఖారా దుఃఖా సచ్ఛేదమ్మా అనత్తాతి!
ఇమినా వందన మానసపూజా ఏటిపత్తి
యానుభావేన ఆసవక్షయోహోతు
సఖ్ఖ దుఃఖా వినస్సంతు!

మహాకారుణ్య మూర్తి, బుద్ధ భగవానుడు అయిన బుద్ధుని పూజా మందిరంనందు బౌద్ధులందరూ పుష్పమాలా, గంధ, ధూప మొదలగు వాటిని తథాగతునికి సమర్పించి ఆయనను ఆవిధంగా సన్మానించడం, ప్రార్థించడం జరుగుతోంది.

పూజా మందిరంలో బుద్ధ విగ్రహానికి ఎదురుగా బౌద్ధులు పాళీ భాషలోని పై ప్రార్ధనాగీతాలను వల్లె వేస్తారు.

## త్రిరత్న పూజ

యోసో భగవా అరహం సమ్మాసంబుద్ధో

స్వాక్లాతో యేన భగవతో దమ్మోప పటిపన్నో

యక్ష భాగవతో సావక సంఘో తమహో భగవత

సధమ్మం, ససంఘం ఇమేహి పప్ఫేహి పూజేమి!

భగవానుడు అర్హతుడూ, సమ్యాక్‌సాంబుద్ధుడూ అయి వుండి యెవరి ధర్మం మధురాతి మధురంగా చెప్పబడిందో ఎవరి శిష్యగణం సన్మార్గానువర్తనులై చరించుచున్నారో, అట్టి బుద్ధ భగవానుని, ఆయన ధర్మమునకు, సంఘహితముగా నేను యీ పుష్పములతో పూజించుచున్నాను.

## విపస్సన

ప్రజ్ఞ లేక జ్ఞానమును ఆధారంగా చేసుకొని శూన్యత యొక్క అనిర్వచనీయమైన భావంపై ఏకాగ్రతతో కూడిన ధ్యానం చేయవలసి వేస్తే, సమత్ భావన, జనితమైన అత్యున్నత శక్తి ద్వారా శూన్యతమై కేంద్రీకరింప వలెను.

సమ్యక్ జ్ఞానమును సాధించుటకు ప్రజ్ఞయే ధ్యాన ప్రజ్ఞ

విపస్సన భారమునకు మొదటి మెట్టు యీ సమత్ భావనయే!

నైతిక దృక్పథం సాధించుట దీని ప్రమాణం

త్రిరత్నాలను శరణు పొంది, ధర్మా పరిమైన నైతిక సూత్రాలను అనుసరిస్తూ, ఏకాగ్రత ధ్యాన నిష్టానురతుడై, బుద్ధుని ధ్యానించాలి.

నైతిక సూత్రాలను, బోధిచిత్తమును, భావజనితమైన ప్రేమ అత్యంత శ్రద్ధాసక్తులతో అనుసరించినట్లయితే - అత్యున్నత (నిర్వాణస్తితి) అయిన బుద్ధత్వాన్ని పొందగలడు.

## అష్టాంగ మార్గం

బుద్ధుని తాత్విక ప్రబోధం యిది.

ప్రపంచంలోని సర్వదుఃఖాలకు కారణంబిది

(1) దుఃఖం వుంది. (2) దుఃఖానికి కారణం వుంది. (3) దఃఖం నిరోధం చేయవచ్చును. (4) దుఃఖం నిరోధానికి మార్గం వుంది. వీటిని ఆర్య సత్యాలు అంటారు. అంటే శ్రేష్ఠమైన సత్యాలు.

బుద్ధుడు జీవితంలో మనిషి అనుభవించే అనేక బాధలకు, నిత్య ఘర్షణలకూ, మానసిక ఒత్తిడినంతా "దుఃఖం" అనే పదంతో వాడాడు. అందువల్ల దుఃఖం అనే పదంలోనే ఆయన తన దర్శనాన్ని విపులీకరించాడు.

దుఃఖ సత్యాన్ని గావించి బుద్ధుడు యీవిధంగా చెప్పాడు.

జన్మ దుఃఖం, వృద్ధాప్య దుఃఖం, రుణం దఃఖం, శోకం, భిన్నత్వం, తడబాటు, ఆందోళన యివన్నీ దుఃఖాలేనని బుద్ధుడు నిర్వచించారు. సంక్షిప్తంగా చెప్పాలంటే ఐదు ఉపాదాన స్కంధాలూ దుఃఖ హేతువులే.

**దుఃఖానికి కారణం ఏమిటి?**

తృష్ణ, భోగతృష్ణ, ప్రాపంచిక తృష్ణ, ధనం తృష్ణ, ఇంద్రియాలకు ప్రియమైన వాటి సంపర్కం. వాటి తాలూకు ఆలోచన తృష్ణలను కలిగిస్తుంది.

తృష్ణ లేక కాంక్ష. దీనిని కోరిక అనవచ్చును.


ఈ కాంక్ష కారణంగానే ఒక రాజు మరొక రాజుతో యుద్ధం చేసి అతని రాజ్యాన్ని అనుభవించాలని చూస్తాడు. క్షత్రియుడు మరో క్షత్రియునితో ఈ కాంక్ష వల్లనే శతృత్వాన్ని తెచ్చుకుంటాడు. వ్యాపారి మరో వ్యాపారితో పోటీ పడతాడు. తండ్రితో కొడుకు ఆస్తి కోసం కలహిస్తాడు. ప్రజలు తమలో తాము ఘర్షణ పడతారు. వీటన్నిటికీ యీ కాంక్ష, కోరికలే మూలకారణాలు అని బుద్ధుడు నిర్వచించాడు.

అలాంటి తృష్ణను నిరోధించడం అవసరం అని ఆయన ఉపదేశం కూడా. తృప్తితో తృష్ణను జయించవచ్చునని దారి చూపాడు. కరుణ, ప్రేమ మార్గాల ద్వారా శతృత్వాన్ని నిర్మూలించ వచ్చునని చెప్పాడు.

ఇతరులకు, సంఘ శ్రేయస్సుకు కృషి చేయడం ద్వారా ఆత్మతృప్తి చెందవచ్చునని బుద్ధుడు ఉపదేశించాడు.

# బౌద్ధుల చైత్యం

బౌద్ధులు ప్రార్థనా మందిరాన్ని చైత్యం అంటారు.



# విహారం

బౌద్ధులు నివసించే వసతి గృహాన్ని విహారం అంటారు. యిదే సంఘారామంగా పిలువ బడుతోంది. "సంఘారామం" సంఘం యొక్క బాధ్యతల్ని స్వీకరించి, సంఘశ్రేయస్సుకు తమ జీవితాల్ని అంకితం చేసుకొన్న బౌద్ధ భిక్షువుల నివాసం! యిదే వారి ఆవాసం!

# బౌద్ధ యాత్రా కేంద్రాలు

బౌద్ధంలో నాలుగు ప్రధానమైన బౌద్ధ క్షేత్రాలు నెలకొని వున్నాయి. అవి 1. లుంబిని. ఇది బుద్ధుడు పుట్టిన చోటు. లుంబిని ప్రస్తుతం నేపాల్‌లో నెలకొని వుంది. ఇది నాగౌరా రైలు స్టేషన్ నుండి నార్త్ రైలులో వెళ్లాలి. రోడ్డు మార్గం కూడ వుంది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ రవాణా సంస్థ నాగౌరా నుండి లుంబిని వరకు బస్సును నడుపుతున్నది. 36 కిలోమీటర్ల దూరంలో లుంబిని వుంది.

అంతేగాకుండా బస్తీనుండి నాగౌరాకు మార్గముంది. గోరఖ్‌పూర్ నుండి బస్తీ వెళ్లి, అక్కడ బస్తీలో బస్సు మారి నౌగారా వెళ్లే వచ్చాను. గోరఖ్‌పూర్ నుండి నౌగౌరా దూరం 181 కిలో మీటర్లు.

లుంబినిలో పర్యాటకులకు వసతి గృహాలు వున్నాయి. నేపాల్ గవర్నమెంటు వారిచే "వసతి గృహం' నిర్వహింప బడుతోంది.

లుంబిని ఒక కుగ్రామం. రాణి మాయాదేవి నిండు చూలాలుగా వుండి శుద్ధోదన మహారాజు ఏర్పాటు ప్రకారం పల్లకిలో దేవరమి పుట్టింటికి వెళుతుండగా, మార్గమధ్యంలోనే లుంబిని వనంలో ఒక వృక్షం క్రింద సిద్ధార్థుని ప్రసవిస్తుంది. అందువల్ల బుద్ధుని జన్మస్థలంగా దేశదేశాల బౌద్ధులకు లుంబిని యాత్రాస్థలంగా పరిగణింప బడింది. ఇది అంతర్జాతీయ బౌద్ధ యాత్రాస్థలం.

బుద్ధుని జననం క్రీ.పూ 563లో జరిగింది. బుద్ధ నిర్యాణం తదుపరి మగధను పాలించిన అశోక చక్రవర్తి బౌద్ధ మత స్వీకారం తదుపరి రుమిందైలో అశోకస్థంభాన్ని ప్రతిష్టించాడు.

# బుద్ధగయ

2. బౌద్ధంలో ముఖ్యమైన యాత్రస్థలాల్లో రెండవది.

సిద్ధార్థుడు తన 35వ ఏట యిక్కడ బుద్ధత్వం పొందాడు. నిరంజనా నదీతీరంలో ఊరువేళ వనంలో ఆరేళ్ళు ధ్యాన నిమగ్నుడై, వివిధ ఆశ్రమాల్ని దర్శించి, తుదకు నేటి బుద్ధగయ ప్రాంతంలో ఒక రావి చెట్టు క్రింద బుద్ధత్వం పొందాడు.

బుద్ధుడు ధ్యానం చేసి సంబుద్ధత్వం పొందిన రావిచెట్టు నేడే మహా బోధి వృక్షం'గానూ ఆస్థలం బుద్ధగయగానూ ప్రసిద్ధి చెందింది.

ఇచ్చట బుద్ధుని పాదముద్రికలు వున్నాయి. బంగారు, వజ్రములతో తాపడం చేసిన పాదముద్రికల్ని మహాబోధి ఆలయంలో వుంచి బౌద్ధులు పూజలు చేస్తారు.

మహాభోధి ఆలయం విశాలమైంది. ఇచ్చటకు వైశాఖ పౌర్ణమినాడు దేశదేశాల నుండి బౌద్ధులు విచ్చేసి, బుద్ధ విగ్రహం దర్శించి పూజలు, ప్రార్థనలు చేస్తారు.

ఈ ఆలయాన్ని క్రీ.పూ రెండవ శతాబ్దంలో అశోక చక్రవర్తి పునరుద్ధరించినట్లు యిక్కడి శాసనాల వల్ల తెలుస్తోంది. ఇచ్చట బుద్ధునికి సంబంధించిన అనేక సంఘటనలకు చెందిన స్థలాలు వున్నాయి. ప్రాచీన కాలం నాటి ప్రాంతమిది. ఈ ఆలయం దక్షిణ భారతదేశ ఆలయాల్ని పోలి వుంటుంది. ఎన్నో శిల్పాలు, చిత్తరువులు ఈ ఆలయంలో వున్నాయి.

గయ జిల్లాకు ముఖ్య పట్టణం గయ. ఇచ్చట అంతర్జాతీయ విమానాశ్రయం వుంది. గయకు 11 కిలోమీటర్ల దూరంలో "బుద్ధగయ" నెలకొని వుంది. ఢిల్లీ, కలకత్తా, లక్నో, వారణాశి వంటి అన్ని ముఖ్య పట్టణాలనుండి గయకు బస్సు, రైలు సౌకర్యం వుంది. గయనుండి బుద్ధగయకు కోచ్‌లు, చిన్నకార్లు, జట్కాలు నిత్యం లభ్యమవుతాయి. ఐ.టి.డి.ల కోచ్‌లు, కార్లను ప్రభుత్వం నడుపుతూ వుంటుంది.

ఐ.టి.డి.ల లార్జ్ సర్క్యూట్, డాక్ బంగళా, కొన్ని వసతి గృహాలు యాత్రికుల నివాసానికి అనుకూలంగా వుంటాయి.

ప్రపంచ యాత్రాస్థలం బుద్ధ గయ

# సారనాథ్


బుద్ధుడు సంబుద్ధత్వం పొందిన తర్వాత తన అయిదుగురు శిష్యులకు ప్రథమోపదేశం చేసిన స్థలం యిది. ఇచ్చట గల మృగదావనంలో బుద్ధుడు ప్రథమ ధర్మచక్ర ప్రవర్తనంగావించాడు.

వారణాశిలోని బమిత్‌జైన్ విమానాశ్రయం నుండి కోచ్‌ల ద్వారా సారనాథ్ చేరవచ్చును. వారణాశి నుండి 32 కిలో మీటర్ల దూరంలో సారనాథ్ నెలకొని ఉంది. ఢిల్లీ, ఆగ్రా, కలకత్తా, బొంబాయిల నుండి, దక్షిణ భారతదేశంలో మద్రాసు, త్రివేంద్రం, హైద్రాబాద్‌ల నుండి వారణాశికి రైలు సౌకర్యం కలదు.

ఇండియా టూరిస్టు డెవలప్‌మెంటు కార్పోరేషన్ వారిచే నిత్యం వారణాశి నుండి సారనాథ్‌కు బస్సులు, కోచ్‌లు నడపబడుతుంటాయి.

బిర్లా రెస్ట్ హౌస్, ఐ.టి.డి.సి వారి వసతి గృహాలు, వారణాశి హోటల్, హోటల్ డిపారిస్, టూరిస్టు బంగళాలు ఎన్నో యాత్రికుల వసతికి నెలకొని వున్నాయి.

క్రీ.పూ. 269లో అశోక చక్రవర్తి యిచ్చట ధమ్మక్ స్తూపాన్ని (ధర్మస్తూపం) నిర్మించాడు. యిచ్చటనే మహాబోధి గ్రంధాలయం ఉంది. బౌద్ధ సాహిత్యం, పాళీభాషలోని అనేక గ్రంథాలు యిచ్చట వున్నాయి. ఇచ్చటనే చైనా పగోడా మందిరం, టిబెట్టు మందిరాలు కూడ వున్నాయి. ఇది అంతర్జాతీయ పర్యాటక స్థలం. ప్రసిద్ధి చెందిన బౌద్ధయాత్రా కేంద్రం.



# కుశి నగర్

బుద్ధుడు యిచ్చట సమీపంలోని షావా వద్ద తన 80వ ఏట నిర్యాణం చెందాడు. హిరణ్యవతి నదీ తీరం. దీనినే "మహాపరినిర్వాణం" అంటారు.

బుద్ధుని ప్రధాన శిష్యులైన ఆనందుడు "నిన్ను బౌద్ధ ధర్మానికి అంకితం చేసుకో, సంఘసేవకు అంకితం కావాల్సింది" అన్న బుద్ధ సందేశాన్ని అనుయాయులకు వివరిస్తాడు. ఈ అమూల్యమైన సందేశం యిచ్చట శిలాఫలకంపై చెక్కబడి వుంది.

క్రీ.పూ 269లో అశోక చక్రవర్తి యిచ్చట బుద్ధస్తూపాన్ని నిర్మించాడు. బుద్ధుని మహా విగ్రహం యిక్కడ నెలకొల్ప బడింది. బుద్ధుడు నిర్యాణం చెందిన తదుపరి, ఆయనకు సబంధించిన అస్తికలు 8 భాగాలుగా చేసి దేశమంతటా 8 చోట్ల ప్రతిష్టించి స్తూపాన్ని నెలకొల్పినట్లు బుద్ధ చరిత్ర ద్వారా తెలుస్తోంది.

వారణాశి, లక్నోల ద్వారా "కుశ నగరం" చేరవచ్చును. వారణాశి నుండి గోరఖ్‌పూర్ రైలులో ప్రయాణించాలి. గోరఖ్‌పూర్ నుండి కుశినగరం బస్సులో వెళ్ళవచ్చును. గోరఖ్‌పూర్ నుండి 35 కిలోమీటర్ల దూరంలో కుశి నగర్ నెలకొని వుంది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ రవాణా బస్సులు నిత్యమూ గోరఖ్‌పూర్ నుండి నడుస్తూ వుంటాయి.

ఇది అంతర్జాతీయ బౌద్ధ కేంద్రం.

చరిత్రాత్మకంగా కుశి నగరం మల్లులకు రాజధాని, గణతంత్ర రాజ్యాల్లో మల్ల రాజ్యం ఒకటి. శాక్యులు, కోలీయులు, మల్లులు, విచ్ఛవీలు ప్రసిద్ధి చెందిన గణతంత్రం రాజులుగా వుండేవారు.

ఒక సాలవృక్షం నీడలో (మద్ది చెట్లతోట) ఆనందుడు సపర్యలు చేస్తూ వుండగా బుద్ధుడు తన 80వ ఏట యిచ్చట మహాపరినిర్యాణం చెందాడు. ఆనందుడు దుఃఖ భారంతో వివశుడై వుండగా తన తుది సందేశంగా బుద్ధుడు ఆనందా! మరణం అనేది సర్వప్రాణి లక్షణం. ఇందుకు విచారించ వలసిన పనిలేదు. నాతదనంతరం బుద్ధ ధర్మాన్ని లోకంలో పరివ్యాప్తం చేయండి" అంటూ తనువు వదిలాడు.

# స్వీయ ప్రయత్నం

తన తదనంతరం సంఘం బాధ్యతల్ని ఏ ఒక్కరికో బుద్ధుడు ధారదత్తం చేయలేదు. ఆయన తన వారసులుగా ఎవరినీ ప్రకటించలేదు.

శిష్యులందరూ కలిసికట్టుగా వుండాలని చెప్పాడు. ఇందులో స్వీయ ప్రతిభను, అంకిత భావం ప్రాతిపదికతో మాత్రమే ఎవరైనా అర్హత పొందుతారని, కృషి చేస్తే ప్రతి ఒక్కరూ అందుకు అర్హులేనని బుద్ధుడు చెబుతూ వుండేవాడు.

మహాకాశ్యపుడు, ఆనందుడు, సారిపుత్రుడు, మొగ్గలాయనుడు తదితర బౌద్ధ ప్రముఖులు కూడా సంఘం నాయకత్వం కొరకు తాపత్రయ పడలేదు. "తమరు" అంటే కాదు "తమరే" అని ఎదుటి వారిని గౌరవించడమే జరిగింది, కానీ సంఘ నాయకత్వం నాకు అంటే కాదు నాకే అని ఎవరూ ముందుకు రాలేదు. మానవీయమైన విలువలకు, నమ్రత, సౌశీల్యానికి బౌద్ధం పెట్టింది పేరు. అందువల్ల "బౌద్ధ సంఘం" బుద్ధుని తర్వాత మహాకాశ్యపునిచే కొంతకాలం నడపబడింది.

ఆ తర్వాత కొంత కాలానికి దేవవాదులు, స్థవిరవాదులు అంటూ సంఘంలో సిద్ధాంతపరమైన విభేదాలు పొడసూపాయి. క్రీ.శ 1వ శతాబ్దానికి 'మహాయాన', 'హీనయాన' అనే పేర్లతో రెండుగా చీలింది.

ఎన్ని విభేదాలు వున్నప్పటికీ బౌద్ధంలో బుద్ధుని పట్ల అనుసరించవలసిన విధి విధానంలో వచ్చిన మార్పులే కాని, మరొక కారణం అంటూ ఏవీ లేదు. తదుపరి వచ్చిన ఆచార్య నాగార్జునుడు బుద్ధుని క్షణిక వాదానికి మరింత బలాన్ని చేకూర్చి "మాధ్యమిక వాదానికి" రూపకల్పన చేసాడు.

ఆచార్య నాగార్జునుడు రెండవ బుద్ధుడిగా బౌద్ధసంఘంలో కీర్తింపబడినాడు. ఆయన రచించిన మాధ్యమిక కోరికలు, బుద్ధుని క్షణిక, అనాత్మవాదానికి సంబంధించినవే.

# మహా పరి నిర్యాణం

బుద్ధుడు తన 80వ ఏట మల్లరాజ్యం రాజధాని కుశి నగర్‌లో క్రీ.పూ 483లో మహా పరినిర్యాణం చెందాడు.

అంతట ఆయన ప్రధాన శిష్యులైన ఆనందుడు, మహాకాశ్యపుడు, సారిపుత్రుడు, మొగ్గలాయనుడు, ఉపారి, అగులీమాలుడు తదితరులంతా బుద్ధుని దేహానికి అంతిమ క్రియలు నిర్వహించారు.


అప్పుడు బుద్ధుని అస్తికలను 8 భాగాలుగా చేసి దేశంలోని 8 చోట్ల భద్రపరిచారు. ఆయన దంతం ప్రస్తుత శ్రీలంకలోని కాండిలోని "దళడమలిగ" మందిరంలో భద్రపరచ బడింది.

ఒక అస్తికల భాగం దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అమరావతి (ధాన్యకటకం)లోని బుద్ధ స్తూపం క్రింద భద్రపరచబడింది. నేటి భట్టిప్రోలులో లభించిన దంతం బంగరు పేటికలో లభ్యం కాగా, దాన్ని అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో జరుపబడిన 2500 బుద్ధ జయంతి సందర్భంగా కలకత్తాలోని మహాబోధి ఆలయానికి తరలించబడి, అచ్చట భద్రపరచబడింది.

నేడు ప్రపంచంలోని అనేక దేశాలు శ్రీలంక, చైనా, జపాన్, బర్మా, వియత్నాం, కొరియా, థాయ్‌లాండ్, మంగోలియా, తైవాన్, కంపూచియా దేశాలు తమ అధికారయుతంగా బౌద్ధాన్ని స్వీకరించాయి.

నేటి మానవాళికి అవసరం అయిన బౌద్ధం అజరామరమైంది.

Acc. No. 23360
293 CHI
రు-54-00.



# పరిచయము



శ్రీ భూక్యాచిన వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన జాతుల సంక్షేమ సంఘాధ్యక్షులుగా గిరిజన జాతుల సంక్షేమానికి పాటుపడేవ్యక్తి.

**ది. 1-6-1953** సంలో గుంటూరుజిల్లా దుర్గిగ్రామంలో మధ్య తరగతి సుగాలి కుటుంబంలో జన్మించారు.

ఆంధ్ర క్రిష్టియన్ కాలేజి (గుంటూరు)లో బి.ఏ.వరకు చదివారు. విద్యార్థిదశలో కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొని 1976లో జిల్లా యువజన కాంగ్రెసు పార్టీ కార్యదర్శిగా పనిచేసారు.

1977 - 1985 నాగార్జున విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యులుగా పనిచేసారు.

1987 నుండి నేటిదాక పూజా పబ్లికేషన్ స్థాపించి, (1) భారతదేశ గిరిజనులు, (2) ది డాన్ ఆఫ్ న్యూ ఎరా, (3) కన్యాకుమారి, (4) ఉషోదయం, (5) గిరిజన స్రవంతి, (6) ఏకపాత్రలు, (7) ప్రేమా నీ స్థానమెక్కడ? (8) చీకటి కడుపు చీల్చుకువచ్చిన దళితజ్యోతి-భారతరత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ మొదలైన అనేకరచనలు చేసారు.

1979 - 83 శ్రామిక విద్యా పీఠం (గుంటూరు) డైరెక్టరుగా పనిచేసారు.

1980-82 ఎ.పి.యస్.ఆర్.టి.సి., ఐ.యన్.టి.యు.సి. విభాగానికి గుంటూరు జిల్లా కార్యదర్శిగా పనిచేసారు.

1981-85 గుంటూరు జిల్లాగ్రంథాలయ సంస్థ డైరెక్టరుగా, పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు.

1981-86 గుంటూరు మున్సిపాల్టీ 12వ వార్డ్ కౌన్సిలర్‌గా వున్నారు.

1984-85 రాష్ట్రకాంగ్రెస్ (ఐ) యస్.టి.యస్.సి. సెల్ కార్యదర్శిగా పనిచేసారు.

1987-92 బెల్లంకొండ మండల ప్రజాపరిషత్తు అధ్యక్షులుగా వుండి ఆ మండలాభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారు. 1995లో మళ్ళీ ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

1978 లో బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని "నడక" దినపత్రికను స్థాపించి, సంపాదకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.

1980 నుండి నేటివరకూ గుంటూరు ప్రెస్‌క్లబ్ కార్యదర్శిగా రెండుసార్లు ఎన్నికై జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు.

1984 లో జిల్లాకాంగ్రెసు పార్టీ ప్రచారవిభాగానికి కన్వీనరుగా ఉండి నేటిదాకా జరిగిన ఎన్నికలలో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తు, కాంగ్రెసు (ఐ) పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నారు.

1993 నుండి జిల్లా చిన్నపత్రికా సంపాదకుల సంఘాధ్యక్షులుగా వుండి చిన్న పత్రికా సంపాదకుల సంక్షేమానికి కృషి చేస్తున్నారు.

చిరునామా : శ్రీ భూక్యాచిన వెంకటేశ్వర్లు. డి. నెం. 7-16-68/1 వల్లూరివారితోట,
గుంటూరు - 522 002. ఫోన్ : 35692

Title Printed By **BABU REPRO GRAPHICS**, Lalapet, Guntur - 522 003.